






కనిగిరిలో చంద్రబాబు బస వద్ద ఉమ్మడి జిల్లా నేతలు (ఇన్‌సెట్లో) భుజం తట్టి ఉగ్రను అభినందించి విజయసంకేతం చూపుతున్న టీడీపీ అధినేత చంద్రబాబు

టీడీపీలోకి జిల్లాలోని కొందరు నాయకులు వలస వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు కొందరు ముఖ్య నేతలతో విడివిడిగా భేటీ అయి చర్చలు జరిపారు. ప్రత్యేకించి ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తో ఎక్కువసేపు ఏకాంతంగా మాట్లాడటం ఆపార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశమైంది. ఆ తర్వాత అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవి, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్యతో కూడా విడివిడిగా చర్చించారు. శనివారం ఉదయం కనిగిరి అమరావతి గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన బస వద్ద ఈ భేటీలు జరిగాయి. ఈ సందర్భంగా చంద్రబాబు నేతలకు పలు సూచనలివ్వడంతో పాటు, అందరినీ కలుపుకుపోవాలని వ్యాఖ్యానించినట్లు సమాచారం.

చేరికలపై సంకేతం

తొలుత దామచర్ల, ఆ తర్వాత గొట్టిపాటి, సత్యలతో..
విడివిడిగా మాట్లాడిన టీడీపీ అధినేత
భుజం తట్టి ఉగ్రకు అభినందనలు
మార్చిలోనే సాధారణ ఎన్నికలు
సిద్ధం కావాలని ఆదేశం

ముగ్గురు నేతలతో చంద్రబాబు ఏకాంత భేటీ

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

కనిగిరిలో శుక్రవారం జరిగిన బహిరంగసభలో పాల్గొన్న టీడీపీ అధినేత చంద్రబాబు రాత్రికి అక్కడి టీడీపీ కార్యాలయంలో బస చేశారు. రాత్రే పార్టీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలందరితో సంయుక్తంగా మాట్లాడిన ఆయన శనివారం ఉదయం ఇద్దరు, ముగ్గురు నాయకులతో ఏకాంతంగా చర్చించారు. ఆయన తిరుగు ప్రయాణానికి సిద్ధమైన వెంటనే తన వాహనంలో ఒంగోలు మాజీ ఎమ్మెల్యే జనార్దన్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. రమారమి 15 నిమిషాలపాటు ఆయనతో మాట్లాడారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. కొత్తగా పార్టీలో చేరే వారి విషయాన్నే చంద్రబాబునాయుడు పరోక్షంగా ప్రస్తావించినట్లు తెలుస్తోంది. అంతకుముందు శుక్రవారం రాత్రి అందరితో మాట్లాడేటప్పుడు కూడా 'ఎలాంటి చిన్న అవకాశాన్ని కూడా విస్మరించకూడదు.. అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకుని రాష్ట్ర భవిష్యత్ కోసం ఈ ప్రభుత్వాన్ని గద్దెదించాలి. అందుకు ఉపయోగపడేవారు ఉంటే పార్టీలోకి తీసుకోవడంలో తప్పులేదు. ఒకరిద్దరు మన నుంచి కూడా వెళ్లిపోవచ్చని అంటూ అందరినీ కలుపుకుపోవాలి' అని చెప్పారు. అదేవిషయాన్ని శనివారం జనార్దన్‌తో కూడా అన్నట్లు తెలిసింది. ఒంగోలు ఎంపీ మాగుంట టీడీపీలోకి రావడం ఖాయమన్న ప్రచారం జరుగుతోంది. ఆయనతోపాటు బాలినేని, ప్రకాశం నెల్లూరు జిల్లాల్లో మరో ఒకరిద్దరు నాయకులు కూడా టీడీపీలో చేరే అవకాశం లేకపోలేదు. ఆ దిశగా చర్చ జరుగుతున్నట్లు తెలిసింది.

గొట్టిపాటితో భేటీ

జనార్దన్‌తో భేటీ అనంతరం అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌తో చంద్రబాబు ఏకాంతంగా మాట్లాడారు. ఇటీవల ఉమ్మడి జిల్లాలో పార్టీ అంశాలకు సంబంధించి గొట్టిపాటి రవికి ప్రాధాన్యతనిచ్చి చంద్రబాబు మాట్లాడుతున్న విషయం విదితమే. శనివారం కూడా ఎక్కువసేపు ఆయనతో ఏకాంతంగా చర్చించడంతో జిల్లాలో కొత్తగా పార్టీలో చేరే అవకాశాలున్న వారి విషయంపైనే అయి ఉండవచ్చని భావిస్తున్నారు.

ఆతర్వాత సత్యతో కూడా చంద్రబాబు ప్రత్యేకంగా మాట్లాడారు. ఇటీవల కొండపి నియోజకవర్గానికి మంత్రి సురేష్‌ను అభ్యర్థిగా వైసీపీ ప్రకటించిన నేపథ్యంలో సత్యతో ఆయన మాట్లాడటం, పలు సూచనలు చేయటం విశేషం. ఆ తర్వాత కనిగిరి ఇన్‌చార్జి ఉగ్రను పిలిపించుకుని బస్సులో మాట్లాడారు. కార్యక్రమం బాగా చేశారంటూ భుజం తట్టి అభినందించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా సభాప్రాంగణం ఏర్పాటుచేసిన స్థలానికి సంబంధించి యజమానులను ఆయన చంద్రబాబుకు పరిచయం చేశారు.

మార్చిలో ఎన్నికలు... రెడీగా ఉండండి

కనిగిరిలో శుక్రవారం రాత్రి బహిరంగసభ అనంతరం అక్కడి టీడీపీ కార్యాలయంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు, ముఖ్యనాయకులతో చంద్రబాబు సమావేశం నిర్వహించారు. ఆ సందర్భంగా 'మార్చి ఒకటి రెండు వారాలలో, కాకుంటే చివరి వారంలో అయినా సార్వత్రిక ఎన్నికలు జరగవచ్చు. మీరు అన్నివిధాలా సిద్ధంగా ఉండాలి. ఏ విషయంలో నిర్లక్ష్యంగా ఉన్నా క్షమించేది లేదు' అని తేల్చి చెప్పారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఎవరెవరు ముందున్నారు, ఎవరెవరు ఇంకా వెనుకబడి ఉన్నారన్న విషయాన్ని చెప్పి పలు సూచనలు, హెచ్చరికలు చేశారు. ఒంగోలు లోక్‌సభ పరిధిలో మొదటిస్థానంలో కనిగిరి, రెండో స్థానంలో వైపాలెం ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికీ అన్నిరోజులూ నియోజకవర్గంలో ఉండకుండా హైదరాబాదో, బెంగళూరుకో వెళ్లి వస్తున్న కొందరు నాయకులను ఇక టూర్లు తగ్గించండి.. ఇక్కడే అందుబాటులో ఉండండని సూచించినట్లు తెలిసింది.

29న చీరాలలో సభ

బాపట్ల లోక్‌సభ ఎన్నికల సమర శంఖారావం సభ ఈనెల 29న చీరాలలో నిర్వహించాలని నిర్ణయించారు. ఆమేరకు ఆ నియోజకవర్గ ఇన్‌చార్జి కొండయ్యకు, బాపట్ల లోక్‌సభ పరిధిలోని మిగిలిన నాయకులకు సమాచారం ఇచ్చి ఏర్పాట్లపై దృష్టిసారించాలని చంద్రబాబు సూచించారు.

ఏలూరికి వెంకటగిరి సభ పర్యవేక్షణ బాధ్యత

తిరిగి వెళ్లే సమయంలో హెలిప్యాడ్ వద్ద చంద్రబాబు బాపట్ల లోక్‌సభ అధ్యక్షుడు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో ప్రత్యేకంగా మాట్లాడారు. తిరుపతి జిల్లా వెంకటగిరిలో తిరుపతి లోక్‌సభ నియోజకవర్గ బహిరంగసభ ఏర్పాట్లను పర్యవేక్షించాలని, అక్కడుండి కార్యక్రమ విజయవంతానికి చర్యలు తీసుకోవాలని ఆయనకు సూచించారు. ఆ మేరకు శనివారం చంద్రబాబు కనిగిరి నుంచి వెళ్లగానే ఏలూరి బయలుదేరి వెంకటగిరి వెళ్లారు.



మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి



మాజీ మంత్రి శిద్దా రాఘవరావు

ఒంగోలు అభ్యర్థి కోసం వైసీపీ మల్లగుల్లాలు

తాము పోటీ చేయలేమని విజయసాయికి శిద్దా సమాచారం
అభ్యర్థుల బదిలీల్లో భాగంగా బాలినేనికి గిద్దలూరు కేటాయించిన జగన్
తాజాగా ఆయన పార్టీలో ఉంటారా? లేదా? అనే అనుమానం

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

జిల్లా కేంద్రమైన ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీచేసే అభ్యర్థి ఎంపికపై వైసీపీ అధిష్ఠానం మల్లగుల్లాలు పడుతోంది. బాలినేనిని కాదని కొత్తవారికి అవకాశం ఇవ్వాలనుకున్న సీఎం జగన్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఒంగోలు నుంచి తాము పోటీ చేయలేమని దర్శి టికెట్ ఇస్తే రంగంలోకి వస్తామని విజయసాయిరెడ్డికి మాజీ మంత్రి శిద్దా రాఘవరావు సమాచారం పంపారు. ప్రస్తుతం ఒంగోలు ఎమ్మెల్యేగా ఉన్న సీనియర్ నాయకుడు బాలినేని శ్రీనివాసరెడ్డికి ఏడాదిన్నర నుంచి ముఖ్యమంత్రి జగన్ పార్టీలో ప్రాధాన్యత తగ్గిస్తూ వస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆ పార్టీ అభ్యర్థుల బదిలీల ప్రక్రియకు ఆయన శ్రీకారం పలికారు. అందులో భాగంగా బాలినేనిని గిద్దలూరు పంపి ఒంగోలుకు శిద్దా కుటుంబం నుంచి అభ్యర్థిని బరిలోకి దింపాలని భావించారు. రాఘవరావు కుమారుడు సుధీర్‌ను రంగంలోకి రావాలని సూచించారు. అయితే మూడు, నాలుగు రోజుల తర్జనభర్జనల అనంతరం శిద్దా రాఘవరావు ఒంగోలు నుంచి తనకు కానీ, తన కుమారుడుకు కానీ పోటీచేసే ఉద్దేశం లేదని ఓ ముఖ్య నాయకుడి ద్వారా విజయసాయిరెడ్డికి సమాచారం పంపినట్లు తెలిసింది.

ప్రత్యామ్నాయంపై దృష్టి

ఒంగోలు టికెట్ విషయానికి వస్తే అసలు బాలినేని పార్టీలో ఉంటారా... బయటకుపోతారా? అన్న అనుమానాలు లేకపోలేదు. దీనికితోడు తనను మర్యాదపూర్వకంగా కూడా పిలవకుండా అభ్యర్థుల ఎంపికపై నిర్ణయాలు తీసుకోవడం పట్ల ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇంకో వైపు జగన్ తాను తీసుకున్న నిర్ణయాలను మార్చుకోవడం అంత సులువైన విషయం కాదనేది జగమెరిగిన సత్యం. దీంతో బాలినేని పార్టీలో ఉంటే ముందుగానే చెప్పినట్లు ఆయన్ను గిద్దలూరు పంపి ఒంగోలుకు కొత్తవారినే తీసుకురావాలన్న ఆలోచనలో జగన్ ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం శిద్దా పోటీకి ససేమిరా అనడంతో ఇతరత్రా ఆలోచనలు కూడా చేస్తున్నట్లు తెలిసింది. దర్శి నుంచి పోటీకి అవకాశం లేదని అక్కడి సిటింగ్ ఎమ్మెల్యే మద్దిశెట్టికి ఇప్పటికే తేల్చి చెప్పడంతో తనకు ఒంగోలు లోక్‌సభ టికెట్ ఇవ్వాలని ఆయన జగన్‌ను కోరారు. అయితే ఒంగోలు లోక్‌సభ స్థానం నుంచి వైవీ సుబ్బారెడ్డి కుంటుంబాన్ని రంగంలోకి తేవాలన్న ఆలోచనలో ఉన్న జగన్.. ఆ విషయంలో మద్దిశెట్టికి ఎలాంటి హామీ ఇవ్వలేదని తెలిసింది.

ప్రస్తుతం బాలినేనిని నమ్మలేని స్థితిలో ఉన్న జగన్.. శిద్దా కూడా పోటీకి ససేమిరా అనడంతో ఒంగోలు అసెంబ్లీ టికెట్ విషయంలో మద్దిశెట్టి వేణుగోపాల్, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు పేర్లు కూడా పరిశీలించే అవకాశం లేకపోలేదు. అయితే అటు మాగుంట, ఇటు బాలినేని సహకారం లేకుండా ఒంగోలు నుంచి వైసీపీ పక్షాన పోటీ చేసేందుకు ఎవరూ ముందుకు వచ్చే పరిస్థితి కనిపించటం లేదు. దీంతో మున్ముందు ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థి ఎంపిక విషయంలో జగన్ ఎలా ముందుకు పోతారన్నది చూడాల్సి ఉంది.

నేడు ముత్యాల ముగ్గుల పోటీలు

- ఒంగోలు, గిద్దలూరులలో నిర్వహణ
- పెద్దసంఖ్యలో పేర్లు నమోదు చేసుకున్న మహిళలు

ఒంగోలు (కల్చరల్)/గిద్దలూరు, జనవరి 6 : ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలకు సర్వం సిద్ధమైంది. ఆదివారం ఒంగోలు, గిద్దలూరుల్లో ఇవి జరగనున్నాయి. "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంకు ముత్యాల ముగ్గుల పోటీలు పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగుళూరు, రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన" వారి సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయి. ఒంగోలులో శ్రీ సరస్వతీ విద్యాసంస్థల సౌజన్యంతో పీవీఆర్ బాలుర హైస్కూల్‌లోని క్రీడా మైదానం, గిద్దలూరులో లక్ష్మీ మిల్క్ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సౌజన్యంతో రిక్రియేషన్ క్లబ్ రోడ్డులో ఉన్న టెన్నిస్ స్టేడియంలో పోటీలు జరుగుతాయి. పోటీల్లో పాల్గొనేందుకు మహిళలు పెద్ద సంఖ్యలోనే పేర్లు నమోదు చేసుకున్నారు. ఒంగోలులో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా ఎల్‌ఈడీ స్మార్ట్ టీవీ, వాషింగ్ మెషిన్, ట్రావెలింగ్ లగ్జరీ సూట్‌కేస్ ఇవ్వనున్నారు. వీటితోపాటు 10 మందికి ప్రోత్సాహక బహుమతులు ఉంటాయి. గిద్దలూరులో ప్రథమ బహుమతిగా రూ.10వేలు, ద్వితీయ బహుమతిగా రూ.6వేలు, తృతీయ బహుమతిగా రూ.4వేలను అందించనున్నారు. అలాగే పోటీలో పాల్గొనే ప్రతి



మహిళకు ప్రత్యేక బహుమతి ఉంటుంది. వీటితోపాటు కన్సొలేషన్ బహుమతులను కూడా ఇవ్వనున్నారు. పోటీలకు అర్థగంట ముందుగా ప్రాంగణానికి చేరుకోవాలని నిర్వాహకులు సూచించారు.

ABN ఆంధ్రజ్యోతి



జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలను ప్రారంభిస్తున్న వెంకట్

అట్టహాసంగా ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు

- ప్రారంభించిన జనసేన పార్టీ నేత వెంకట్

దర్శి, జనవరి 6 : జనసేన పార్టీ నియోజకవర్గ నాయకుడు గరికపాటి వెంకట్ ఆధ్వర్యంలో దర్శిలో శనివారం జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు అట్టహాసంగా మొదలయ్యాయి. వెంకట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్శిలో పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. తొలిరోజు నాలుగు పళ్ల ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహించగా 38 జతలు పాల్గొన్నాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చిన ఎడ్లు పోటాపోటీగా బండను లాగాయి. పోటీలను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి అధికసంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. వారిలో మహిళలు కూడా ఎక్కువ మంది ఉన్నారు. వచ్చిన ప్రజలకు గరికపాటి ట్రస్ట్ ఆధ్వర్యంలో భోజనాలు సమకూర్చారు. గరికపాటి వెంకట్ తండ్రి గరికపాటి లక్ష్మయ్య ఆధ్వర్యంలో ఎవ్వరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ, నియోజకవర్గ ఇన్‌చార్జి బొటుకు రమేష్‌బాబు, జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



ప్రతులను కాల్చి నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఎస్మాపై ఫైర్

- జీవో ప్రతులు దహనం చేసిన అంగన్‌వాడీలు
- విధుల్లో చేరకుంటే వేటు తప్పదంటున్న అధికారులు
- తగ్గేదే లేదంటున్న కార్యకర్తలు, ఆయాలు

లోపలి పేజీల్లో

పొగాకు రైతులకు వడ్డీలేని రుణం

• రీజనల్ మేనేజర్ లక్ష్మణరావు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 6 : దక్షిణ ప్రాంత తేలిక, నల్లరేగడి నేలల్లో మీ చౌంగ్ తుఫాన్ వల్ల పంట దెబ్బతిన్న రైతులకు రైతు సంక్షేమ నిధి నుంచి రూ. 10వేలు వడ్డీలేని రుణం పొగాకు బోర్డు ద్వారా పొందవచ్చని రీజనల్ మేనేజర్ లక్ష్మణరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పొగాకు బోర్డు రైతు సంక్షేమ నిధి సభ్యులై, అర్హులైన రైతులు సంబంధిత వేలం కేంద్రాలలో సంబంధిత అధికారిని సంప్రదించి దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు.

26నుంచి ఉత్తరాల కార్యక్రమం

మద్దిపాడు, జనవరి 6: గుండ్లకమ్మ ఆయకట్టు రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీ నుంచి సాగునీటి సమస్యలపై ముఖ్యమంత్రి కార్యాలయానికి ఉత్తరాలు రాసి రైతులు తమ నిరసనను తెలయిజేయనున్నట్టు రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి వడ్డే హనుమారెడ్డి తెలిపారు. శనివారం మద్దిపాడులో జరిగిన ఆయకట్టు రైతు సంఘం సమావేశానికి సహాయ కార్యదర్శి రావి ఉమ మామహేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా హనుమారెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమన్నారు. సమావేశంలో నాయకులు తొట్టెపూడి వెంకటశేషయ్య, స్వర్ణ కృష్ణయ్య, కట్టా పున్నయ్య, సీహెచ్.అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రమాదేవి మరణం టీడీపీకి తీరనిలోటు



రమాదేవి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మద్దిపాడు, జనవరి 6: ముల్లూరి రమాదేవి మరణం టీడీపీకి తీరనిలోటని మద్దిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మండవ రంగారావు పేర్కొన్నారు. శనివారం దొడ్డవరప్పాడులో రమాదేవి దశదినకర్మ కార్యక్రమంలో ఆయన పాల్గొని రమాదేవి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అడక స్వాములు మాట్లాడుతూ రమాదేవి టీడీపీ అభ్యున్నతికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, దేవబత్తిన ప్రసాద్, గోరంట్ల చిరంజీవి, చింతల శ్రీను, ఫణీంద్ర, ఎం. అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమంగా తీసుకోవాలి

● జడ్పీచైర్‌పర్సన్ వెంకాయమ్మ



పోటీలను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎంపీపీ శ్రీనివాసరావు

చీమకుర్తి, జనవరి 6: క్రీడల్లో గెలుపోటములు సహజమని, వాటిని క్రీడా స్ఫూర్తితో సమంగా తీసుకుని ముందుకు సాగాలని జడ్పీచైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తెలిపారు. బూదవాడ గ్రామంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను శనివారం చైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు సరదాగా క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరచారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ మేదరమెట్ల శ్రీనివాసరావు, సర్పంచ్ జనరాజుపల్లి మరియమ్మ, సామ్యుల్, పాపిరెడ్డి, సత్యనారాయణ, సంజీవరెడ్డి, యాకోబు, దుద్దుకూరు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

మద్దిపాడు, జనవరి 6: ఇనమనమెళ్లూరులో జిల్లాస్థాయి క్రికెట్ టెన్నిస్‌బాల్ పోటీలను గద్దె జాలయ్య, ఎంపీటీసీ వాకా కోటిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నుంచి జరుగుతాయని నిర్వాహకులు గెద్ద జాలయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతి రూ.50,116, రెండవ బహుమతి రూ.25,116, మూడవ బహుమతి రూ.15,116 అందజేయనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9849341159 సెల్ నంబరులో సంప్రదించాలని కోరారు.


నూతన కార్యవర్గం ఎన్నిక



నియామక పత్రాలను అందజేస్తున్న జగదీష్

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 6 : ఆంధ్రప్రదేశ్ విద్యార్థి యువజన జేఏసీ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం ఒంగోలులోని శర్మా కళాశాల వద్ద ఉన్న జేఏసీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు రాయపాటి జగదీష్ ఆధ్వర్యంలో ఈ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా పెట్లూరు కార్తీక్, ప్రధాన కార్యదర్శిగా పిడతల కరుణాకర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రాము, డివిజన్ అధ్యక్షుడుగా ఎన్.శ్రీకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఒగిరాల సూర్యప్రకాష్, ఉపాధ్యక్షుడుగా శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా అవినాష్‌కుమార్, కార్యదర్శులుగా ప్రవీణ్‌కుమార్, రవికుమార్‌లను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులకు జగదీష్ నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిత్యసాయి, రాష్ట్ర కార్యదర్శి సురేష్, కోటి, అశోక్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

క్విస్ ఇంజనీరింగ్ కళాశాల పరిశీలన



కళాశాలను పరిశీలిస్తున్న డీఆర్వో శ్రీలత

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 6 : వచ్చే సాధారణ ఎన్నికలలో స్ట్రాంగు రూములు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఉన్న అవకాశాన్ని శనివారం సాయంత్రం ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలను జిల్లా రెవెన్యూ అధికారి ఆర్.శ్రీలత పరిశీలించారు. కాలేజీ నిర్వహకులతో ఆయా అంశాలపై చర్చించారు. ఈ భవనాల్లోని గదులను కొలిపించారు. ఇక్కడి పరిస్థితిని కలెక్టర్ దినేష్‌కుమార్‌కు నివేదిస్తామని డీఆర్వో తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో విశ్వేశ్వరరావు, తహసీల్దార్ మురళీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అపెక్స్‌లో ఉచిత వైద్యశిబిరం



శిబిరంలో పాల్గొన్న నిర్వాహకులు

ఒంగోలు(విద్య), జనవరి 6: ఒంగోలు నగరం సుజాత నగర్ లోని అపెక్స్ స్కూలులో పాఠశాల వ్యవస్థాపకులు మండాది శ్రీనివాసరెడ్డి జయంతి సందర్భంగా మండాడి శ్రీనివాసరెడ్డి మెమోరియల్ ఆధ్వర్యంలో ఉచితవైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ డైరెక్టర్ ప్రకాష్, వైద్యులు రామసుబ్బారెడ్డి, జ్యోత్స్న, శ్రీనివాసరావులు 1400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ముందుగా శ్రీనివాసరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కె.శివకోటిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఒంగోలులో కార్యాలయం ముందు వాహనాలను అడ్డుకుని ధర్నా చేస్తున్న కార్మికులు



చీమకుర్తిలో మాట్లాడుతున్న కాలం సుబ్బారావు

చెత్త వాహనాలను అడ్డగించి నిరసన

● కొనసాగుతున్న మునిసిపల్ కార్మికుల ధర్నా

ఒంగోలు (కార్పొరేషన్), జనవరి 6: ఏపీ మునిసిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మునిసిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం 12వ రోజుకు చేరుకుంది. ఈ మేరకు ఒంగోలు కార్పొరేషన్ కార్యాలయం వద్ద వంటావార్పు నిర్వహించడంతోపాటు కార్యాలయం నుంచి చెత్త వాహనాలు బయటకు రాకుండా అడ్డుకున్నారు. తమ న్యాయమైన డిమాండ్‌లు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని, అలాగే ప్రైవేటు వ్యక్తులతో పారిశుధ్య పనులు నిర్వహించడానికి అంగీకరించేది లేదన్నారు. సమ్మెను నీరుగార్చే ప్రభుత్వ ప్రయత్నాలు విరమించుకోవాలన్నారు. అబద్ధపు హామీలతో కార్మికులను ఘోరంగా మోసం చేసిన జగన్‌రెడ్డి తన వైఖరి మార్చుకోవాలని హితవు పలికారు. ఇలాంటి దుర్మార్గపు ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పడానికి కార్మికులందరూ సిద్ధంగా ఉన్నారన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలపై ఎస్మా ప్రయోగించారని, తమను కూడా అదే తరహాలో బెదిరించాలని చూస్తే కార్మికుల ఆగ్రహానికి గురి కాక తప్పదన్నారు. ఈ సందర్భంగా కార్యాలయం ముందు బైటాయించి గంటన్నర సేపు నిరసన చేయడంతోపాటు చెత్త సేకరణ వాహనాలను బయటకు వెళ్ళకుండా అడ్డుకున్నారు. దీంతో వన్‌టౌన్ సీఐ లక్ష్మణ్ అక్కడకు చేరుకుని ధర్నా చేస్తున్న కార్మికులతో మాట్లాడారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు యు.కుమారి, సామ్రాజ్యం, గోపి, బాలకృష్ణ, యూనియన్ నాయకులు తంబి శ్రీనివాసరావు, కొర్నెపాటి శ్రీనివాసరావు, చీకటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ముట్టడి

చీమకుర్తి: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు శనివారం చీమకుర్తి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ఆరునెలల్లో కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లయినా పట్టించుకోకపోవటంతో గత్యంతరం లేక సమ్మెబాట పట్టారన్నారు. ప్రభుత్వం మొండివైఖరిని విడనాడి తక్షణమే కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో పూసపాటి వెంకట్రావు, వీరాంజనేయులు, పల్లాపల్లి ఆంజనేయులు, నాగయ్య, ఏడుకొండలు, పద్మ, చెన్నమ్మ పాల్గొన్నారు.

దేవుడిని, ఓటర్లను నమ్ముకొని రాజకీయం చేస్తున్నాం

● మంత్రి ఆదిమూలపు సురేష్



మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

మర్రిపూడి, జనవరి 6 : పైన ఉన్న దేవుడిని, వేదిక ముందు ఉన్న ఓటరు దేవుళ్లను నమ్ముకొని రాజకీయం చేస్తున్నామని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. శనివారం సాయంత్రం మర్రిపూడిలో జరిగిన పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రెండేళ్లపాటు కరోనా పరిస్థితులు నెలకొన్నప్పటికీ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. వలస పక్షినని టీడీపీ నాయకులు ఎద్దేవా చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కొండపి నియోజకవర్గ ప్రజలతో మమేకమై పనిచేస్తానని స్పష్టం చేశారు. మర్రిపూడి మండలంలోని ప్రధాన సమస్యలు తన దృష్టికి వచ్చాయని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం పలువురు వృద్ధులు, మహిళలకు ఆయన పింఛన్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఉదయ్ భాస్కర్, ఎంపీపీ వాకి వెంకటరెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు మాకినేని సుధారిణి, మర్రిపూడి సర్పంచ్ కదిరి భాస్కర్‌రావ్, తహసీల్దార్ హరిబాబు, ఎంపీడీవో సుధీపా తదితరులు పాల్గొన్నారు.

ఎవరికివారే..

తొలిసారిగా మర్రిపూడి మండల పర్యటనకు వచ్చిన మంత్రి ఆదిమూలపు సురేష్‌కు వైసీపీ నాయకులు ఎవరికివారే ఎమునాతీరే అన్న చందంగా స్వాగతం పలికారు. మండల సరిహద్దులోని అయ్యపురాజుపాలెం వద్ద ఎంపీపీ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఒక వర్గం నాయకులు సాదరస్వాగతం పలికారు. అదే సమయంలో ఆ గ్రామంలోని గిరిజనులు తమకు ఇళ్లు మంజూరు చేయించాలని మంత్రిని వేడుకున్నారు. ఇది ఇలా ఉండగా వేదికపైకి ఆహ్వానించడంలో ప్రొటోకాల్ పాటించలేదనే కినుకతో దద్దాల మల్లికార్జునరావ్, భాస్కర్‌రెడ్డిలు తమ వర్గం వారితో కార్యాక్రమానికి దూరంగా ఉన్నారు. కార్యక్రమం ముగిసిన తరువాత మంత్రి సురేష్ వెలుగు కార్యాలయంలో అశోక్‌బాబు వర్గం నేతలతో ప్రత్యేకంగా మంతనాలు జరిపారు. అలాగే గత 26రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు మంత్రిని కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు.

వైసీపీ అరాచక పాలనను సాగనంపాలి

● మాజీ ఎమ్మెల్యే ఈదర హరిబాబు



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఈదర హరిబాబు, సంఘ సభ్యులు

ఒంగోలు(రూరల్), జనవరి 6: రాష్ట్రంలో వైసీపీ పరిపాలన బ్రిటీష్ వారి కన్నా ప్రమాదకరంగా మారిందని, ఓటర్లు ఇలాంటి ప్రభుత్వాన్ని తమ ఓటుతో సాగనంపాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ ఎమ్మెల్యే ఈదర హరిబాబు పేర్కొన్నారు. శనివారం ఒంగోలులోని హోటల్ నోవాసిస్‌లో కాకతీయ సేవాసమాఖ్య నూతన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన హరిబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అవినీతి అరాచక పాలనతో ప్రజలు అల్లాడుతున్నారని చెప్పారు. అధికారులు అధికార దుర్వినియోగానికి పాల్పడితే తరువాత జరిగే పరిణామాలకు వారే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని తెలిపారు. కాకతీయ సేవా సమాఖ్య కుల సంఘం కాదని, ఇది కేవలం సేవా సంఘమని చెప్పారు. పేదల అభ్యున్నతికి అంకితభావంతో పని చేయాలని పిలుపునిచ్చారు. సమాఖ్య జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకట్రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎర్రమనేని కోటేశ్వరరావు, కామేపల్లి శ్రీనివాసరావు, నాగభైరవ ఆదినారాయణ, మురికొండ బోసుబాబు, వెలగా కోటేశ్వరరావు, తమ్మినేని మహేష్‌బాబు, పర్వతనేని పట్టాభిరామ్, పమిడి వెంకటేశ్వర్లు, వీరవల్లి రుద్రయ్య, మండవ శేషగిరిరావు, కంచర్ల సుబ్బారావు, రామయ్యచౌదరి, నిడమానూరి హనుమంతరావు, మారెళ్ల రామకృష్ణ పాల్గొన్నారు. అనంతరం క్యాలెండర్‌కు ప్రకటనలు ఇచ్చిన వారిని ఘనంగా సన్మానించారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు రాని లబ్ధిదారులు

● సమ్మెతో కేంద్రాల వైపు రాని వైనం



ఇద్దరు లబ్ధిదారులకు సరుకులను అందజేస్తున్న సీడీపీవో మాధవీలత, మహిళా పోలీసు వాసవి

కొండపి, జనవరి 6: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 26 రోజులుగా కేంద్రాలు మూసివేసి నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు. అయితే ప్రభుత్వం ఆర్భాటంగా కేంద్రాల తాళాలు పగులగొట్టి మరీ కేంద్రాలను సచివాలయ ఉద్యోగులకు అప్పగించింది. వారితో తాత్కాలికంగా సరుకులు పంపిణీ చేసే ఏర్పాట్లు చేసింది. కేంద్రాలు నిర్వహించాలని ప్రయత్నాలు చేసినా లబ్ధిదారులు మచ్చుకు ఒక్కరైనా రాని దుస్థితి. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే బాలామృతం ప్యాకెట్లు, పాలు, కోడిగుడ్లు అర్ధరాత్రి, ఉదయం సెలవుదినాలు ఇలా ఏరోజుల్లో, ఏసమయంలో వచ్చినా బాధ్యతగా తీసుకుని కేంద్రాలకు చేర్చుకునేవారు. ఇపుడా పరిస్థితి లేదు. తాజాగా శనివారం ఉదయం కొండపి ప్రాజెక్ట్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలకు బాలామృతం ప్యాకెట్లు వచ్చాయి. వారం రోజుల కిందట పాలు, కోడిగుడ్లు వచ్చాయి. వీటిని కేంద్రాల వద్ద తీసుకునేవారు లేక ఆటోల్లో తెస్తున్నవారు నానా ఇబ్బందులు పడుతున్నారు. చుట్టుపక్కల ఇళ్ల వద్ద దించబోతే వారు వద్దనడంతో మరింత ఇబ్బందులు పడ్డారు. బాలామృతం ప్యాకెట్లు దించుకునే వారు లేక కేంద్రాల చుట్టు పక్కల ఆటో యజమానులు దించి వెళుతున్నారు. గృహలవారిని బతిమలాడుకోవడం కనిపించింది. అదేవిధంగా లబ్ధిదారులైన గర్భిణులు, బాలింతలు, తల్లులు, చిన్నారులు కూడా కేంద్రాలకు రావడం లేదు. సరుకులు ఇస్తామని పిలిచినా లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. ఇప్పటి వరకు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు బాధ్యతగా లబ్ధిదారులను పిలిచి పౌష్టికాహారం ఆవశ్యకత, అవసరం వివరించి వారికి అందజేసేవారు. ప్రస్తుతం సచివాలయ ఉద్యోగులు బతిమిలాడినా లబ్ధిదారులు కేంద్రాలకు రావడం లేదు. తాజాగా శనివారం మండల కేంద్రమైన కొండపిలోని కామేపల్లిరోడ్డులోని ఓ అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన సీడీపీవో టి. మాధవీలత, మహిళా పోలీసు వాసవి ఇద్దరు లబ్ధిదారులను బతిమిలాడుకుని తీసుకువచ్చి సరుకులు ఇచ్చారు. ఈ కేంద్రం పరిధిలో దాదాపు 30 మందికి పైగా వివిధ రకాల లబ్ధిదారులు ఉన్నా ఎవరూ సరుకులు తీసుకోవడానికి రాని పరిస్థితి. కేంద్రాలను నిర్వహించలేక సచివాలయ ఉద్యోగులు సమ్మె ఎపుడు ఆగిపోయి కార్యకర్తలు, ఆయాలు విధుల్లోకి చేరుతారా? అని ఎదురుచూస్తున్నారు.

ట్రావెల్స్ బస్సులో పట్టుబడ్డ అక్రమ మద్యం



పట్టుబడ్డ అక్రమ మద్యంబాటిళ్లతో ఎస్సై ఖాదర్‌బాషా

టంగుటూరు, జనవరి 6 : బెంగళూరు నుంచి రేపల్లె వెళ్తున్న ట్రావెల్స్ బస్సులో 15 ఫుల్ బాటిళ్ల అక్రమ మద్యం పట్టుబడింది. ఈసంఘటన జాతీయ రహదారిలో టంగుటూరు టోల్‌గేట్ వద్ద శనివారం చోటుచేసుకుంది. ఎస్పీ మలికగర్గ్ ఆదేశాల మేరకు సింగరాయకొండ సీఐ రంగనాథ్ ఆధ్వర్యాన శనివారం టంగుటూరు టోల్‌గేట్ వద్ద వాహనాల తనిఖీలు జరిగాయి. టంగుటూరు, సింగరాయకొండ ఎస్సైలు ఎస్‌కె.ఖాదర్‌బాషా, శ్రీరామ్ సెబ్ పోలీసులు, టంగుటూరు పోలీసులు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. వాహనాల తనిఖీల్లో భాగంగా వీరు బెంగళూరు నుంచి రేపల్లె వెళ్తున్న ట్రావెల్ బస్సును ఆపి తనిఖీ చేయగా మద్యం బాటిళ్లతో కూడిన బ్యాగ్ ఒకటి వారి కంట పడింది. పోలీసులు బ్యాగ్ తెరచి పరిశీలించగా అందులో వివిధ బ్రాండ్ల 15 ఫుల్ సైజు మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. బ్యాగు విషయమై బస్సుల్లో విచారించగా అది బాపట్ల జిల్లా చెరువు జమ్ములపాలెం గ్రామస్థుడు పులి సురేంద్రదని నిర్ధారణ అయ్యింది. వెంటనే పోలీసులు సురేంద్రను పట్టుకొని అతని బ్యాగులో దొరికిన 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సురేంద్రను, అతని బ్యాగులో దొరికిన అక్రమ మద్యం బాటిళ్లను టంగుటూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సురేంద్రను శనివారమే కోర్టుకు హాజరుపరిచారు. స్థానిక ఎస్సై సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అవీ..ఇవీ..

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 6: సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని పలువురు జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉద్యోగ భద్రతతో పాటు హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని కోరారు. రాష్ట్ర సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఫెడరేషన్(జేఏసీ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 18వ రోజైన శనివారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరవధిక దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ సర్వశిక్షఅభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ పది లక్షలు రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తో పాటు గ్రాడ్యుటీ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు సామాజిక భద్రత పథకాలు, ఈపీఎఫ్, ఈఎస్‌ఐ అమలు చేయడంతో పాటు ఉద్యోగ విరమణ వయస్సును పెంచాలన్నారు. ఖాళీ పోస్టులను భర్తీ చేసి పనిభారాన్ని తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరిబాబు, కళ్యాణి పాల్గొన్నారు.

క్విస్ అధ్యాపకుడికి పీహెచ్‌డీ ప్రదానం



పీహెచ్‌డీ పట్టాను అందుకుంటున్న చంద్రశేఖర్

ఒంగోలు(విద్య), జనవరి 6 : ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కె.చంద్రశేఖర్‌కు హైదరాబాద్ జేఎన్‌టీయూ పీహెచ్‌డీని ప్రదానం చేసింది. ఇస్రో చైర్మన్ డాక్టర్ శ్రీధర్ పనికర సోమనాథ్, యూనివర్శిటి వీసీ కట్టా నరసింహారెడ్డి చేతుల మీదుగా చంద్రశేఖర్ పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. ఈ సందర్భంగా క్విస్ విద్యాసంస్థల చైర్మన్ నిడమానూరి సూర్యకళ్యాణ్‌చక్రవర్తి, వైస్ చైర్మన్ డాక్టర్ గాయత్రిదేవి, ప్రిన్సిపాల్ హనుమంతరావు, నవనీత్ కృష్ణలు శనివారం స్థానిక కళాశాలలో జరిగిన కార్యక్రమంలో చంద్రశేఖర్‌ను అభినందించారు.

ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో రాజ్యలక్ష్మి

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 6 : ఆరోగ్య విద్య మీడియా అధికారుల అసోసియేషన్ ప్రచురించిన క్యాలెండర్‌ను డీఎంహెచ్‌వో రాజ్యలక్ష్మి శనివారం ఒంగోలులోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని ఆరోగ్య విద్య మీడియా అధికారులు, ఆరోగ్య విద్యా బోధకులు, ఆరోగ్య విద్యా విస్తరణాధికారులు తమ పరిధిలో జరుగుతున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాలను, వాటి అమలు తీరును ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్యపరమైన అంశాలపై అవగాహన కలిగించడం ద్వారా అనేక వ్యాధుల బారి నుంచి ప్రజలను కాపాడేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ నాగార్జున, హెచ్‌ఈఈవో శ్రీనివాసులు, ఉపమాస్ మీడియా అధికారి ఎం.సరోజిని, కె.శ్రీదేవి, యూనిట్ అధికారి వెంకట్రావు, శ్రీనివాసులు, ఆర్టిస్ట్ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేస్‌లో అవగాహన సదస్సు



వైద్యులను సత్కరిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు(విద్య), జనవరి 6: ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం లక్ష్మీ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ డాక్టర్లు ఆరోగ్య సమస్యలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హరిబాబు మాట్లాడుతూ ద్విచక్రవాహనాలు నడిపే సమయంలో హెల్మెట్‌ను తప్పక ధరించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ విద్యార్థులు ప్రమాదాలకు దూరంగా ఉండాలన్నారు. డాక్టర్ అను గుండెపోటు వచ్చినప్పుడు, ఉన్నట్లు ఉండి జారిపడినప్పుడు వారిని ఎలా రక్షించాలో సీపీఆర్ ద్వారా డెమో చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, ఏవో రమణబాబు, డీన్ ఆర్.వీరాంజనేయులు, వెల్‌నెస్ కమిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ బ్రహ్మం పాల్గొన్నారు.

ఎస్మా ప్రయోగం అప్రజాస్వామికం



మాట్లాడుతున్న అంజనేయులు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 6: సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేపట్టిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలపై ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడాన్ని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల అంజనేయలు ఖండించారు. ఒంగోలులోని సంఘం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లుతో కలిసి మాట్లాడారు గత 26 రోజులుగా శాంతియుతంగా జరుగుతున్న అంగన్‌వాడీల సమ్మెను ఎస్మా చట్టపరిధిలోకి తీసుకొని వచ్చి సమ్మెను నిషేధించడం ప్రభుత్వ నియంతృత్వ వైఖరికి నిదర్శనమన్నారు. అంన్‌వాడీలకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతోనే సమ్మె చేయాల్సి వచ్చిందని, తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఎమర్జెన్సీ కాలం నాటి నల్లచట్టం ఎస్మాను అంగన్‌వాడీలపై ప్రయోగించడం, సమ్మె కాలానికి జీతాల్లో కోత విధించడం దుర్మార్గంగా ఉందని మండిపడ్డారు. ఎస్మా ప్రయోగిస్తూ ప్రభుత్వం తీసుకు వచ్చిన జీవోనెంబరు 2ను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

బైక్ ఢీకొని మహిళకు గాయాలు

మద్దిపాడు, జనవరి 6: బైక్ ఢీకొని మహిళకు తీవ్రగాయాలైన సంఘటన శనివారం గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్ సమీపంలో జరిగింది. దర్శికి చెందిన పి.రాజ్యలక్ష్మి, నాగులుప్పలపాడులో బంధువుల ఇంటికివెళ్లి గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్ వద్దకు వచ్చింది. ఈ సందర్భంగా రోడ్డు దాటే క్రమంలో మేదరమెట్ల నుంచి మద్దిపాడు వైపు వచ్చే బైక్ ఢీకొటింది. ఈ ప్రమాదంలో రాజ్యలక్ష్మికి గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఒంగోలుకు తరలించారు.

సెల్‌ఫోన్ రిపేరులో ఉచిత శిక్షణ

ఒంగోలు నగరం, జనవరి 6: ఒంగోలులోని రూడ్‌సెట్ ఆధ్వర్యంలో సెల్‌ఫోన్ రిపేరులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18వ తేదీ నుంచి ఈ శిక్షణ ప్రారంభమవుతుందని, 18 నుంచి 45 సంవత్సరాలలోపు వయస్సు వారు అర్హులన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగులు రేషన్ కార్డు, ఆధార్‌కార్డు కలిగి ఉండాలన్నారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సౌకర్యాలు ఉంటాయని, వివరాలకు 9492583484 సెల్ నంబరులో సంప్రదించాలని కోరారు.

అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇవ్వాలి

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 6 : జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని డెమొక్రటిక్ జర్నలిస్ట్ ఫోరంనాయకులు డిమాండ్ చేశారు. ఒంగోలు డివిజన్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. యు.అశోక్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో పలువురు మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం అనేక నిబంధనలు పెట్టడం తగదన్నారు. అర్హులందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరారు. అనంతరం జేసీ శ్రీనివాసులును కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎన్.రవికుమార్, మాల్యాద్రి, బి.శ్రీనివాసరావు, శరత్‌బాబు, అంజయ్య, మల్లికార్జునరెడ్డి, సుబ్బారావు, శ్రీనివాసరావు కళాంజలి సుబ్బారావు, కరీముల్లాఖాన్ పాల్గొన్నారు.

నవోదయ విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఒంగోలు(విద్య), జనవరి 6: జాతీయస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ఒంగోలులోని జవహర్ నవోదయ 10వతరగతి విద్యార్థులు కె.జయంత్ కుమార్, ఎల్.రాకేష్ ప్రదర్శించిన ఎగ్జిబిట్ పలువురి ప్రశంసలు అందుకున్నాయి. ఈ సందర్భంగా శనివారం స్థానిక పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులతో పాటు సహవిద్యార్థి మోతేలాల్‌ను, గైడ్ టీచర్లు జి.శ్రీనివాసరావు, ఎం.రాజు, కె.మూర్తి, లక్ష్మీప్రసన్నలను విద్యాలయ ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సుబ్రహ్మణేశ్వరరావు ఘనంగా సత్కరించారు.

‘ఎస్మా’పై అంగన్‌వాడీల ఫైర్ !

జీవో ప్రతుల దహనం ● విధుల్లో చేరకుంటే వేటు తప్పదంటున్న అధికారులు ● తగ్గేదే లేదంటున్న కార్యకర్తలు, ఆయాలు

ఒంగోలు నగరం, జనవరి 6 : డిమాండ్లను సాధించే వరకు విశ్రమించేదేలేదంటూ ఉద్యమాన్ని రోజురోజుకూ ఉధృతం చేస్తున్న అంగన్‌వాడీలపై జగన్ ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తోంది. ఈమేరకు శనివారం జీవోను విడుదల చేసింది. దీని అమలు దిశగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారులు చర్యలు చేపట్టారు. సీడీపీవోల ద్వారా శనివారం నుంచి కార్యకర్తలకు, ఆయాలకు సమాచారం పంపుతున్నారు. ఈనెల 8వతేదీ లోపు విధుల్లో చేరకుంటే మీపై ఎస్మా ప్రయోగిస్తామంటూ అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వ తీరుపై అంగన్‌వాడీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా శనివారం అన్ని దీక్షా శిబిరాలు, ఆందోళన కార్యక్రమాల వేదికల వద్ద ఎస్మా చట్టం ప్రతులను తగులబెట్టారు. ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటామని అంగన్‌వాడీ వర్కర్సు అండ్ హెల్పర్సు యూనియన్, సీఐటీయూ నాయకులు తెగేసి చెబుతున్నారు. కాగా శనివారం జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీలు ఉద్యమాన్ని తీవ్రతరం చేశారు. అన్ని చోట్లా ఎస్మా చట్టాన్ని వ్యతిరేకిస్తూ ప్రతులను చించివేయటం, కాల్చివేయటం వంటి కార్యక్రమాలు చేపట్టారు. మద్దిపాడులో ఎస్మా ప్రతులను తగులబెట్టారు. నాగులుప్పలపాడులో అంగన్‌వాడీలు ముఖ్యమంత్రి వైఖరిని నిరసిస్తూ మానవహారాన్ని నిర్మించారు. ఎస్మా జీవో ప్రతులను తగులబెట్టారు. పలుచోట్ల పొర్లు దండాలు పెడుతూ వినూత్న నిరసన తెలిపారు. ఇదేవిధంగా జిల్లావ్యాప్తంగా అన్ని ప్రధాన కేంద్రాల్లో ఈ కార్యక్రమం చేపట్టారు.

ఒంగోలులో 24 గంటల నిరవధిక దీక్ష

ఒంగోలు కలెక్టరేట్ వద్ద 24 గంటల నిరవధిక దీక్షా శిబిరాన్ని శనివారం సీఐటీయూ రాష్ట్ర మాజీ కార్యదర్శి వై.సిద్ధయ్య ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం వారి ఆందోళనను తక్కువ చేసి చూడటం దుర్మార్గమన్నారు. కనీస వేతనాలు అడగటం కూడా ఈ ప్రభుత్వానికి నేరంగా కనిపిస్తుందా అని ప్రశ్నించారు. ఎస్మాలు ప్రయోగించిన అనేక మంది పాలకులు ఉద్యమాల ఉప్పెనకు కొట్టుకుపోయారని, అదే గుణపాఠం ప్రస్తుత ప్రభుత్వానికి చెప్పేందుకు అంగన్‌వాడీలు సిద్ధంగా ఉన్నారన్నారు. అంగన్‌వాడీ వర్కర్సు అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కె.వి.సుబ్బమ్మ, అన్నపూర్ణ తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్ని బెదిరింపులకు పాల్పడినా పోరు ఆపేదిలేదన్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించే వరకు పోరాటం ఆగదన్నారు. ఉద్యమాన్ని అణచివేసేందుకు ఎన్ని ఎస్మాలు ప్రయోగించినా భయపడేదిలేదన్నారు.

కార్మిక సంఘాలు కన్నెర్ర

అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడంపై కార్మిక సంఘాలు కన్నెర్ర చేశాయి. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ నాయకులు శనివారం ఒంగోలులోని అంగన్‌వాడీల శిబిరం వద్ద నిరసన తెలిపారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి గుంటుపల్లి శ్రీనివాసులు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, ఏఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఆర్.మోహన్ మాట్లాడుతూ ఎస్మా చట్టం తేవడం దుర్మార్గమన్నారు. అంగన్‌వాడీలు, కార్మిక సంఘాలు సంఘటితంగా ఎస్మా చట్టాన్ని ప్రతిఘటించాలని ఆయన కోరారు. ఆదివారం జిల్లావ్యాప్తంగా ఎస్మా చట్టానికి సంబంధించిన ప్రతులను తగులబెట్టే కార్యక్రమాన్ని పెద్దఎత్తున చేపట్టాలని వారు పిలుపునిచ్చారు. కాగా అంగన్‌వాడీల నిరసన శిబిరం వద్దకు పలుప్రజా సంఘాలు, మహిళా సంఘాల నాయకులు వచ్చి సమ్మెకు సంఘీభావాన్ని తెలిపారు. నవ్యాంధ్ర రచయితల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు టి. అరుణ, ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, పీవోడబ్ల్యూ జిల్లాకార్యదర్శి మంజుల, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి అనంతలక్ష్మి, తెలుగు మహిళ నాయకురాలు అరుణ, నరసం ఉపాధ్యక్షురాలు సూర్యకుమారి, పీవోడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు పద్మ, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు విజయ తదితరులు అంగన్‌వాడీలకు మద్దతు తెలిపారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సుబ్బారావు డిమాండ్ చేశారు. జీవో నెంబరు 2ను దహనం చేశారు. గత 25 రోజులుగా అగన్‌వాడీలు చేస్తున్న సమ్మెకు మద్దతుగా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల తల్లులు మద్దిపాడులో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు కార్యక్రమంలో నాతాని ధనలక్ష్మి, జయప్రద, ఆదిలక్ష్మి, ప్రమాల, మేరీ, పద్మామతి, కోమలి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడులో..

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్): నాగులుప్పలపాడు బస్టాండ్‌సెంటర్‌లో అంగన్‌వాడీలు తమ నిరసనను శనివారం కొనసాగించారు. ప్రభుత్వం ఎస్మా చట్టం ప్రయోగించడంతో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు మానవహారం నిర్వహించి జీవో ప్రతులను తగులబెట్టారు. వంటావార్పు చేపట్టిన వైసీపీ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, జజ్జూరి జయంత్‌బాబు, టి.శ్రీకాంత్, ప్రమీల, వెంకటసుబ్బమ్మ, రజని, దుర్గాభవాని, రమాదేవి, ముత్యాలమ్మ పాల్గొన్నారు.

కొండపిలో..

కొండపి: అంగన్‌వాడీలకు పనికి తగిన విధంగా రూ. 26 వేల జీతం వెంటనే ప్రభుత్వం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గంటినపల్లి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 26 రోజులుగా చేస్తున్న నిరసన కార్యక్రమంలో శనివారం మధ్యాహ్నం ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకురాళ్లు తులసి, ఆదిలక్ష్మి, శేషమ్మ, పున్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరులో..

టంగుటూరు: అంగనవాడీ కార్యకర్తల దీర్ఘకాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జన విజ్ఞాన వేదిక నాయకులు డిమాండ్ చేశారు. టంగుటూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీల 26వ రోజు సమ్మె శనివారం కూడా కొనసాగింది. అంగన్వాడీల సమ్మెను సందర్శించిన జేవీవీ నాయకులు వారి ఆందోళనకు మద్దతు ప్రకటించారు. అంగన్‌వాడీలకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలన్నారు. గ్రాట్యూటీ ఇవ్వాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.5లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే అంగన్వాడీలతో చర్చలు జరిపి వారి డిమాండ్లన్నింటినీ బేషరతుగా అంగీకరించాలని కోరారు. అంగన్వాడీల సమ్మెకు మద్దతు తెలిపిన జన విజ్ఞాన వేదిక నాయకుల్లో కోటపాటి నారాయణ, టి.రామ్మూర్తి, టి.నారాయణరావు ఉన్నారు.

నల్లచట్టాలతో బెదిరేది లేదు..

అంగనవాడీల సమ్మె ఉపసంహరింపజేచేందుకని ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తుందని, అయినా సరే ఆ నల్ల చట్టాలకు అంగన్‌వాడీలు బెదిరేదిలేదని, సమ్మెను విరమించేది లేనేలేదని సీఐటీయూ జిల్లా నేతలు టి. రాము, వి.మోజెస్ ప్రకటించారు. ప్రభుత్వం శనివారం అంగన్‌వాడీల సమ్మెపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడాన్ని వారు తీవ్రంగా పరిగణించారు. సమస్యలు పరిష్కరించడం చేతకాని ప్రభుత్వం సమ్మెపై నిషేధం ప్రకటించడం, ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం అత్యంత పాశవిక చర్యగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బి. శేషమ్మ, క్రాంతి, నాయకులు సుభాషిణి, పచ్చవ శ్రీదేవి, హేమలత, జ్యోతి, విజయకుమారి, లలిత, ఆదిలక్ష్మి నాయకత్వం వహించారు.



కొండపిలోని దీక్షాశిబిరంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు



ఒంగోలులో 24గంటల దీక్షను ప్రారంభిస్తున్న నాయకులు, అంగన్‌వాడీలు



టంగుటూరులోని దీక్షా శిబిరంలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

‘ఏడాదిగా నా భర్త కనిపించడం లేదు’

● ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితురాలు

ఒంగోలు (క్రైం), జనవరి 6: గత ఏడాది కాలంగా తన భర్త కనిపించడం లేదని శ్రీపతి పూర్ణకుమారి అనే వివాహిత ఎస్పీమలికగర్గ్‌కు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేయగా టూటౌన్ పోలీసులు విచారణ చేపట్టారు. ఒంగోలు నగరం రాజీవ్‌నగర్‌లో నివాసం ఉండే శ్రీపతి వెంకట సుబ్బారావు బంగారం ఆభరణాలు పనులు చేస్తుంటాడు. ఆయన కుమారుడు అమెరికాలో ఉద్యోగం చేస్తుండగా, 2022 ఆగస్టులో ఆయన భార్య పూర్ణకుమారి అమెరికా వెళ్లింది. అయితే 2022 నవంబరు 24న కాల్ చేయగా భర్త వెంకటసుబ్బారావు ఫోన్ తీయలేదు. దీంతో డిసెంబరు 2న ఒంగోలుకు వచ్చిన పూర్ణకుమారి తమ అపార్ట్‌మెంట్‌లో చూడగా భర్త కనిపించలేదు. ఫోన్ మాత్రం ఉంది. సీసీఫుటేజీ ఆధారంగా పరిశీలిస్తే 2022 నవంబరు 28న స్కూటీపై బయటకు వెళ్లినట్లు కనిపించింది. అదే క్రమంలో స్కూటీ రైల్వేస్టేషన్ వద్ద ఉన్న పార్కింగ్ ఏరియాలో ఉంది. ఈ మేరకు టూటౌన్ పోలీసులకు పూర్ణకుమారి ఫిర్యాదు చేశారు. అప్పట్లో అదృశ్యం కేసుగా నమోదు చేశారు. అయితే తన భర్త ఆచూకీ ఇంత వరకు తెలియలేదని శనివారం ఎస్పీని కలిసి మరోమారు ఫిర్యాదు చేశారు. వెంకటసుబ్బారావు, ఆయన సోదరుడు వెంకటేశ్వర్లు మధ్య ఆస్తి వివాదాలు ఉన్నాయని, వారు తన భర్తను ఏమైనా చేశారనే అనుమానం ఉందని ఎస్పీకి విన్నవించుకున్నారు. దీంతో విచారించాలని ఎస్పీ టూటౌన్ పోలీసులను ఆదేశించారు. ఈక్రమంలో అనుమానితులను పిలిచి విచారిస్తున్నట్లు సీఐ జగదీష్ వెల్లడించారు.

గోగినేనివారిపాలెంలో మహిళ శవం

కొండపి, జనవరి6: మండలంలోని గోగినేనివారిపాలెం పరిధిలోని నత్తలకుంట సమీపంలోని పొలాల్లో ఓ మహిళ శవాన్ని గ్రామస్థులు శనివారం ఉదయం గుర్తించారు. శవం పూర్తిగా కుళ్లిపోయి ఉంది. దాదాపు నెలరోజుల క్రితం ఆమె మరణించి ఉంటుందని అంచనా వేస్తున్నారు. నెలరోజుల క్రితమే నత్తల కుంట సమీపంలో మహిళను చంపి ఉంటారా? లేక చంపిన మహిళ శవాన్ని తెచ్చి ఇక్కడ తాజాగా పడేశారా? అనే అనుమానాలు స్థానికుల నుంచి వ్యక్తం అవుతున్నాయి. పొలాలకు వెళ్లిన రైతులు శనివారం శవాన్ని గుర్తించి గ్రామ రెవెన్యూ అధికారికి సమాచారం అందించారు. గ్రామ రెవెన్యూ అధికారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కొండపి ఎస్సై వై. నాగరాజు తెలిపారు. మహిళ ఎవరనేది తెలియరాలేదన్నారు. శవం పూర్తిగా కుళ్లిపోయి ఎముకల గూడుగా ఉందన్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

పింఛన్ల పంపిణీకి సర్పంచ్‌లు డుమ్మా

పొన్నలూరు (కొండపి), జనవరి 6: పొన్నలూరు మండల కార్యాలయం ఆవరణలో శనివారం నూతన ఇన్‌చార్జి, మంత్రి ఆదిమూలపు సురేష్ నేతృత్వంలో జరిగిన పింఛన్‌ల పంపిణీ కార్యక్రమానికి మండలంలోని పలుగ్రామాల సర్పంచ్‌లు, పలువురు ప్రజాప్రతినిధులు డుమ్మాకొట్టారు. అధికార వైసీపీలో గ్రామస్థాయిలో ఏర్పడ్డ విభేదాలే ఇందుకు కారణమని తెలిసింది. ఇప్పటికే పలువురు ఇన్‌చార్జిల కింద గ్రూపులుగా పనిచేసిన వైసీపీ నాయకులు మరో ఇన్‌చార్జి రావడంతో నీరసించిపోయారు. నాయకుల మధ్య ఏర్పడ్డ గ్రూపులతోపాటు ఎన్నికైన ప్రజాప్రతినిధులు కూడా గ్రామాల్లో ఒక్క పనీ చేయలేని దుస్థితి. దీంతో అధికార పార్టీ సర్పంచ్‌లు పలువురు పింఛన్‌ల పంపిణీ కార్యక్రమానికి పార్టీ మండల నాయకులు ఆహ్వానించినా ముఖం చాటేశారు. నాలుగున్నరేళ్ల గ్రామాల్లో పనులు చేయలేదు. ప్రజలకు కనీస వసతులు కూడా చేయలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు సినీనటుడు తనికెళ్లకు పురస్కారం ప్రదానం

అద్దంకిటౌన్, జనవరి 6: సినీనటుడు తనికెళ్ల భరణికి ఆదివారం ఉదయం 10 గంటలకు అద్దంకిలోని నాగులపాడురోడ్డులోని కామేపల్లి కల్యాణ మండపంలో పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ జీవిత సాఫల్య పురస్కారం అందజేయనున్నట్టు నిర్వాహకులు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. శనివారం స్థానిక రోటరీ కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వారణాసి రఘురామశర్మ, డాక్టర్ యు.దేవపాలన, డీవీఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట టీడీపీ నాయకుడు మృతి



నివాళులర్పిస్తున్న విజయ్‌కుమార్

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), జనవరి6: నాగులుప్పలపాడు మండలం కొత్తకోటలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు కసుకుర్తి యలమంద శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ యల్లమంద మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు తేళ్ల మనోజ్‌కుమార్, కాకర్ల లక్ష్మీవరప్రసాదు, కోనూరి ఆంజనేయులు, ఝాన్సీరాణి, హరనాథ్‌బాబు, కె.అంకరాజు పాల్గొన్నారు.

మద్దాలికి ఎస్పీబీ జీవన సాఫల్య పురస్కారం

ఒంగోలు(కల్చరల్), జనవరి 6: శ్రీఅభయ కళారాధన సాంస్కృతిక సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మద్దాలి మాధవరావుకు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జీవన సాఫల్య పురస్కారం అందజేయనున్నట్లు ఒంగోలు కల్చరల్ మీడియా అసోసియేషన్ ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి ఒంగోలు అంబేడ్కర్‌భవన్‌లో అసోసియేషన్ తరఫున నిర్వహించే సంక్రాంతి ఉత్సవాలలో ఆయనకు ఈ పురస్కారాన్ని అందజేయనున్నారు. కళా, సాంస్కృతిక, సేవారంగ ప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

బీమా నగదు అందజేత



నగదును అందజేస్తున్న చైర్మన్, కౌన్సిలర్లు

చీమకుర్తి, జనవరి 6: చీమకుర్తి పట్టణంలోని ఏడోవార్డు సచివాలయ పరిధిలో వైఎస్ఆర్ బీమా కింద మంజూరైన లక్ష రూపాయాల నగదును శనివారం పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ రాజ్యలక్ష్మి, కౌన్సిలర్లు మేకల సులోచన ఆముదాలపల్లి ప్రమీల, నాయకులు రామబ్రహ్మం, ఎల్లయ్య, చంద్ర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం కొత్తగా పెరిగిన పింఛన్‌ను లబ్ధిదారులకు వారు అందజేశారు.

మద్దిరాలపాడులో ‘బాబు ష్యూరిటీ..’

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), జనవరి 6: మద్దిరాలపాడు గ్రామంలో శనివారం రాత్రి టీడీపీ నాయకులు బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు గ్రామస్థులకు కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాక్షస ముఖ్యమంత్రి జగన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో ఓడించాలని, ఆయన పాలతో ప్రజలు విసుగుచెందారన్నారు. చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రి చేసుకని రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు స్వర్ణ కిషోర్‌బాబు, బరకం మస్తాన్, బరకం సతీష్, జనసేన నాయకులు స్వర్ణ అరవింద్, స్వర్ణ వంశీ తదితరులు పాల్గొన్నారు.




కరపత్రాలను అందజేస్తున్న నాయకులు

ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం

● ఇరువురు ఉపాధ్యాయులపై కేసు

ఒంగోలు(క్రైం), జనవరి6: విద్యాబుద్ధులు చెప్పే ఇరువురు ఉపాధ్యాయులు మోసపు మాటలు చెప్పి ఓ నిరుద్యోగికి కుచ్చుటోపి పెట్టారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న చెల్లి ఆనందరావు, కంచర్ల అనీల్‌బాబు ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ ఉద్యోగం ఇప్పిస్తానని ఓ యువకుడిని మోసం చేశారు. ఈ మేరకు బాధితుడు తల్లి మేక శేషమ్మ ఫిర్యాదు మేరకు ఒంగోలు వన్‌టౌన్ పోలీసులు ఇరువురు ఉపాధ్యాయులపై కేసు నమోదు చేశారు. పంగులూరు మండలానికి చెందిన మేకా శేషమ్మ కుమారుడు నాగరాజుకు పీఈటీ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి రూ.6లక్షలు నగదును ఇరువురు టీచర్లు తీసుకున్నారు. అయితే ఉద్యోగం ఇప్పించక పోగా తిరిగి నగదు కోసం అడిగితే బెదిరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేగాకుండా చెల్లని బ్యాంక్ చెక్కులు ఇచ్చి మోసం చేశారని, ఈ మేరకు వన్‌టౌన్ సీఐ ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేశారు.

సాయిబాబా మందిర వ్యవస్థాపకుడు మృతి



పిచ్చయ్యమాస్టర్ (ఫైల్)

ఒంగోలు(కల్చరల్), జనవరి 6: ఒంగోలు నగరం లాయర్‌పేట సాయిబాబా మందిర ఫౌండర్ బయ్యారపు పిచ్చయ్య మాస్టర్ శనివారం సాయంత్రం మృతి చెందారు. స్థానిక మునిసిపల్ హైస్కూల్‌లో ఆంగ్ల ఉపాధ్యాయునిగా పనిచేసిన పిచ్చయ్య మాస్టర్ సాయిబాబా మందిర ప్రారంభానికి ఎంతగానో కృషిచేశారు. ఎక్కిరాల భరద్వాజ మాస్టర్ ద్వారా గులాబ్‌బాబా గురించి తెలుసుకుని ఆయన చరిత్రను తెలుగులోకి అనువదించారు. పిచ్చయ్య మాస్టర్ మృతికి షిరిడీ సాయి కల్చరల్ మిషన్ కమిటీ తీవ్ర సంతాపాన్ని తెలియజేసింది. ఆయన అంత్యక్రియలు ఆదివారం జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు.

ఘనంగా తిరుప్పావై పారాయణం



పారాయణంలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు(కల్చరల్), జనవరి 6: ఒంగోలు నగరం కేశవస్వామిపేటలోని శ్రీప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానంలో శనివారం రాత్రి మహిళలచే సామూహిక తిరుప్పావై పారాయణ ఘనంగా జరిగింది. గద్దలగుంటపాలెం ఓం శ్రీహరి తిరుప్పావై పారాయణ భక్త మహిళా బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తిరుప్పావై 21వ పాశురాన్ని వారు పారాయణం చేశారు. ఈ సందర్భంగా దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు మాట్లాడుతూ ధనుర్మాసంలో ప్రతి రోజు స్వామివారిని మేల్కొలుపుతూ గోదాదేవి రచించి పాడిన దివ్య ప్రబంధం తిరుప్పావై అన్నారు. అర్చకులు పరాంకుశం రమానాథాచార్యులు, నాగార్జునదేవ్ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో డి.రజనీకుమారి, పాలకమండలి సభ్యులు కుర్రా ప్రసాద్‌బాబు, పెద్దసంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

భవిష్యత్‌పై కృష్ణచైతన్య సమాలోచనలు

● మండలాల నేతలతో సమావేశాలు



పంగులూరు మండల నేతలతో మాట్లాడుతున్న కృష్ణచైతన్య

అద్దంకి, జనవరి 6: భవిష్యత్ ప్రణాళికపై శాప్‌నెట్ చైర్మన్, వైసీపీ అద్దంకి నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ బాచిన కృష్ణచైతన్య మండలాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే రెండు మండలాల నేతలతో పాటు, అద్దంకి పట్టణంలోని కొంతమంది నేతలతో సమావేశాలు పూర్తి కాగా, ఆదివారం నుంచి రోజుకొక మండలం చొప్పన మిగిలిన మండలాల నేతలతో సమావేశాలు నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం రాత్రి ఒంగోలులో కొరిశపాడు మండల నేతలతో, శనివారం రాత్రి అద్దంకిలోని కార్యాలయంలో పంగులూరు మండల నేతలతో సమావేశాలు నిర్వహించారు. శనివారం రాత్రి అద్దంకి పట్టణంలోని కొంతమంది నేతలు కూడా కృష్ణచైతన్యను కలిశారు. ఈ సందర్భంగా భవిష్యత్ కార్యాచరణపై ఆయా మండలాల నేతలతో చర్చించారు. కృష్ణచైతన్య తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటామని సమావేశాలకు హాజరైన నేతలు ముక్తకంఠంతో చెప్పినట్లు తెలుస్తుంది. అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమించిన హనిమిరెడ్డి నియోజకవర్గంలో పర్యటనలు చేస్తుండటం, ఇటు కృష్ణచైతన్య నేతలతో సమావేశాలు నిర్వహిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. రెండు రోజుల పాటు జరిగిన నేతల సమావేశాలకు కొరిశపాడు, పంగులూరు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో వైసీపీ నేతలు హాజరుకావటంతో పాటు మీ వెంటే మేము నడుస్తామని ముక్తకంఠంతో చెప్పారు. అత్యధిక శాతం మంది వైసీపీ నాయకులు హనిమిరెడ్డి పర్యటనలకు దూరంగా ఉండటం తోపాటు కృష్ణచైతన్య నిర్వహించిన సమావేశాలకు హాజరయ్యారు. అన్ని మండలాల నేతలతో సమావేశాలు నిర్వహించి అందరి అభిప్రాయాలను తెలుసుకొని భవిష్యత్ కార్యాచరణపై కృష్ణచైతన్య నిర్ణయం తీసుకుంటారన్న అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. అధిష్ఠానం పునరాలోచనచేసి తిరిగి కృష్ణచైతన్యకే ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడంతో పాటు, ఎన్నికలలో వైసీపీ అభ్యర్థిగా ప్రకటిస్తారన్న నమ్మకాన్ని బాచిన వర్గీయులు వ్యక్తం చేస్తున్నారు. ఒక వేళ వైసీపీ తరఫున కృష్ణచైతన్యకు టికెట్ కేటాయించని పక్షంలో బాచిన వర్గీయుల అడుగులు ఎటువైపు పడతాయన్న విషయం చర్చనీయాంశంగా మారింది. కృష్ణ చైతన్య సూచనలకు అనుగుణంగా ఎక్కువ మంది అడుగులు వేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. కొరిశపాడు, పంగులూరు, బల్లికురవ మండలాల పార్టీల అధ్యక్షులు శ్రీధర్, యర్రం శ్రీనివాసరెడ్డిలతో పాటు నేతలు చింతల పేరయ్య, చింతల శ్రీనివాసరావు, రాయిని సుబ్బారావు, సందిరెడ్డి రమేష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వెల్ఫేర్ అసిస్టెంట్ మృతి

సంతమాగులూరు(అద్దంకి), జనవరి 6: ఆర్టీసీ బస్సు ఢీకొనటంతో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ షేక్ మస్తాన్‌వలి(38) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. మార్టూరు మండలం వలపర్లకు చెందిన మస్తాన్‌వలి సంతమాగులూరు మండలలం ఏల్చూరు 2 సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఏల్చూరుకు చెందిన పెన్షన్‌దారుడు వినుకొండలో ఉండటంతో పింఛన్ డబ్బులు ఇచ్చేందుకు వినుకొండ వెళ్లి శనివారం సాయంత్రం మోటార్ సైకిల్‌పై తిరిగి వస్తున్నాడు. ఈక్రమంలో సంతమాగులూరు మండలం కామేపల్లి వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. తీవ్రగాయాలైన మస్తాన్‌వలి అక్కడికక్కడే మృతి చెందాడు. మస్తాన్‌వలికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్సై శివకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మరణం

అద్దంకి, జనవరి 6: మొదటి భార్యతో విడాకులు తీసుకొన్న యువకుడు రెండవ వివాహం కావటం లేదని మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. రాళ్లపల్లికి చెందిన స్వర్ణ కిషోర్‌బాబు(31)సమీపంలోని గ తనెల 18 పురుగుమందు తాగి రిమ్స్‌లో వైద్యం పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ టైర్ పేలి వ్యక్తికి గాయాలు

అద్దంకి, జనవరి 6: అద్దంకి పట్టణంలోని ద్వారకానగర్ వద్ద ట్రాక్టర్ టైర్‌కు పంచర్ కావటంతో విప్పే ప్రయత్నంలో పేలింది. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ యలమందకు తీవ్రగాయాలయ్యాయి. 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు తరలించారు.

ఇసుక మాఫియాకు అడ్డూ అదుపు ఏదీ..?



తలమళ్ల వాగులో ఇసుక తవ్వడంతో ఏర్పడిన గుంతలు

• రోజూ లక్షల్లో దోపిడి • ముఖ్యప్రజాప్రతినిధి కనుసన్నల్లోనే వ్యవహారం • చోద్యం చూస్తున్న అధికారులు

పొదిలి, జనవరి 6 : మండలంలోని ఇసుక మాఫియా రోజురోజుకు రెచ్చిపోతోంది. వాగులు వంకల్లో ఇష్టారీతిన తవ్వకాలు చేస్తున్నారు. అధికారులను మామూళ్ల మత్తులో నెట్టి రోజుకు పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తూ వైసీపీ నాయకులు సొమ్ము చేసుకుంటున్నారు.

మండలంలో దాదాపు 10 గ్రామాల పరిధిలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. అనధికారికంగా తరలిస్తున్న ఇసుకను స్థానికులకు గమనించి అధికారులకు తెలియజేసి పట్టించినా.., పట్టుమని పదినిమిషాల్లో తమ పలుకుబడితో విడిపించుకుపోతున్నారు. అక్రమంగా ఇసుక తరలించడం నేరం అని ఎవరైన ఒకరిద్దరూ అధికారులు అడ్డుపడ్డా, నిమిషాల్లోనే నియోజకవర్గ ప్రజాప్రతినిధుల నుంచి ఫోన్ వస్తోంది.

దీంతో అధికారులు కూడా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రతి ఇసుక ట్రాక్టర్ నుంచి నాయకులకు, అధికారులకు వాటాలు ఉన్నాయని ప్రజలు విమరిస్తున్నారు. దీంతోనే ఈ అక్రమ తవ్వకాలపై అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక అధికారులు కూడా సర్వీస్ రూల్స్‌ను పక్కనబెట్టి తమకు వచ్చే మామూళ్లపైనే దృష్టిసారిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

మండలంలో మూసివాగు ప్రాంతాలైన తలమళ్ల, అన్నవరం, నిమ్మవరం, కొస్టాలపల్లి, ఉప్పలపాడు, గోగినేనివారిపాలెం, ఏలూరు, సల్లూరు, ఈగలపాడు, కుంచేపల్లి, పాములపాడు, కాశీపురం, రాములవీడు గ్రామాలలో వాగుల్లో ఇసుక సమృద్ధిగా ఉంది. దీంతో ఆయా గ్రామాల పరిధిలో విచ్చలవిడిగా ఇసుక వ్యాపారం జరుగుతోంది. నిమ్మావరం, అన్నవరం, కొస్టాలపల్లి, కేశవబొట్లపాలెం, తలమళ్ల, ఏలూరు, సల్లూరు గ్రామాల్లో అక్రమ ఇసుక రాత్రి, పగలు తేడా లేకుండా సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం ఇసుక సిండికేట్ వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. గతంలో రూ.500 నుంచి వెయ్యి రూపాయల వరకు ఉన్న ఇసుక ట్రాక్టర్ ప్రస్తుతం రూ.5 వేలకు చేరింది. అంత ధరకు కావాలన్నా.. ముందుగా అక్రమంగా ఇసుక రవాణా చేసే వారిని సంప్రదించాలి. వారు ఏ అర్ధరాత్రో అపరాత్రో ఇసుకను తోలతారు. అక్రమార్కులు ఇసుకను తవ్వుకొని బైట ప్రదేశాల్లో రీచ్‌లు ఏర్పాటు చేసుకొని, ఇష్టారాజ్యంగా జేబులు నింపుకుంటున్నారని ఆయా గ్రామాల ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. నాయకులకు భయపడి అధికారులు అక్రమ ఇసుకాసురలను అడ్డుకోలేకపోవడంతో అక్రమార్కులు మూసీనదిని తోడేస్తున్నారు. ఒకవేళ నిర్మాణం చేసుకునే యజమాని సంబంధిత కార్యాలయం నుండి అనుమతి పొందాలని వెళ్లినా అధికారులు అనుమతులు ఇవ్వరు. అక్రమార్కులు మాత్రం ఎప్పుడో తీసుకున్న అనుమతి పత్రాన్ని చూపించి టన్నుల కొద్దీ ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మూసివాగు ప్రాంతాల్లో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణా దందాకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ఇసుకను తరలించడంతో బయటపడ్డ పైపులు

ద్విచక్రవాహన దొంగలు అరెస్టు

మార్కాపురం రూరల్ జనవరి 6: ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న నలుగురు దుండగులను అరెస్టు చేసి నట్లు సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, ఎస్సై కోటేశ్వరరావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎటువంటి పత్రాలు లేకుండా ద్విచక్ర వాహనాలను కొనుగోలు చేయవద్దన్నారు. పత్రాలు లేని వాహనాలను కొనుగోలు చేసిన వారిపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. దొంగతనాలకు పాల్పడుతున్న వారి వద్ద నుంచి ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఆరు మోటార్ సైకిల్‌లో మూడు మార్కాపురం పట్టణం, ఒకటి పెద్దారవీడు, మార్కాపురం రూరల్ ఒకటి, కంభం పట్టణానికి చెందిన ఒక మోటార్ సైకిళ్లను నిందితుల వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టుకు హాజరు పరచనున్నట్లు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్సై



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

ఏపీటీఎఫ్ నేతకు నివాళి

గిద్దలూరు టౌన్, జనవరి 6 : ఎపిటిఎఫ్ ఉద్యమనేత ఎం.బాలక్రిష్ణయ్య 11వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.శ్రీనివాసులు, జిల్లా అదనపు కార్యదర్శి కబీర్, జిల్లా ఉపాధ్యక్షులు పాండు, రంగస్వామి, కొమరోలు మండలశాఖ అధ్యక్షులు పిచ్చయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికుల ధర్నా

గిద్దలూరు, జనవరి 6 : సమాన పనికి సమాన వేతనం ఇచ్చి కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు ఆందోళన వీడబోమని నినాదాలు చేశారు. ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. కార్మికుల ఆదాయ పరిమితితో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు మురళీ, నాగయ్య, మౌలాలి, మస్తాన్, సీఐటీయూ నాయకులు ఆవులయ్య పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : గత 11 రోజులుగా సమ్మె చేస్తున్న మున్సిపల్ కాంట్రాక్ట్ ఇంజనీరింగ్ కార్మికులు శనివారం మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. గేట్లు మూసివేసి కమిషనర్, సిబ్బంది ఎవర్ని లోపలికి పోనివ్వలేదు. సీఐటీయూ జిల్లా నాయకులు సోమయ్య మాట్లాడుతూ బెదిరింపులు, నిర్బంధాలకు లొంగేది లేదన్నారు. కార్యక్రమంలో సుబ్బరాయుడు, హరికృష్ణ, ఇమాంసా, శివకృష్ణ, శ్రీనివాసులు, తిరుమలయ్య, గురునాథం పాల్గొన్నారు.



గిద్దలూరులో ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు

తర్లుపాడు, జనవరి 6: స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు హరిదాసు, వివిధ రకాల వేషధారణలతో అలరించారు. పాఠశాల విద్యార్థులు బృందాలుగా ఏర్పడి, సైన్స్ చిత్రాలను రంగురంగులతో చిత్రీకరించారు. విద్యార్థినులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ముగ్గుల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్‌బాబు బహుమతులు అందజేశారు. సైన్స్ పటాలను బహూకరించారు. మానవ అస్థిపంజరం చిత్రపటానికి ప్రథమ బహుమతి బి.శివనిహారిక గెలుపొందింది. మానవ హృదయం చిత్రపటానికి ద్వితీయ బహుమతి వి.లక్ష్మీ, భారతదేశ నదులు చిత్రపటానికి ఎన్‌వీ. లక్ష్మీతృతీయ బహుమతి సాధించింది. మానవ జీర్ణవ్యవస్థ చిత్రపటానికి ఎస్‌కే పరిదా నాలుగో బహుమతి సాధించింది. న్యాయ నిర్ణేతలుగా వి.జిజియారాణి, నారాయణం తులసి, రేవతిలు వ్యవహరించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 6: స్థానిక భాష్యం పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు శనివారం నిర్వహించారు. ముగ్గుల పోటీలు, భోగి మంటలు, గాలిపటాలు ఎగరవేసే కార్యక్రమాలు ప్రిన్సిపాల్ నాగరాజు ఆధ్వర్యంలో విద్యార్థులు సాంప్రదాయబద్ధమైన వస్త్రధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి, లిటిల్ చాంప్స్ ఇన్‌చార్జ్ హేమసుధ తదితరులు పాల్గొన్నారు.



ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు



భాష్యంలో ముందస్తు సంక్రాంతి వేడుకలు

ప్రజాసమస్యలను పరిష్కరించే వ్యక్తులను ఆదరించండి

ఎమ్మెల్యే అన్నా రాంబాబు

కొమరోలు, జనవరి 6: ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యలను పరిష్కరించే వ్యక్తులను ఆదరించాలని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం రోడ్డులో నూతనంగా ప్రారంభించిన ఎలీసా ఇండియన్ గ్యాస్ ప్రారంభ కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన ఉచిత గ్యాస్ కనెక్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విలువలతో కూడిన, నిజాయతీ పరులైన వ్యక్తులను ప్రజలు రానున్న ఎన్నికల్లో ఆశీర్వదించాలన్నారు. గతంలో తనను అత్యధిక మెజార్టీతో గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. కార్యక్రమంలో ఐటీసీ మేనేజర్ డి.భాస్కరరావు, జెడ్పీటీసీ సభ్యులు సారె వెంకటనాయుడు, తహశీల్దార్ రమాదేవి, సర్పంచ్ జనార్ధన్ నాయుడు, నాదెళ్ల వెంగయ్య చౌదరి, బండి తిరుమలనాథ్, గ్యాస్ నిర్వాహకులు బుట్టి ఆర్నాల్డ్ పాల్గొన్నారు.



మేడంవారిపల్లెలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ

రాచర్ల : మండలంలోని మేడంవారిపల్లి గ్రామంలో శనివారం 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరు కాగా శనివారం ఎమ్మెల్యే అన్నా రాంబాబు భూమిపూజ చేశారు. అనం తరం ఆయన మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతమైన మేడంవారిపల్లెలో విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరు కావడం ఈ ప్రాంత రైతులకు వరమన్నారు. వచ్చే వారంలో మరో మూడు సబ్ స్టేషన్లకు భూమి పూజ చేస్తామన్నారు. కార్య క్రమంలో ఎంపీపీ ఖాశింబీ, జడ్పీటీసీ సభ్యులు పగడాల శ్రీరంగం, విద్యుత్‌శాఖ ఏఈ నాగేశ్వర రావు, బిజ్జం రాంభూపాల్‌రెడ్డి, సూరా పాండురంగారెడ్డి, అన్నా రంజిత్‌కుమార్, సిఆర్‌ఐ మురళి, బెల్లం నాగిరెడ్డి, షేక్ మునాఫ్, మదిరె శ్రీరంగారెడ్డి, వైస్‌ఎంపీపీ సుజాత, రామరంగా రెడ్డి, ఏలం గోవిందయ్య పాల్గొన్నారు.

ఎస్మాపై ఫైర్

ఒంగోలు నగరం, జనవరి 6 : డిమాండ్లను సాధించే వరకు విశ్రమించేదేలేదంటూ ఉద్యమాన్ని రోజురోజుకూ ఉధృతం చేస్తున్న అంగన్‌వాడీలపై జగన్ ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తోంది. ఈమేరకు శనివారం జీవోను విడుదల చేసింది. దీని అమలు దిశగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారులు చర్యలు చేపట్టారు. సీడీపీవోల ద్వారా శనివారం నుంచి కార్యకర్తలకు, ఆయాలకు సమాచారం పంపుతున్నారు. ఈనెల 8వతేదీ లోపు విధుల్లో చేరకుంటే మీపై ఎస్మా ప్రయోగిస్తామంటూ అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వ తీరుపై అంగన్‌వాడీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా శనివారం అన్ని దీక్షా శిబిరాలు, ఆందోళన కార్యక్రమాల వేదికల వద్ద ఎస్మా చట్టం ప్రతులను తగులబెట్టారు. ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటామని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ నాయకులు తెగేసి చెబుతున్నారు. కాగా శనివారం జిల్లావ్యాప్తంగా అంగన్వాడీలు ఉద్యమాన్ని తీవ్రతరం చేశారు. అన్ని చోట్ల ఎస్మా చట్టాన్ని వ్యతిరేకిస్తూ ప్రతులను చించివేయటం, కాల్చి వేయటం వంటి కార్యక్రమాలు చేపట్టారు. మద్దిపాడులో ఎస్మా ప్రతులను తగులబెట్టారు. నాగులుప్పలపాడులో అంగన్‌వాడీలు ముఖ్యమంత్రి వైఖరిని నిరసిస్తూ మావనహారాన్ని నిర్మించారు. ఎస్మా జీవో ప్రతులను తగులబెట్టారు. పలుచోట్ల పొర్లు దండాలు పెడుతూ వినూత్న నిరసన తెలిపారు. ఇదేవిధంగా జిల్లావ్యాప్తంగా అన్ని ప్రధాన కేంద్రాల్లో ఈ కార్యక్రమం చేపట్టారు.

ఒంగోలులో 24 గంటల నిరవధిక దీక్ష

ఒంగోలు కలెక్టరేట్ వద్ద 24 గంటల నిరవధిక దీక్షా శిబిరాన్ని శనివారం సీఐటీయూ రాష్ట్ర మాజీ కార్యదర్శి వై.సిద్ధయ్య ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం వారి ఆందోళనను తక్కువ చేసి చూడటం దుర్మార్గమన్నారు. కనీస వేతనాలు అడగటం కూడా ఈ ప్రభుత్వానికి నేరంగా కనిపిస్తుందా అని ప్రశ్నించారు. ఎస్మాలు ప్రయోగించిన అనేక మంది పాలకులు ఉద్యమాల ఉప్పెనకు కొట్టుకుపోయారని, అదే గుణపాఠం ప్రస్తుత ప్రభుత్వానికి చెప్పేందుకు అంగన్‌వాడీలు సిద్ధంగా ఉన్నారన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కె.వి.సుబ్బమ్మ, అన్నపూర్ణ తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్ని బెదిరింపులకు పాల్పడినా పోరు ఆపేదిలేదన్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించే వరకు పోరాటం ఆగదన్నారు. ఉద్యమాన్ని అణచివేసేందుకు ఎన్ని ఎస్మాలు ప్రయోగించినా భయపడేబోమన్నారు.

కార్మిక సంఘాలు కన్నెర్ర

అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడంపై కార్మిక సంఘాలు కన్నెర్ర చేశాయి. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ నాయకులు శనివారం ఒంగోలులోని అంగన్‌వాడీల శిబిరం వద్ద నిరసన తెలిపారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి గుంటుపల్లి శ్రీనివాసులు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, ఏఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఆర్.మోహన్ మాట్లాడుతూ ఎస్మా చట్టం తేవడం దుర్మార్గమన్నారు. అంగన్‌వాడీలు, కార్మిక సంఘాలు సంఘటితంగా ఎస్మా చట్టాన్ని ప్రతిఘటించాలని ఆయన కోరారు. ఆదివారం జిల్లావ్యాప్తంగా ఎస్మా చట్టానికి సంబంధించిన ప్రతులను తగులబెట్టే కార్యక్రమాన్ని పెద్దఎత్తున చేపట్టాలని వారు పిలుపునిచ్చారు. కాగా అంగన్‌వాడీల నిరసన శిబిరం వద్దకు పలుప్రజా సంఘాలు, మహిళా సంఘాల నాయకులు వచ్చి సమ్మెకు సంఘీబావాన్ని తెలిపారు. నవ్యాంధ్ర రచయితల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు టి. అరుణ, ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, పీవోడబ్ల్యూ జిల్లాకార్యదర్శి మంజుల, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి అనంతలక్ష్మి, తెలుగు మహిళ నాయకురాలు అరుణ, నరసం ఉపాధ్యక్షురాలు సూర్యకుమారి, పీవోడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు పద్మ, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు విజయ తదితరులు అంగన్‌వాడీలకు మద్దతు తెలిపారు.


జీవో ప్రతుల దహనం
విధుల్లో చేరకుంటే వేటు తప్పదంటున్న అధికారులు
తగ్గేదే లేదంటున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీలపై ఎస్మా చట్టవిరుద్ధం

కంభం, జనవరి 6 : తమ న్యాయమైన డిమాండ్ల కోసం గత 26 రోజులుగా శాంతియుతంగా దీక్షలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలపై రాష్ట్ర ప్రభుత్వం అకాస్మత్తుగా ఎస్మా ప్రయోగించడం చట్టవిరుద్ధం, అప్రజాస్వామికమని సీఐటీయూ నాయకులు ఇబ్రహీం తెలిపారు. రాష్ట్రంలో 1.60లక్షల మంది అంగన్‌వాడీలకు న్యాయం చేయడం చేతకాక వారిపై అత్యవసర ఎస్మా ప్రయోగించడం ఏమిటని ప్రశ్నించారు. ఎస్మా ప్రయోగం మొదటి రోజే చెప్పాలని, ఇప్పుడు చెప్పడం ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనమన్నారు. ఇప్పటికైనా అంగన్‌వాడీల సమస్యలను గుర్తించి ఎస్మాను తక్షణమే ఉపసం హరించు కోవాలని డిమాండ్ చేశారు.

మార్కాపురం వన్‌టౌన్ : సమస్యలు పరిష్క రించాలని గత 26 రోజులుగా సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదురు అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె శనివారం కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ చిత్ర పటానికి తమ యూనిఫాం చీరెలు, సెల్‌ఫోన్లు, పసుపు, కుంకు మ, పూలు, గాజులు అందజేశారు. , లక్ష్మీదేవి, రమాదేవి పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : జీతాలు పెంచాలని సమ్మెచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు శనివారం ఎర్రగొండపాలెంలో దర్నాశిబిరం వద్ద దర్నా నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్& హెల్పర్స్ యూనియన్ నాయకులు జి మల్లేశ్వరి, పి సుబాషిణి, నాగరాజకుమారి, రామ సుబ్బమ్మ, అరుణ,సునీత, తలపాటి సుబ్బమ్మ, సుజాత, విజయలక్ష్మి, రూత్‌మేరి, రామకుమారి,తిరుపాలమ్మ, తదితరులు పాల్గొనారు.



సాష్టాంగ నమస్కారం చేస్తున్న మహిళలు

అవీ..ఇవీ..

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 6: స్థానిక చెన్నకేశవ స్వామి ఆలయంలో నూతనంగా నిర్మించనున్న ఆంజనేయస్వామి ఆలయానికి శనివారం భూమిపూజ నిర్వహించారు. అర్చకులు అప్పనాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, దేవస్థానం చైర్మన్ కేశవరావు, ఈవో శ్రీనివాసరెడ్డి గాలి గోపుర నిర్మాణానికి సహకరించిన దాతలు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న భక్తులు

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలి

గిద్దలూరు, జనవరి 6 : పేద ఆర్యవైశ్య విద్యార్థులు ప్రతిభ ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని వాసవీ ఆర్యవైశ్య పేద విద్యార్థుల సేవా సంస్థ అధ్యక్షులు బొగ్గరపు వెంకటసుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి బొగ్గరపు వెంకటరామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని ఆర్యవైశ్య పేద విద్యార్థులు ఎంటెక్, బీటెక్, ఎంసీఏ, ఎంబీఏ, ఎంబీబీఎస్, సీఏ, బిఫార్మసీ, ఎం.ఫార్మసీ, పీజీ కోర్సులు చదువుతున్న వారు గిద్దలూరు అమ్మవారిశాలలోని తమ కార్యాలయం నుంచి దరఖాస్తు తీసుకుని 20వ తేదీలోగా పూర్తి చేసి ఇస్తే ప్రతిభను బట్టి ఉపకార వేతనాలను అందజేస్తామని పేర్కొన్నారు.

అయోధ్య అక్షతల పంపిణీ

గిద్దలూరు, జనవరి 6 : పట్టణంలోని కొప్పువారి వీధిలో అయోధ్యరామ మందిర ఫొటోలను, అక్షతలను బీజేపీ నాయకులు ఇంటింటికి తిరిగి అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.వి.రామాంజ నేయులు, జిల్లా కార్యవర్గ సభ్యులు ముప్పూరి శ్రీనివాసులు, పట్టణశాఖ అధ్యక్షులు ఏ.ఉదయ్‌శంకర్, ఎస్సీమోర్చ ఇన్‌చార్జ్ జయప్రసాద్, ఆర్యవైశ్య సంఘం నాయకులు సూరె రామచంద్రుడు, చందలూరి హరి, తదితరులు పాల్గొన్నారు.



అక్షతలను అందజేస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీలో పలువురి చేరిక

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 6: మార్కాపురంలోని పలువురు నాయకులు బీజేపీలో స్థానిక పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ ఇన్‌చార్జ్ పీవీ కృష్ణారావు వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పట్టణానికి చెందిన సుబ్బారావు, రంగనాయకులు, రామశేషు, కాశీనాథ్‌లు బీజేపీలో చేరారు.



కార్యకర్తలకు పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న కృష్ణారావు

కళాశాల అధ్యాపకులకు డాక్టరేట్లు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 6: స్థానిక శ్యామ్యూల్ జార్జ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇద్దరు అధ్యాపకులకు డాక్టరేట్లు లభించాయి. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రాజాబాబుకు జేఎన్టీయూ అనంతపురం ప్రొఫెసర్ ఎస్‌వీ సత్యనారాయణ, డాక్టర్ దిలీప్ కుమార్‌ల పర్యవేక్షణలో సింథసిస్ అండ్ క్యారక్టరైజేషన్ ఆఫ్ ఎడ్ సార్బెంట్స్ ఫర్ హెడ్ సార్ప్షన్ ఆఫ్ డైస్ అనే పరిశోధన అంశంపై కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో డాక్టరేట్ లభించింది. డాక్టర్ వి.రాజాగోపాలుడుకు డాక్టర్ ఎన్.సరిత, డాక్టర్ దేవన్నల పర్యవేక్షణలో మెథడ్ వ్యాల్డినేషన్ ఫర్ ఎల్‌సీఎమ్‌ఎస్ అనే అంశంపై డాక్టరేట్ పట్టాలను అనంతరంపురంలో ఉపకులపతి రంగజనార్ధన్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులను డా. ఏ.సతీష్ అభినందించారు.



డాక్టరేట్ అందుకుంటున్న రాజాబాబు

ఉపసర్పంచికి సర్పంచి బాధ్యతలు

• అనారోగ్యంతో సెలవులో వెళ్లిన వీరభద్రాపురం సర్పంచ్

ఎర్రగొండపాలెం, జనవరి 6 :మండలంలోని వీరభద్రాపురం సర్పంచి బాధ్యతలు ఉప సర్పంచి ముటుకూరి అరుణకుమారి శనివారం స్వీకరించారు. ఈ మేరకు ఎర్రగొండపాలెం ఎంపీడీవో వై.వి.నాగేశ్వర ప్రసాద్ నుంచి ఉత్తర్వుల కాపీని అరుణకుమారి స్వీకరించారు. వీరభద్రాపురం సర్పంచి ఆలేటి ఆశీర్వాదం 2023 నవంబరు 29 తేది నుంచి అనారోగ్య కారణాలతో 6 నెలలు సెలవులో వెళ్లారు. మరొకరికి సర్పంచి బాధ్యతలు అప్పగించాలని ఎంపీడీవోకు సర్పంచి ఆశీర్వాదం లేఖ పంపించారు. దీంతో ఉపసర్పంచి అరుణకుమారికి సర్పంచి బాధ్యతలు ఎంపీడీవో అప్పగించారు. కార్యక్రమంలో ఎంపీపీ డి.కిరణ్‌గౌడ్, ఉపాధ్యక్షులు ఎం.శేషు పాల్గొన్నారు.



ఉత్తర్వులు అందజేస్తున్న ఎంపీడీవో

ఏఎంసీ మాజీ చైర్మన్ మృతి

గిద్దలూరు, జనవరి 6 : గిద్దలూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ షేక్ మెహతాబ్ (53) శనివారం సాయంత్రం మృతిచెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మెహతాబ్ హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతిచెందారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు ఆమె కుమారుడు సూరజ్ తెలిపారు. మెహతాబ్ భర్త షైనుద్దీన్ హైకోర్టు న్యాయవాదిగా పనిచేస్తూ సొంత గ్రామమైన గిద్దలూరులో బీఈడీ కళాశాల నిర్వహిస్తూ కొంతకాలం క్రితం అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలిసిందే.



వెలిగొండను త్వరితగతిన పూర్తి చేయాలి

గిద్దలూరు, జనవరి 6 : రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యానికి బలవుతున్న వెలుగొండ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేయాలని కోరుతూ బిజెపి నాయకులు స్థానిక ఇరిగేషన్ స్పెషల్ సబ్ డివిజన్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డీఈని కలిసి వినతిపత్రం అందజేశారు. 2019 నుంచి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనకు వచ్చిన ప్రతిసారి వెలుగొండ ప్రాజెక్టుపై గాలిమాటలు చెప్పడం మినహా నిధులు ఇవ్వలేదన్నారు. పశ్చిమ ప్రాంతానికి సాగు, తాగు నీటిని అందించే ఏకైక ప్రాజెక్టు వెలుగొండ మాత్రమే అన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యదర్శి పిడతల రమేష్‌రెడ్డి, ఒబిసి ప్రధాన కార్యదర్శి దూదేకుల బాదుల్లా, ఎస్సీ మోర్చ నాయకులు ఎం.పుల్లయ్య, అసెంబ్లీ కోకన్వీనర్ గుమ్మా రాముడు, ఓబీసీ మోర్చ ఉపాధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

తిప్పాయపాలెంలో బెల్ట్‌షాపుపై దాడి

మార్కాపురం రూరల్, జనవరి 6: మండలంలోని తిప్పాయపాలెం గ్రామంలోని కిరాణా షాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న షాపుపై పోలీసులు శనివారం రాత్రి దాడి చేశారు. తిప్పాయపాలెం గ్రామానికి చెందిన తాడి రమేష్ తన కిరాణా షాపులో మద్యం అక్రమంగా అమ్ముతున్నాట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు దాడి చేసి 20 మద్యం సీసాలను ట్రైనింగ్ డిఎస్పీ షహనాజ్ అహ్మద్, రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర నాయక్ లు తన సిబ్బందితో వెళ్లి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పింఛన్ కోసం ఎదురుచూపులు

- ఆరురోజులైనా అందని డబ్బులు
- ఇబ్బందిపడుతున్న వృద్ధులు, వితంతువులు
- నగదు రాలేదంటున్న పంచాయతీ కార్యదర్శులు

ముండ్లమూరు, జనవరి 6 : ప్రతి నెలా 1వ తేదీ పంపిణీ చేయాల్సిన పింఛన్‌లు అందక వృద్ధులు ఎదురు చూస్తున్నా రు. ఈసారి 6వ తేదీన అరకొరగానే పంపిణీ చేశారు. మండలంలో మొత్తం పింఛన్‌లు 7,358 ఉండగా, శనివారానికి 6,396 మందికి మాత్రమే పంపిణీ చేశామని అధికారులు తె లిపారు. పింఛన్ మీద ఆధార పడి ఉన్న వృద్ధులు, వితంతువులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ఎంపీడీవో శంకరరావును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా 86.93 శాతం పంపిణీ చేశామని, బ్యాంకులో నగదు లేక పోవడంవల్ల మిగతా శాతం పంపిణీ చేయలేక పోయాయని తెలిపారు.

కాలువలో పూడిక తీత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాళ్లూరు, జనవరి 6 : తాళ్లూరుపంచాయతీ పరిధిలో గ్రామ సర్పంచ్, గ్రామకార్యదర్శి ఆధ్వర్యంలో శని వారం గ్రామంలో మురుగు కాలువలో పూడిక తీత పనులు చేపట్టారు. గ్రామాల్లో పారిశుధ్య అధ్వానం అన్న క థనం గతనెల 27వ తేదీ ప్రచురితమైంది. స్పందించిన గ్రామ సర్పంచ్ చార్లెస్ సర్జన్, గ్రామ పంచాయతీ కార్యదర్శి జె. లక్ష్మీకాంత్‌పారిశుధ్య ప నులు చేయించారు. గ్రామాల్లో పలు వీధుల్లోని కాలువల్లో మురుగునీరు దిగువక వెళ్లక కంపుకొడుతున్నాయి. వీధులన్నీ అపరిశుభ్రంగా మా రడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై వార్త రావడంతో పం చాయతీ కార్యదర్శి స్పందించి పూడికతీత పనులు చేయించారు. కా లువల్లో చెత్తాచెదారాన్ని వేయొద్దని ఆయన సూచించారు.

ఎస్మా ప్రయోగం దుర్మార్గం

ప్రతులను కాల్చి నిరసన తెలిపిన అంగన్‌వాడీలు



నిరసన ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

దర్శి, జనవరి 6 : సమస్యలు పరిష్కరించకుండా అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించడం దుర్మార్గమని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం దర్శి పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన ఎస్మా జీవో ఉత్త ర్వులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ దర్శి నియోజకవర్గ కార్యదర్శి రంగారావు మాట్లాడు తూ గౌరవ వేతనంతో పనిచేస్తున్న కార్యకర్తలకు ఎ స్మా చట్టం ఎలా వర్తిస్తుందని ఆయన ప్రశ్నించారు. వైసీపీ పాలకులు నిబంధనలను తుంగలోకి తొక్కి బె దిరించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చే శారు. 26 రోజులుగా ఆందోళనలు చేస్తున్నా జగన్‌రె డ్డి పట్టించుకోకపోవటం దారుణమన్నారు. డిమాండ్లు నెరవేర్చు వరకు పోరాటం కొనసాగుతుందన్నారు. కా ర్యక్రమంలో యూనియన్‌నాయకురాళ్లు తిరుపతమ్మ, సుజాత, జయమణి, జయమ్మ, నాగమణి, విశ్వవాణి, వెంకటరమణ, మల్లేశ్వరీ, సీఐటీయూ నాయకులు సందు వెంకటేశ్వరరావు, నారాయణ పాల్గొన్నారు.

కనిగిరి : అంగన్‌వాడీలపై ప్రభుత్వం ఎస్మా ప్ర యోగించడం దుర్మార్గమని ఏఐటీయూసీ నాయకులు యాసిన్ పేర్కొన్నారు. శనివారం ఓ ప్రకటనలో అంగ న్‌వాడీలపై ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను ఖండించారు. అంగన్‌వాడీలు తమ సమస్యల పరిష్కా రం కో సం 26 రోజులుగా వివిధ రూపాల్లో సమ్మె చే స్తున్న అంగన్‌వాడీలపై జగన్ సర్కార్ ఎస్మా ప్రయో గిస్తూ జీవో నెం.2ను విడుదల చేయడం బాధాకరమ న్నారు. గత నెల వేతనంలో రూ.3వేలు కోత విధించి మిగతా సొ మ్మును వారి ఖాతాల్లో జమ చేసిందన్నా రు. అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎన్నికలకు ముందు ఇ చ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చే శారు. అదేవిధంగా సీఐటీయూ నాయకులు పీసీ కేశ వరావు అంగన్‌వాడీలపై ప్రభుత్వం విధించిన ఎస్మా ప్రయోగం చట్ట విరుద్ధమన్నారు. న్యాయమైన సమ స్యల కోసం పోరాటం చేస్తున్న అంగన్‌వాడీలపై ఎస్మా పేరుతో బెదరింపులకు పాల్పడితే సీఐటీయూ వారికి అండగా ఉంటుందన్నారు. రాష్ట్ర వ్యా ప్తంగా ఆందోళ నలు మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా జగన్‌రెడ్డి అంగన్‌వాడీల సమస్యలను పరి ష్కరించాలని డిమాండ్ చేశారు.



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న మాల్యాద్రి

పామూరు : న్యాయమైన కోర్కెల సాధన కో సం సమ్మె చేస్తున్న అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించ కుండా వారిపై ఎస్మాను ప్రయోగించడం అన్యాయ మని సీఐటీయూ మండల కార్యదర్శి కే మాల్యాద్రి అన్నారు. ఉద్యమాన్ని అణచివేయాలని చూసిన ప్రభు త్వాలు పతనమైన విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. ఎంపీడీవో కార్యాలయం ఎదుట అంగన్‌వా డీలపై ఎస్మాను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ శని వారం ధర్నా నిర్వహించారు. సమస్యను పరిష్కరించే వరకూ ఉద్యమం ఆగదని, అంగన్‌వాడీలకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎం.మహదేవయ్య, కె.శంకర్, భాగ్యలక్ష్మి, రజియా, అమల, పార్వతి, రమీజి, రాజ్యలక్ష్మి, పద్మ, రామసు బ్బులు, గీత, ఝాన్సీ, వాణి పాల్గొన్నారు.



మాజీ మహిళా ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న చంద్రబాబు

చంద్రబాబును కలిసిన మహిళా నేతలు

పామూరు, జనవరి 6 : కనిగిరిలోని అమరావతి గ్రౌండ్స్‌లో మాజీ ము ఖ్యమంత్రి చంద్రబాబును పామూరుకు చెందిన మాజీ మహిళా ప్రజాప్రతిని ధులు శనివారం కలిశారు. శుక్రవారం జరిగిన శంఖారావం సభలో పెద్ద సం ఖ్యలో మహిళలు పాల్గొన్నారు. టీడీపీ మినీ మేనిఫెస్టోలో ప్రకటించిన మహి ళాశక్తి, సూపర్‌సిక్స్ పథకాలు మహిళల్లో నూతనోత్సాహాన్ని నింపుతున్నాయని, ఆర్థిక ధైర్యాన్ని ఇస్తున్నాయని వారు బాబు దృష్టికి తీసుకెళ్లారు. టీడీపీ వి జయం కోసం, మీ పాలన కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని మాజీ ఎంపీపీ పువ్వాడి తిరుపతయ్య జడ్పీటీసీ మాజీ సభ్యుడు బొల్లా మహాలక్ష్మమ్మ చంద్ర బాబుకు తెలిపారు. రానున్న ఎన్నికల్లో మహిళలు కీలకపాత్ర పోషించాలని, సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చంద్రబాబు వారికి సూచించారు. పువ్వాడి వెంకట లక్ష్మమ్మ, దేవరపు రవణమ్మ, పువ్వాడి సుజాత, మరికొందరు మహిళలు బాబును కలిసినవారిలో ఉన్నారు.

బాబుకు వినతి



బాబుతో మాట్లాడుతున్న పోకా

పామూరు, జనవరి 6 : కనిగిరిలోని టీడీపీ కార్యాలయం (అమరావతి గ్రౌండ్స్‌లో మాజీ ముఖ్యమంత్రి చం ద్రబాబుకు టీఎన్ఎస్ఎఫ్ జిల్లా మాజీ కా ర్యదర్శి పోకా నాయుడుబాబు శనివా రం కలిసి వినతిపత్రం అందజేశారు. వైసీ పీ అధికారంలోకి వచ్చిన అనంత రం రాష్ట్రంలోనే తొలిసారిగా నాపై వైసీపీ నా యకులు పోలీసు కేసు న మో దు చేసారని వివరించారు. మిమ్మల్ని, లోకేష్‌ను టీవీ డిబెట్‌లో మంత్రి అనిల్ కుమార్‌యాదవ్ అనుచిత వ్యాఖ్యాలు చేసారని ఆ వ్యాఖ్యలను తాను సోషల్ మీడియా ద్వారా ఖండించగా, దానిపై పోలీస్ స్టేషన్‌లో కేసులు బనాయించి జైలుపాలు చేసారని చంద్రబాబు ముందు ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ అ వినీ తి అక్రమాలను ప్రశ్నించే వారిపై తప్పుడు కేసులతో వేధించడం పరిపా టిగా మారిందన్నారు. త్వరలోనే మంచి రోజులు వస్తాయని, అధైర్యపడవద్దని బాబు ధైర్యం చెప్పారని పోకా తెలిపారు.

డిమాండ్ల సాధన కోసం రాస్తారోకో

దర్శి, జనవరి 6 : డిమాండ్ల సాధన కోసం చేస్తున్న ఆందోళనల్లో భాగంగా దర్శి నగర పంచాయతీ కార్మికులు శనివారం గడియారస్తంభం సెంటర్‌లో రాస్తారోకో ధర్నా చేశారు. ప్రధాన రహదారులను దిగ్బంధించడంతో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. అంతక ముందు కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోడిదాసు మాట్లాడుతూ కార్మికుల ఆందోళన వైసీపీ పాలకు లకు పట్టకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ కే హనుమంతరావు, జి ల్లా అధ్యక్షుడు కరుణానిధి, సీఐ టీయూ నాయకుడు రంగారావు, కార్మికుల యూనియన్ నా యకులు ఇత్తడి ఇర్మియా, ప్రభాకర్, పుల్ల య్య, విజయ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కనిగిరి : మున్సిపల్ కార్మికుల పట్ల ప్రభుత్వం నిరంకుశ ధోరణి అవలంబి స్తుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పీసీ కేశరావు అన్నారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట శనివారం కార్మికుల సమ్మె నిర్వహించారు. కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయాలని, ఆప్కాస్ నుంచి మినహాయించాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తో పాటు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, రూ.20వేల వేత నం ఇవ్వాలన్నారు. విధి నిర్వహణలో మృతి చెందిన కార్మికులకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కావాలంటే ఐక్య పోరాటం ద్వారానే సాధ్యమవుతుందన్నారు. కార్య క్రమంలో యూనియన్ నాయకులు ఎస్‌కే ఖాదర్‌వలి, చార్లెస్, వీ మార్క్, గర టయ్య, దస్తగిరి, రమణమ్మ, ఈశ్వరమ్మ, దానియేలు, ఏఐటీయూసీ నాయకులు నాసర్‌వలి, అశోక్, కల్యాణ్, రత్తయ్య పాల్గొన్నారు.



కబడ్డీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

దర్శి, జనవరి 6 : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. సీనియర్ జర్నలిస్టు శీలం శ్రీనివాసరెడ్డి, దర్శి నగర పంచాయతీ వైస్ చైర్మన్ జీ స్టీవెన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పురుషుల జట్లు, మహి ళల జట్లు పాల్గొన్నాయి. పురుషుల జట్టుకు ఒక వైపు, మహిళల జట్లకు ఒక వైపు అట్టహసంగా పోటీలు నిర్వహిస్తున్నారు. పోటీలను అధిక సంఖ్యలో ప్రజలు, యువత తిలకించారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు యూటీఎఫ్ సాయం

పీసీపల్లి, జనవరి 6 : సమస్యలను పరిష్కరించాలంటూ కొద్దిరోజులుగా సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు యూటీఎఫ్ ఆర్థిక సాయం ఇచ్చి అండగా నిలి చింది. పీసీపల్లిలో సమ్మెలో ఉన్న ఉద్యోగులను కలిసిన యూటీఎఫ్ సభ్యులు శని వారం వారి మద్దతును తెలిపారు. అనంతరం మండలశాఖ తరపున రూ.37వేలను అందించారు. నాయకులకు ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు.

బాలికల హైస్కూల్‌లో ముగ్గుల పోటీలు

కనిగిరి, జనవరి 6: సంక్రాంతి ముగ్గుల పోటీలు స్థానిక ప్రభుత్వ బా లికల హైస్కూల్‌లో శనివారం ఘనంగా జరిగాయి. ఈ పోటీల్లో హైస్కూ ల్‌కు చెందిన వివిధ తరగతుల బాలికలు 62మంది పాల్గొన్నారు. హై స్కూల్ హెచ్ఎం కలవ విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పో టీల్లో గెలుపొందిన 15మందికి వాసవీ వనితా క్లబ్ వారు బ హుమ తులను అందజేశారు. కార్యక్రమంలో పీడీ పాశం సుశీల, టీచర్స్ సెక్రటరీ షేక్ దిల్‌షాద్‌బేగం, ఉపాధ్యాయులు పరశు సత్యగోపాల్, రమణారెడ్డి, భాస్కర్, నారాయణలు పాల్గొన్నారు.

ఎంఈవో కార్యాలయానికి సామగ్రి బహూకరణ

కనిగిరి, జనవరి 6 : కనిగిరి నియోజకవర్గంలోని వెలిగండ్ల మండల విద్యాశాఖాధికారి కార్యాలయానికి విశ్రాంత ఉపాధ్యాయులు శనివారం ఫర్నిచర్‌ను బహూకరించారు. ఎంఈవో దేవిరెడ్డి రామిరెడ్డి దాతలను అ భినందించి సత్కరించారు. దుగ్గెంపూడి రామిరెడ్డి, గొరిగె వెంకటప్రసాద్, దేవిరెడ్డి రామిరెడ్డిలు బీరువా, టేబుల్, రివాల్వింగ్ చైర్‌లను అందచేశారు. కార్యక్రమంలో హెచ్ఎం బీ రాఘవాచారి, ఎం శ్రీనివాసులు, హరిబాబు, సైకం శ్రీనివాసురెడ్డి, గజ్జల తిరుపతిరెడ్డి, మాల్యాద్రి, నారపరెడ్డి వెంకటరె డ్డి, సత్యనారాయణ, నారాయణరెడ్డి, రత్తయ్య, హరికేశవ పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్

తాళ్లూరు, జనవరి 6 : అర్హులందరికీ పింఛన్‌ను అందజేస్తామని ఎంపీపీ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో నూతనంగా పెన్షన్లు మం జూరైన వారికి ఎంపీడీవో హాలులో శనివారం అందజేశారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

పామూరు, జనవరి 6 : అయ్యప్పస్వామి దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదాన కార్యక్రమానికి పామూరుకు చెందిన మాజీ వార్డు మెంబర్ ఓగూరి నరసింహారావు రూ.1,1116 విరాళాన్ని అందజేశారు. తండ్రి ఓ గూరి వెంకటేశ్వరు, అన్న శ్రీనివాసుల జ్ఞాపకార్థం వార్డుమెంబర్ బుజ్జ మ్మ, కుమారుడు నరసింహారావు, భార్య వరలక్ష్మి, కుటుంబ సభ్యులు, సం ధ్య, మనోజ్, మహేష్ సౌజన్యంతో శనివారం అయ్యప్పలకు భిక్షను ఏ ర్పాటు చేశారు. దాతలకు దేవస్థాన కమిటీ అధ్యక్షుడు కావిటి సుబ్బయ్య, స్వామివారి తీర్థప్రసాదాలను అందచేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు చల్లా సుబ్బారావు, రాచూరి సురేష్, ఓగూరి ఏడుకొండలు, వాయినేని మాల్యాద్రి, గద్దె రత్తయ్య పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని సామగ్రి చోరీ

తాళ్లూరు, జనవరి 6 : మండలంలోని కొత్తపాలెం పొలాల్లో శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని సా మగ్రి చోరీ చేశారు. గ్రామానికి దక్షిణంవైపు పొలాల్లో మాధవరం ఫీడర్ కింద ఉన్న లోకిరెడ్డి సుబ్బారెడ్డి పొలంవద్ద గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు పగల గొట్టారు. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉన్న యి, ద్యుత్ తీగలను చోరీ చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ లేక పోవడంతో రైతు సుబ్బారెడ్డితో పాటు రై తులు వేసిన మొక్క జొన్న తడిపెట్టేందుకు నీటి వసతి లేక ఇబ్బందులు పడుతున్నారు. తాళ్లూరు ప్రాంత పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ కి గురవుతున్నా అడ్డుకట్ట వేయడంలో పోలీస్ యంత్రాంగం విఫలమ యిందని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చోరీలకు పాల్పడుతున్న దుండగుల భరతంపట్టాలని కోరుతున్నారు.





విద్యార్థినుల నృత్యాలు

ముగ్గుల హరివిల్లు

- బాపట్లలో రంగవల్లుల సంబరం
- శోభాయమానంగా ఆంధ్రరత్న మార్గ్
- ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీకి విశేష స్పందన
- విజేతలకు బహుమతుల అందజేసిన జీఎస్ఆర్ బిల్డర్స్




బాపట్లలో హరివిల్లులకు రంగులు దిద్దుతున్న మహిళలు



రాష్ట్ర స్థాయి విజేతే లక్ష్యం

నా పుట్టిల్లు బాపట్ల మండలం జిల్లెల్లమూడి గ్రామం. మెట్టినిల్లు ఒంగోలు. ముగ్గుల పోటీలో ప్రథమ బహుమతిగా నిలవడం ఆనందంగా ఉంది. నా లక్ష్యం రాష్ట్ర స్థాయిలో ప్రథమ విజేతగా నిలవడమే. ఈ సారి ఎలాగైనా దానిని సాధిస్తాను.

- లక్ష్మీ ప్రసన్న, ప్రథమ బహుమతి విజేత





మాకెప్పుడూ ముగ్గులు ప్రత్యేకమే..

సంక్రాంతి వచ్చిందంటే మాకు ఎప్పుడూ ముగ్గులు ప్రత్యేకమే. రంగవల్లులు వేయడంలో పోటీ పడడమంటే ఎంతో ఆనందం. ఈ పోటీలలో ద్వితీయ బహుమతి రావడం ఎంతో ఆనందాన్నిచ్చింది. ఇంతమందితో కలిసి పాల్గొనడం మధురానుభూతిగా మిగలనుంది.

- కర్ణాటక లక్ష్మి, బాపట్ల, ద్వితీయ బహుమతి







ఆంధ్రజ్యోతి ప్రయత్నం అభినందనీయం

నానాటికీ కనుమరు గవుతున్న సంప్రదాయాలను కాపాడే ప్రయ త్నంలో భాగంగా ఆంధ్రజ్యోతి రంగవల్లుల పోటీ నిర్వహించడం ఆనందంగా ఉంది. ముఖ్యంగా తెలుగు లోగిళ్లలో ఆనందాల హరివిల్లు విరబూసే సంక్రాంతి ముంగిట ఇలా వేడుకలు జరపడం అభినందనీయం.

- రావూరి అంజని, బాపట్ల, తృతీయ బహుమతి

బాపట్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): వారం ముందే సంక్రాంతి వచ్చిందా అనేంత సంబరంగా బాపట్లలో ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలు జరిగాయి. పోటీకి మహిళలు, విద్యార్థునుల నుంచి విశేష స్పందన లభించగా ఆ ప్రాంతంలో ముగ్గుల హరివిల్లు ఆవిష్కృతమైంది. చిట్టిచేతులతో చిన్నారులు.. కొంగుబిగించిన మహిళలు.. రంగవల్లులను తీర్చిదిద్దారు. ఇలపైకి ఇంద్రధనుస్సు దిగివచ్చిందా అన్న రీతిలో రంగుల ముగ్గులు ఆకట్టుకున్నాయి. సందేశాత్మకంగా, సంప్రదాయం ఉట్టిపడేలా సంక్రాంతి శోభను ముందస్తుగా కళ్లకు కట్టినట్లుగా రంగవల్లులను మహిళలు, యువతులు తీర్చిదిద్దారు. చిట్టిచేతులతో చిన్నారులు తమ ప్రతిభ చూపిస్తే, కొంగుబిగించి మహిళలు సరికొత్త రంగుల ఇంద్రధనస్సును భువిపైకి దించారు. యువతరం ఆలోచనలను ప్రతిబింబించేలా కళాశాల విద్యార్థినులు ముగ్గులు వేశారు. ఇలా చిన్నా పెద్ద తేడా లేకుండా 130 మంది నారీమణులు ఉత్సాహంగా ముగ్గుల పోటీలో భాగస్వాములయ్యారు. ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిందని అతిథులు హర్షం వ్యక్తం చేశారు. సంక్రాంతి విశిష్టతను తెలిపే ముగ్గులతో పాటు నవధాన్యాల విశిష్టతను వివరించే రంగవల్లులు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. జిల్లా నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో మహిళలు, యువతులు, విద్యార్థినులు హాజరయ్యారు. సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ముగ్గులను తీర్చిదిద్దారు. పోటీల నేపథ్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మహిళలు, విద్యార్థినులతో పాటు చిన్నారులు సైతం ముగ్గుల సంబరంలో ఉత్సాహంగా భాగస్వాములయ్యారు. బాపట్ల ఫైర్ స్టేషన్ నుంచి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే రోడ్డులో రంగవల్లులను తీర్చిదిద్దారు. ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంకు ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గ సీమ సుకేతన సంయుక్తంగా ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ శ్రీభ్రమర టౌన్ షిప్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా జీఎస్ఆర్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత గుండ్రెడ్డి శివ సహకారంతో జరి గిన ముగ్గుల పోటీలు కన్నుల పండుగగా జరిగాయి. పోటీలో పాల్గొన్న వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గుం డ్రెడ్డి శివ సహకారంతో అంద జేశారు. ప్రథమ బహుమతి మే నిగ లక్ష్మీప్రసన్న, రెండో బహు మతిని కర్ణాటక లక్ష్మి, తృతీయ బహుమతి రావూరి అంజని అందుకున్నారు.

డీఎస్పీ ప్రోత్సాహక బహుమతులు

ముగ్గుల పోటీలను బాపట్ల డీఎస్పీ వెంకటేశ్వర్లు ప్రారంభించి పోటీల్లో పాల్గొన్న వారికి అభినందనలు తెలిపారు. అంతరించి పోతున్న సంప్రదాయాలను కాపాడడంలో ఆంధ్రజ్యోతి నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలు దోహదపడుతున్నాయిని కొనియాడారు. రంగవల్లుల పోటీకి పెద్దసంఖ్యలో మహిళలు, విద్యార్థినులు తరలి రావడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. పోటీలో పాల్గొన్న వారికి ప్రోత్సాహకరంగా ఆయన స్వయంగా ఐదుగురికి కన్సోలేషన్ బహుమతి కింద నగదు పురస్కారాన్ని అందజేశారు. డీఎస్పీ సతీమణి రేణుక, కుమారుడు విజయ్‌కుమార్‌తో కలిసి రంగవల్లులను తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. ముగ్గుల పోటీలకు స్పందన ఎక్కువగా ఉండడంతో జూనియర్స్ విభాగం పేరిట విద్యార్థినులకు పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను బాపట్ల మున్సిపల్ కమిషనర్ భాను ప్రతాప్ ప్రారంభించారు. ప్రోత్సాహక నగదు పురస్కారం అందుకున్న వారిలో చిన్నారి స్వీటీ ఉండగా, కళాశాల విద్యార్థినులు నలుగురు ఉన్నారు.



ముగ్గుల పోటీల వద్ద మాట్లాడుతున్న బాపట్ల డీఎస్పీ టి.వెంకటేశ్వర్లు



జీఎస్ఆర్ బిల్డర్స్ అధినేత గుండ్రెడ్డి శివ నుంచి ప్రథమ బహుమతి అందుకుంటున్న మేగిగ లక్ష్మీప్రసన్న



అసిస్టెంట్ ప్రొఫెసర్ కృష్ణకుమారి నుంచి ద్వితీయ బహుమతి అందుకుంటున్న కర్ణాటక లక్ష్మి



ముగ్గులు వేస్తున్న యువతులు



అసిస్టెంట్ సీడీపీవో నుంచి తృతీయ బహుమతి అందుకుంటున్న రావూరి అంజని

8న నీటి విడుదల

- తీరనున్న తాగు నీటి వెతలు
- 5 టీఎంసీలు కేటాయించిన కేఆర్ఎంబీ
- సాగర్ నుంచి రోజుకు 5 వేల క్యూసెక్కులు


ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో తాగునీటి ఎద్దడి తీరనున్నది. నాగార్జున సాగర్ జలశయం నుంచి నీటి విడుదలకు కేఆర్ఎంబీ అనుమతి ఇచ్చింది. ఈ నెల 8న డ్యాం నుంచి కేవలం తాగునీటి అవసరాలకు నీటిని విడుదల చేయనున్నారు. నిండుకున్న చెరువులు.. తాగునీటి ప్రజల ఇక్కట్లు అనే శీర్షికతో ఆంధ్రజ్యోతితో శనివారం కథనం వెలువడిని విషయం తెలిసిందే. ఈ క్రమంలో 5 టీఎంసీల నీటిని కేఆర్ఎంబీ కేటాయించింది. రోజుకు 5 వేల క్యూసెక్కుల చొప్పున కుడి కాల్వకు 11 రోజుల పాటు నీటి సరఫరా చేయనున్నారు. సాగర్ నుంచి నీటిని విడుదల చేయనుండటంతో మున్సిపాల్టీలతో పాటు పల్లెల్లోనూ తాగునీటి ఇక్కట్లు తీరనున్నాయి.

అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలి

తాగునీటి అవసరాలకు మాత్రమే కుడి కాల్వకు నీటి సరఫరా జరగనున్నది. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు అప్రమత్తంగా వ్యహరించాల్సి ఉంది. 11 రోజుల మాత్రమే నీటి సరఫరా చేయనుండటంతో చెరువులను నింపేందుకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసుకోవాలి. చిలకలూరిపేట, సత్తెనపల్లి, వినుకొండ, నరసరావుపేట మున్సిపల్ అధికారులు చెరువులు నింపేందుకు ఇంజన్లు ఏర్పాటు చేసుకోవాలని జలవనరుల శాఖ సూచించింది. ఏ మాత్రం అశ్రద్ధ వహించినా చెరువులు నిండే పరిస్థితి ఉండదు. మళ్లీ నీటి కోసం ఏప్రిల్ మొదటి వారం వరకు ఆగాల్సి ఉంటుంది. ఈ క్ర మంలో అధికారులు చెరువులను నింపే విషయంలో జాగ్రత్త వహించాల్సి ఉంది. కాగా చెరువులను నింపేందుకుఅన్ని ఏర్పాట్లు చేశామని పబ్లిక్ హెల్త్ ఈఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. కుడి కా ల్వకు విడుదలయ్యే నీటిని పం టలకు వినియోగించవద్దని రైతులకు అధికారులు సూచిస్తున్నారు.



సాగర్ కుడి కాలువ

వైసీపీకి లావు గుడ్‌బై?



రత్తయ్యతో టచ్‌లోకి టీడీపీ నేతలు?

ఎంపీ తండ్రి రత్తయ్యతో ఉ మ్మడి జిల్లాకు చెందిన టీడీపీ ముఖ్య నేతలు టచ్‌లోకి వచ్చినట్లు తెలిసింది. వివాదర హితుడిగా వ్యవహరిస్తున్న శ్రీకృష్ణదేవరా యులను తమ పార్టీలోకి స్వాగతిస్తామని చెప్పినట్లు తెలిసింది. శ్రీకృష్ణదేవరాయులు కోరుకున్నట్లు నరసరావుపేట నుంచి తమ పార్టీ తరఫున పోటీ చేసే అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు కూడా సమాచారం. గత ఎన్నికల్లో అక్కడ నుంచి పోటీ చేసి ఓటమి చెం దిన రాయపాటి వయసు రీత్యా పెద్దవా రు కావడంతో, ఆ సీటుకు ఎవరినీ ఇ ప్పటి వరకు టీడీపీ ఎంపిక చేయలేదు. అయితే తన కుమారుడితోనూ, తమ శ్రే యోభిలాషులతోను చర్చించి ఒక నిర్ణయానికి రావాలనే ఉద్దేశంలో రత్తయ్య ఉన్నారని సమాచారం.

- ఎంపీకి పొమ్మనకుండా పొగబెట్టిన జగన్
- ఏం తప్పు చేశానని సీటు మారమన్నారని శ్రీకృష్ణదేవరాయులు ఆగ్రహం
- నాడు గుంటూరంటే నరసరావుపేట.. నేడు నరసరావుపేటే అంటే గుంటూరనడం తగునా
- రాజధాని రైతుల వద్దకు ఏ ముఖం పెట్టుకొని వెళ్లి ఓట్లు అడగ్గలం...
- కింకర్తవ్యం ఏమిటంటూ ఆంతరంగికులతో భేటీ....
- టీడీపీలోకి రావాలంటూ లావుకు జిల్లా ముఖ్య నేతల ఆహ్వానం...

గుంటూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు వైసీపీని వీడే అవకాశం కనిపిస్తున్నది. 2019 ఎన్నికల సమయంలో విజ్ఞాన్ విద్యా సంస్థల అధినేత లావు రత్తయ్య నరసరావుపేట ఎంపీ స్థానం నుంచి టీడీపీ తరఫున పోటీ చేసేందుకు ఆసక్తి చూపారు. అయితే అప్పటికే రాయపాటి సాంబశివరావుకు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇవ్వడంతో అవకాశం చేజారింది. దీంతో అప్పటికప్పుడు ఆయన తన కుమారుడు శ్రీకృష్ణదేవరాయులకు వైసీపీ టిక్కెట్ ఇప్పించుకుని ఎన్నికల బరిలోకి దింపారు. ఆ ఎన్నికల్లో రాయపాటిపై లక్షన్నర మెజార్టీతో శ్రీకృష్ణదేవరాయులు గెలుపొందారు. రాజకీయాలు కొత్త అయినప్పటికీ గెలిచిన నాటి నుంచి నిత్యం జనం మధ్యే ఉంటూ నరసరావుపేట పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధికి ఆయన శ్రమించారు. సీఎం జగన్‌తో మొదటి నుంచి శ్రీకృష్ణదేవరాయులకు సన్నిహిత సంబంధాలు ఉండేవి. తొలినాళ్లలో లావు మాటకు జగన్ ఎంతో విలువిచ్చేవారు. అయితే నరసరావుపేట లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని చిలకలూరిపేట ఎమ్మెల్యే విడదల రజిని మూలంగా చిన్నచిన్నగా లావు జగన్‌కు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆ పార్టీ వర్గాల విశ్లేషణ. అంతేకాకుండా రాజధాని విషయంలో మూడు ముక్కలాట ఆడిన జగన్‌పై ద్వేషంతో భూములిచ్చిన రైతులు చేస్తున్న ఉద్యమం తీవ్ర స్థాయికి చేరుకున్న సమయంలో వారి వద్దకు వెళ్లి ధైర్యం చెప్పే సాహసం వైసీపీ నేతలెవరూ చేయలేక పోయారు. ఆ సమయంలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు చొరవ చేసుకుని వైసీపీ ప్రతినిధిగా రైతుల శిబిరం వద్దకు వెళ్లి వారిని ఓదార్చే ప్రయత్నం చేశారు. తమ వద్దకు వచ్చి తమ వాదన విన్నందుకు లావును రైతులు ప్రశంసించారు. అయితే ఇది నచ్చని సీఎం జగన్ అప్పటి నుంచి లావుపై మరింత అక్కసు పెంచుకున్నారు. అంతే కాకుండా టీడీపీపైన, ఆ పార్టీ అధినేత చంద్రబాబుపైనా లావు తిట్లదాడి చేయకపోవటం కూడా జగన్‌కు నచ్చలేదు. దీంతో అప్పటి వరకు గుర్తుకు రాని లావు సామాజిక వర్గం హఠాత్తుగా జగన్‌కు గుర్తుకొచ్చి కొద్ది రోజులుగా ఆయనపై సవతి తల్లి ధోరణితో వ్యవహరిస్తూ వస్తున్నారు. ఆయనతో తగాదా పెట్టుకున్న రజినికి ఏకంగా మంత్రి పదవి కట్టబెట్టటం.. చిలకలూరిపేటలో ఓడిపోయే దశలో ఉన్న రజినిని గుంటూరు పశ్చిమకు రప్పించటం శ్రీకృష్ణదేవరాయులకు పుండు మీద కారం చల్లినట్లైంది.

సీటు లేకుండా చేసేందుకే మార్పిడి వంక..

అరాచకాలే కాకుండా అసభ్యకరమైన పనులు చేస్తున్న వారిని కూడా వెనుకేసుకొస్తూ వారు కోరుకున్న సీట్లు ఇచ్చేందుకు భరోసా ఇస్తున్న జగన్ వ్యూహాత్మకంగానే ఎంపీ లావుకు పొగపెట్టారన్న ఆరోపణలున్నాయి. నిజాయితీగా వ్యవహరిస్తూ.. అభివృద్ధి కోసం తనవంతుగా పరితపిస్తూ తన పనితీరు ద్వారా స్వపక్షంలోనే కాకుండా విపక్షీయుల ప్రశంసలు కూడా అందుకున్న లావును పిలిచి ఉన్న పళంగా నియోజకవర్గం మారాలని కోరటం విచిత్రం. విశేషమేమిటంటే అదే లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో జనం చీదరించుకునే సిట్టింగ్‌లు ఉండగా ఇప్పటి వరకు వారి జోలికే వెళ్లకుండా హడావుడిగా లావును మార్చే ప్రయత్నం చేయడం ఆ పార్టీ వర్గాలనే విస్మయపరిచింది. నియోజకవర్గం మారేందుకు ఇష్టపడని లావు సీఎం జగన్ ముఖాన్నే ఆ విషయం చెప్పేశారు. అప్పట్లో గుంటూరు అడిగితే నరసరావుపేట వెళ్లమన్నారు.. ఇప్పుడు నరసరావుపేట నుంచి గుంటూరుకు పొమ్మంటున్నారు.. ఏం తప్పు చేశానని సీటు మారాలి అని సీఎంను ప్రశ్నించినట్లు తెలిసింది. పైగా రాజధాని ఇక్కడే ఉంటుందని ఎన్నికల ముందు మనం హామీ ఇచ్చి విస్మరించి వారికి ద్రోహం చేశాం.. గుంటూరు నుంచి పోటీ చేస్తే ఇప్పుడు వారి వద్దకు వెళ్లి ఏం ముఖం పెట్టుకుని వెళతామంటూ కోపంగా సీఎంవో నుంచి బయటకు వచ్చేశారని సమాచారం. అదే చివరి సారి ఆ గడప తొక్కటం అనే భావనకు కూడా ఆయన వచ్చినట్లు సన్నిహితులు చెబుతున్నారు.

చేరికలపై సంకేతం

- ముగ్గురు నేతలతో చంద్రబాబు ఏకాంత భేటీ
- తొలుత దామచర్ల, గొట్టిపాటి, సత్యలతోనూ విడివిడిగా మాట్లాడిన అధినేత
- భుజం తట్టి ఉగ్రకు అభినందనలు
- మార్చిలోనే సాధారణ ఎన్నికలు
- సిద్ధంకావాలని నేతలకు ఆదేశం

టీడీపీలోకి జిల్లాలోని కొందరు నాయకులు వలస వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు కొందరు ముఖ్య నేతలతో విడివిడిగా భేటీ అయి చర్చలు జరిపారు. ప్రత్యేకించి ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తో ఎక్కువసేపు ఏకాంతంగా మాట్లాడటం ఆపార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశమైంది. ఆ తర్వాత అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవి, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్యతో కూడా విడివిడిగా చర్చించారు. శనివారం ఉదయం కనిగిరి అమరావతి గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన బస వద్ద ఈ భేటీలు జరిగాయి. ఈ సందర్భంగా చంద్రబాబు నేతలకు పలు సూచనలివ్వడంతోపాటు అందరినీ కలుపుకుపోవాలని వ్యాఖ్యానించినట్లు సమాచారం.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

కనిగిరిలో శుక్రవారం జరిగిన బహిరంగసభలో పాల్గొన్న టీడీపీ అధినేత చంద్రబాబు రాత్రికి అక్కడి టీడీపీ కార్యాలయంలో బస చేశారు. రాత్రే పార్టీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలందరితో సంయుక్తంగా మాట్లాడిన ఆయన శనివారం ఉదయం ఇద్దరు, ముగ్గురు నాయకులతో ఏకాంతంగా చర్చించారు. శనివారం ఉదయం ఆయన తిరుగు ప్రయాణానికి సిద్ధమైన వెంటనే తన వాహనంలో ఒంగోలు మాజీ ఎమ్మెల్యే జనార్దన్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. రమారమి 15 నిమిషాలపాటు ఆయనతో మాట్లాడారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. కొత్తగా పార్టీలో చేరే వారి విషయాన్నే చంద్రబాబునాయుడు పరోక్షంగా ప్రస్తావించినట్లు తెలుస్తోంది. అంతకుముందు శుక్రవారం రాత్రి అందరితో మాట్లాడేటప్పుడు కూడా 'ఎలాంటి చిన్న అవకాశాన్ని కూడా విస్మరించకూడదు.. అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకుని రాష్ట్ర భవిష్యత్ కోసం ఈ ప్రభుత్వాన్ని గద్దెదించాలి. అందుకు ఉపయోగపడేవారు ఉంటే పార్టీలోకి తీసుకోవడంలో తప్పులేదు. ఒకరిద్దరు మన నుంచి కూడా వెళ్లిపోవచ్చని అంటూ అందరినీ కలుపుకుపోవాలి' అని చెప్పారు. అదేవిషయాన్ని శనివారం జనార్దన్‌తో కూడా అన్నట్లు తెలిసింది. ఒంగోలు ఎంపీ మాగుంట టీడీపీలోకి రావడం ఖాయమన్న ప్రచారం జరుగుతోంది. ఆయనతోపాటు బాలినేని, ప్రకాశం నెల్లూరు జిల్లాల్లో మరో ఒకరిద్దరు నాయకులు కూడా టీడీపీలో చేరే అవకాశం లేకపోలేదు. ఆ రూపంలోనే చర్చ జరుగుతున్నట్లు తెలిసింది.

గొట్టిపాటితో భేటీ

జనార్దన్‌తో భేటీ అనంతరం అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ చంద్రబాబుతో ఏకాంతంగా మాట్లాడారు. ఇటీవల ఉమ్మడి జిల్లాలో పార్టీ అంశాలకు సంబంధించి గొట్టిపాటి రవికి ప్రాధాన్యతనిచ్చి చంద్రబాబు మాట్లాడుతున్న విషయం విదితమే. శనివారం కూడా ఎక్కువసేపు ఆయనతో ఏకాంతంగా మాట్లాడటంతో జిల్లాలో కొత్తగా పార్టీలో చేరే అవకాశాలున్న వారి విషయంపైనే అయి ఉండవచ్చని భావిస్తున్నారు. ఆతర్వాత సత్యతో కూడా చంద్రబాబు ప్రత్యేకంగా మాట్లాడారు. ఇటీవల కొండపి నియోజకవర్గానికి మంత్రి సురేష్‌ను అభ్యర్థిగా వైసీపీ ప్రకటించిన నేపథ్యంలో సత్యతో ఆయన మాట్లాడటం, పలు సూచనలు చేయటం విశేషం. ఆ తర్వాత కనిగిరి ఇన్‌చార్జి ఉగ్రను పిలిపించుకుని బస్సులో మాట్లాడారు. కార్యక్రమం బాగా చేశారంటూ భుజం తట్టి అభినందించినట్లు తెలిసింది. శుక్రవారం సభాప్రాంగణం ఏర్పాటు చేసిన స్థలానికి సంబంధించి యజమానులను ఆయన చంద్రబాబుకు పరిచయం చేశారు.

మార్చిలో ఎన్నికలు... రెడీగా ఉండండి

కనిగిరిలో శుక్రవారం రాత్రి బహిరంగసభ అనంతరం అక్కడి టీడీపీ కార్యాలయంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు, ముఖ్యనాయకులతో చంద్రబాబు సమావేశం నిర్వహించారు. ఆ సందర్భంగా 'మార్చి ఒకటి రెండు వారాలలో, కాకుంటే చివరి వారంలో అయినా సార్వత్రిక ఎన్నికలు జరగవచ్చు. మీరు అన్నివిధాలా సిద్ధంగా ఉండాలి. ఏ విషయంలో నిర్లక్ష్యంగా ఉన్నా క్షమించేది లేదు' అని తేల్చిచెప్పారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఎవరెవరు ముందున్నారు ఎవరెవరు ఇంకా వెనుకబడి ఉన్నారన్న విషయాన్ని చెప్పి పలు సూచనలు, హెచ్చరికలు చేశారు. ఒంగోలు లోక్‌సభ పరిధిలో మొదటిస్థానంలో కనిగిరి, రెండో స్థానంలో వైపాలెం ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికీ అన్నిరోజులు నియోజకవర్గంలో ఉండకుండా హైదరాబాదో, బెంగళూరుకో వెళ్లి వస్తున్న కొందరు నాయకులను ఇక టూర్లు తగ్గించండి.. ఇక్కడే అందుబాటులో ఉండండని సూచించినట్లు తెలిసింది.



తిరుగు ప్రయాణంలో అభివాదం చేస్తూ వెళ్తున్న చంద్రబాబు



ఉగ్రను అభినందిస్తున్న బాబు

29న చీరాలలో..

బాపట్ల లోక్‌సభ ఎన్నికల సమర శంఖారావం సభ ఈనెల 29న చీరాలలో నిర్వహించాలని నిర్ణయించారు. ఆమేరకు చీరాల ఇన్‌చార్జి కొండయ్యకు, బాపట్ల లోక్‌సభ పరిధిలోని మిగిలిన నాయకులకు సమాచారం ఇచ్చి ఏర్పాట్లపై దృష్టిసారించాలని చంద్రబాబు సూచించారు.

ఏలూరికి వెంకటగిరి సభ పర్యవేక్షణ బాధ్యత

తిరిగి వెళ్లే సమయంలో హెలిప్యాడ్ వద్ద చంద్రబాబు బాపట్ల లోక్‌సభ అధ్యక్షుడు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో ప్రత్యేకంగా మాట్లాడారు. తిరుపతి జిల్లా వెంకటగిరిలో తిరుపతి లోక్‌సభ నియోజకవర్గ బహిరంగసభ ఏర్పాట్లను పర్యవేక్షించాలని, అక్కడుండి కార్యక్రమ విజయవంతానికి చర్యలు తీసుకోవాలని ఆయనకు సూచించారు. ఆ మేరకు శనివారం చంద్రబాబు కనిగిరి నుంచి వెళ్లగానే ఏలూరి బయలుదేరి వెంకటగిరి వెళ్లారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

పుస్తక పఠనంతో విజ్ఞానం

చీరాలటౌన్, జనవరి 6: వివిధ ఉద్యోగ పరీక్షలలో పాల్గొనే యువత పుస్తక, దినపత్రికల ద్వారా జనరల్ నాలెడ్జి పెంపొందించుకోవచ్చునని శాసనమండలి సభ్యులు కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. శనివారం పట్టణ పరిధిలోని ఎస్‌జే రంగనాయకులు, బాపనమ్మ కల్యాణ మండపంలో ఫిబ్రవరి 25న జరిగే ఏపీ పీఎస్సీ గ్రూప్ 2 అభ్యర్థులకు అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా గ్రూప్ 1 అధికారి రాయుడు రవికుమార్ హాజరవగా, ముఖ్య వక్తగా లక్ష్మణరావు విచ్చేసి మాట్లాడారు. అభ్యర్థులు ప్రతిరోజు కొంత సమయం కేటాయించి విలువైన సమాచారాలను తెలుసుకోవాలన్నారు. పోటీల్లో విజయాలు సాధించాలంటే ప్రణాళికాబద్ధంగా ఉండాలన్నారు. కొన్ని ప్రామాణిక పుస్తకాలలోని సమాచారాన్ని నోట్స్ ద్వారా భద్రపరచుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కుర్రా రామారావు, భిక్షాలు, జానీబాషా, సురేష్, కుర్రా శ్రీనివాసరావు, సీతారామరాజు, వీరాంజనేయులు, జయరాజు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

వేటపాలెం(చీరాల), జనవరి 6: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నట్టు ఎమ్మెల్యే కరణం బలరాం అన్నారు. శనివారం వేటపాలెం తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో జరిగిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని లబ్ధిదారులకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ అన్ని వర్గాలకు లబ్ధి చేకూరేవిధంగా ప్రతి కార్యక్రమాన్ని చేపడుతున్నారన్నారు. ప్రతినెలా అర్హులకు అందించే పెన్షన్‌ను రూ.3వేలకు పెంచటం అందులో ఒక భాగమన్నారు. ఈ నేపథ్యంలో వెంకటేష్ ఆరోగ్య పరిస్థితి గురించి సభికులు అడగటంపై బలరాం మాట్లాడు తూ సర్జరీ తరువాత కొద్దిపాటి ఇన్ఫెక్షన్ రావటంతో మరలా చేశారని తెలిపారు. ప్రస్తుతం మెరుగైన ఫలితం వచ్చిందని చెప్పారు. త్వరలోనే వెంకటేష్ మరలా అందరి మధ్యకు వస్తాడన్నారు. వచ్చే ఎన్నికల్లో చీరాల నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా వెంకటేష్ పోటీ చేస్తారని చెప్పారు. కార్యక్రమం లో ఎంపీడీవో నేతాజీ, ఏపీఎం శ్రీనివాసులు, వెల్ఫేర్ అసిస్టెంట్ నాంచారరెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దివ్యాంగునికి పెన్షన్ అందజేస్తున్న ఎమ్మెల్యే బలరాం

12వ రోజుకు చేరిన కార్మికుల సమ్మె

అద్దంకిటౌన్, జనవరి 6: మున్సిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారానికి 12 వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాలో శిబిరంలో ఆకులు తింటూ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పెనుబాక ఆదాము, దర్శి వీ రయ్య, బీష్మా, బత్తులు కృష్ణ, అంజమ్మ, అవిలేలు, సుబ్బాయ్య, పాల్గొన్నారు.



ఆకులు తింటూ నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

కార్మికుల సమస్యల పరిష్కారంలో చిన్నచూపు

చీరాలటౌన్, జనవరి 6: మునిసిపల్ కార్మికుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి పేర్కొన్నారు. మునిసిపల్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 12వ రోజుకు చేరింది. శిబిరాన్ని ఆమె సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.బాబురావు, వసంతరావు, గంగయ్య, ఎ.బాబురావు, సింగయ్య, రాజు, శంకర్, ఇమ్మానియేల్, మేరమ్మ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్‌పై కృష్ణచైతన్య సమాలోచనలు

మండలాల నేతలతో సమావేశాలు



పంగులూరు మండల నేతలతో మాట్లాడుతున్న బాచిన

అద్దంకి, డిసెంబరు 6: భవిష్యత్ ప్రణాళికపై శాప్‌నెట్ చైర్మన్, వైసీపీ అద్దంకి నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ బాచిన కృష్ణచైతన్య మండలాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే రెండు మండలాల నేతలతో పాటు, అద్దంకి పట్టణంలోని కొంతమంది నేతలతో సమావేశాలు పూర్తికాగా, ఆది వారం నుంచి రోజుకొక మండలం చొప్పున మిగిలిన మండలాల నేతలతో సమావేశాలు నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. శు క్రవారం రాత్రి ఒంగోలులో కొరిశపాడు మండల నేతలతో, శనివారం రాత్రి అద్దంకి లోని కార్యా లయంలో పంగులూరు మండల నేతలతో సమావేశాలు నిర్వహించారు. శని వారం రాత్రి అద్దంకి పట్టణంలోని కొంతమంది నేతలు కూడా కృ ష్ణచైతన్యను కలిశారు. ఈసందర్భంగా భవిష్యత్ కార్యాచరణపై ఆయా మం డలాల నే తలతో చర్చించారు. కృష్ణచైతన్య తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉం టామని సమావేశాలకు హాజరైన నేతలు ముక్తకంఠంతో చెప్పినట్లు తె లుస్తోంది. అ ద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమించిన హనిమిరెడ్డి ని యో జకవర్గంలో పర్యటనలు చేస్తుండటం, ఇటు కృష్ణచైతన్య నేతలతో స మా వేశాలు నిర్వహిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. రెండు రోజుల పాటు జరిగిన నేతల సమావేశాలకు కొరిశపాడు, పంగులూరు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో వైసీపీ నేతలు హాజరుకావటంతో పాటు మీ వెంటే మేము న డుస్తామని ముక్తకంఠంతో చెప్పారు. అత్యధిక శాతం మంది వైసీపీ నా యకులు హనిమిరెడ్డి పర్యటనలకు దూరంగా ఉండటం తోపాటు కృష్ణచైతన్య నిర్వహించిన సమావేశాలకు హాజరయ్యారు. అన్ని మండలాల నే తలతో స మావేశాలు నిర్వహించి అందరి అభిప్రాయాలను తెలుసుకొని భ విష్యత్ కా ర్యాచరణపై కృష్ణచైతన్య నిర్ణయం తీసుకుంటారన్న అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. అధిష్ఠానం పునరాలోచనచేసి తిరిగి కృ ష్ణచైతన్యకే ఇ న్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడంతో పాటు, ఎన్నికలలో వైసీపీ అభ్యర్థిగా ప్ర కటిస్తారన్న నమ్మకాన్ని బాచిన వర్గీయులు వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ వైసీపీ తరఫున కృష్ణచైతన్యకు టికెట్ కేటాయించని పక్షంలో బాచిన వ ర్గీయుల అడుగులు ఎటువైపు పడతాయన్న విషయం చర్చనీయాంశంగా మారింది. కృష్ణచైతన్య సూచనలకు అనుగుణంగా ఎక్కువ మంది అడుగులు వేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కొరిశపాడు, పంగులూరు, బల్లికురవ మండలాల పార్టీల అధ్యక్షులు శ్రీధర్, యర్రం శ్రీనివాసరెడ్డిలతో పాటు నేతలు చింతల పేరయ్య, చింతల శ్రీనివాసరావు, రాయిని సుబ్బారావు, సందిరెడ్డి రమేష్ పాల్గొన్నారు.

ఒంగోలు అభ్యర్థి కోసం వైసీపీ మల్లగుల్లాలు

- తాము పోటీ చేయలేమని విజయసాయికి శిద్దా సమాచారం
- అభ్యర్థుల బదిలీల్లో భాగంగా గిద్దలూరుకు బాలినేని
- తాజాగా ఆయన పార్టీలో ఉంటారా? లేదా? అనే అనుమానం

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

జిల్లా కేంద్రమైన ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీచేసే అభ్యర్థి ఎంపికపై వైసీపీ అధిష్ఠానం మల్లగుల్లాలు పడుతోంది. బాలినేనిని కాదని కొత్తవారికి అవకాశం ఇవ్వాలనుకున్న సీఎం జగన్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఒంగోలు నుంచి తాము పోటీ చేయలేమని దర్శి టికెట్ ఇస్తే రంగంలోకి వస్తామని విజయసాయిరెడ్డికి మాజీ మంత్రి శిద్దా రాఘవరావు సమాచారం పంపారు. ప్రస్తుతం ఒంగోలు ఎమ్మెల్యేగా ఉన్న సీనియర్ నాయకుడు బాలినేని శ్రీనివాసరెడ్డికి ఏడాదిన్నర నుంచి ముఖ్యమంత్రి జగన్ పార్టీలో ప్రాధాన్యత తగ్గిస్తూ వస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆ పార్టీ అభ్యర్థుల బదిలీల ప్రక్రియకు ఆయన శ్రీకారం పలికారు. అందులో భాగంగా బాలినేనిని గిద్దలూరు పంపి ఒంగోలుకు శిద్దా కుటుంబం నుంచి అభ్యర్థిని బరిలోకి దింపాలని భావించారు. రాఘవరావు కుమారుడు సుధీర్‌ను రంగంలోకి రావాలని సూచించారు. అయితే మూడు, నాలుగు రోజుల తర్జనభర్జనల అనంతరం శిద్దా రాఘవరావు ఒంగోలు నుంచి తనకు కానీ, తన కుమారుడుకు కానీ పోటీచేసే ఉద్దేశం లేదని ఓ ముఖ్య నాయకుడు ద్వారా విజయసాయిరెడ్డికి సమాచారం పంపినట్లు తెలిసింది.



ప్రత్యామ్నాయంపై దృష్టి

ఒంగోలు టికెట్ విషయానికి వస్తే అసలు బాలినేని పార్టీలో ఉంటారా... బయటకుపోతారా? అన్న అనుమానాలు లేకపోలేదు. దీనికి తోడు తనను మర్యాదపూర్వకంగా కూడా పిలవకుండా అభ్యర్థుల ఎంపికపై నిర్ణయాలు తీసుకోవడం పట్ల ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇంకోవైపు జగన్ తాను తీసుకున్న నిర్ణయాలను మార్చుకోవడం అంత సులువైన విషయం కాదనేది జగమెరిగిన సత్యం. దీంతో బాలినేని పార్టీలో ఉంటే ముందుగానే చెప్పినట్లు ఆయన్ను గిద్దలూరు పంపి ఒంగోలుకు కొత్తవారినే తీసుకురావాలన్న ఆలోచనలో జగన్ ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం శిద్దా పోటీకి ససేమిరా అనడంతో ఇతరత్రా ఆలోచనలు కూడా చేస్తున్నట్లు తెలిసింది. దర్శి నుంచి పోటీకి అవకాశం లేదని అక్కడి సిటింగ్ ఎమ్మెల్యే మద్దిశెట్టికి ఇప్పటికే తేల్చి చెప్పడంతో తనకు ఒంగోలు లోక్‌సభ టికెట్ ఇవ్వాలని ఆయన జగన్‌ను కోరారు. అయితే ఒంగోలు లోక్‌సభ స్థానం నుంచి వైవీ సుబ్బారెడ్డి కుంటుంబాన్ని రంగంలోకి తేవాలన్న ఆలోచనలో ఉన్న జగన్.. ఆ విషయంలో మద్దిశెట్టికి ఎలాంటి హామీ ఇవ్వలేదని తెలిసింది. ప్రస్తుతం బాలినేనిని నమ్మలేని స్థితిలో ఉన్న జగన్.. శిద్దా కూడా పోటీకి ససేమిరా అనడంతో ఒంగోలు అసెంబ్లీ టికెట్ విషయంలో మద్దిశెట్టి వేణుగోపాల్, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు పేర్లు కూడా పరిశీలించే అవకాశం లేకపోలేదని తెలిసింది. అయితే ఒంగోలు నుంచి వైసీపీ పక్షాన పోటీచేసేందుకు అటు మాగుంట, ఇటు బాలినేని సహకారం లేకుండా ఎవరూ ముందుకు వచ్చే పరిస్థితి కనిపించటం లేదు. దీంతో మున్ముందు ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థి ఎంపిక విషయంలో జగన్ ఎలా ముందుకుపోతారన్నది చూడాల్సి ఉంది.



ఆర్టీసీ బస్సు ఢీకొని వెల్ఫేర్ అసిస్టెంట్ మృతి

సంతమాగులూరు(అద్దంకి), జనవరి 6: ఆర్టీసీ బస్సు ఢీకొనటంతో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ షేక్ మస్తాన్‌వలి(38) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. మార్టూరు మండలం వలపర్లకు చెందిన మస్తాన్‌వలి సంతమాగులూరు మండలలం ఏల్చూరు 2 సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఏల్చూరుకు చెందిన పెన్షన్‌దారుడు వినుకొండలో ఉండటంతో పింఛన్ డబ్బులు ఇచ్చేందుకు వినుకొండ వెళ్లి శనివారం సాయంత్రం మోటార్ సైకిల్‌పై తిరిగి వస్తున్నాడు. ఈక్రమంలో సంతమాగులూరు మండలం కామేపల్లి వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. తీవ్రగాయాలైన మస్తాన్‌వలి అక్కడికక్కడే మృతి చెందాడు. మస్తాన్‌వలికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్సై శివకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

అద్దంకి, జనవరి 6: మొదటి భార్యతో విడాకులు తీసుకొన్న యువకుడు రెండవ వివాహం కావటం లేదని మనస్తాపంతో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. రాళ్లపల్లికి చెందిన స్వర్ణ కిషోర్‌బాబు(31)సమీపంలోని కల్లం స్పిన్నింగ్ మిల్‌లో బార్బర్‌గా పనిచేస్తున్నాడు. గతనెల 18 పురుగుమందు తాగి రిమ్స్‌లో వైద్యం పొందుతూ మృతిచెందాడు. సోదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అర్హులందరికీ పింఛన్లు

మేదరమెట్ల, జనవరి 6: అద్దంకి నియోజకవర్గంలో అర్హులైన వారందరికీ, పింఛన్లు తప్పకుండా ఇస్తామని, అద్దంకి వైసీపీ ఇన్‌చార్జ్ పాణ్యం హనిమిరెడ్డి తెలిపారు. శనివారం కొరిశపాడులోని దండు రామకృష్ణారెడ్డి జడ్పీ హైస్కూల్‌లో పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాదకబాదకాలన్ని తెలిసిన సామాన్య స్థితి నుంచి తాను వచ్చానన్నారు. ప్రజల కష్టాల్లో అండగా ఉంటానన్నారు. అర్హులై ఉండి ప్రభుత్వ పథకాలు రాని వారు ఏదైనా సమస్యలున్నవారు తనకు ఫోన్ చేయవచ్చని, నియోజకవర్గ అభివృద్ధి కోసం తాను పాటుపడతానన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుశీల, ఎంపీడీవో సురేష్‌బాబు, కొరిశపాడు జడ్పీటీసీ సభ్యుడు తుల్లూరి వెంకటరమణ, మంగళపూడి కోటిరెడ్డి, మేదరమెట్ల, రావినూతల సర్పంచులు ఎలిశమ్మ, విజయవీణ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ముత్తవరపు రమణయ్య, రావినూతల వెంకటసుబ్బారావు హాజరయ్యారు.



పింఛన్లు పంపిణీ చేస్తున్న హనిమిరెడ్డి

సభతో పాఠశాలకు అంతరాయం

పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని దండు రామకృష్ణారెడ్డి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేయడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తరగతి గదులు వదిలిపెట్టారు. వైసీపీ ఇన్‌చార్జ్‌కి విద్యార్థులతోనే పూలుజల్లడం గమనార్హం. అక్కడే బాణసంచా పెద్ద ఎత్తున కాల్చారు. ఆ మోతకు అక్కడకు హా జరైన పలువురు వృద్ధులు భయభ్రాంతులకు గురై చెవులు మూసుకున్నారు. పాఠశాల పనిచేసే రోజున కార్యక్రమాన్ని పాఠశాలలో ఏర్పాటు చేయడమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అంత ఖాళీ ఉండగా, పాఠశాలలో ఏర్పాటు చేయడం ఏమిటని విద్యార్థుల తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

అద్దంకి, జనవరి 6: పట్టణంలోని అభ్యుదయనగర్‌లో శనివారం మద్యం బాటిళ్ళ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అభ్యు దయనగర్‌కు చెందిన ఈదర బ్రహ్మేశ్వరరావు వద్ద 12 మద్యం బాటిళ్ళు ఉండగా ఎస్సై వెంకటేశ్వర్లు స్వాధీనం చేసుకున్నారు.



ఎడ్ల బలప్రదర్శన పోటీలను ప్రారంభిస్తున్న వెంకట్

అట్టహాసంగా ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు

ప్రారంభించిన జనసేన పార్టీ నేత వెంకట్

దర్శి, జనవరి 6 : జనసేన పార్టీ నియోజకవర్గ నాయకుడు గరికపాటి వెంకట్ ఆధ్వర్యంలో దర్శిలో శనివారం జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు అట్టహాసంగా మొదలయ్యాయి. వెంకట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్శిలో పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. దర్శి - అద్దంకి రోడ్డులో విశాలమైన ప్రదేశంలో నాలుగు రోజులపాటు జరిగే ఈ పోటీలకు విస్తృత ఏర్పాట్లు చేశారు. సుమారు 200 మంది అతిథులు కూర్చుని తిలకించేలా వేదికను తయారు చేశారు. ప్రజల కోసం గ్యాలరీని ఏర్పాటు చేశారు. తొలిరోజు నాలుగు పళ్ల ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహించగా 38 జతలు పాల్గొన్నాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చిన ఎడ్లు పోటాపోటీగా బండను లాగాయి. పోటీలను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి అధికసంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. వారిలో మహిళలు కూడా ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. వచ్చిన ప్రజలకు గరికపాటి ట్రస్ట్ ఆధ్వర్యంలో భోజనాలు సమకూర్చారు. గరికపాటి వెంకట్ తండ్రి గరికపాటి లక్ష్మయ్య ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ, నియోజకవర్గ ఇన్‌చార్జి బొటుకు రమేష్‌బాబు, జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, సొసైటీ మాజీ చైర్మన్ కే చంద్రశేఖర్, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు దారం సుబ్బారావు పోటీలను తిలకించారు.

ట్రాక్టర్ టైర్ పేలి వ్యక్తికి గాయాలు

అద్దంకి, జనవరి 6: పంక్చర్ అయిన ట్రాక్టర్ టైర్ విప్పే ప్రయత్నంలో అది పేలటంతో వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. అద్దంకి పట్టణంలోని ద్వారకానగర్ వద్ద ట్రాక్టర్ టైర్‌కు పంచర్ కావటంతో విప్పే ప్రయత్నంలో పేలింది. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ యలమందకు తీవ్రగాయాలయ్యాయి. 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు తరలించారు.

దళితుల భూమిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి

అద్దంకి, డిసెంబరు 6: పూర్వికుల నుంచి సంక్రమించిన పొలం, స్థలాలను ఆక్రమించిన అగ్రకులాలకు చెందిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సుజన్‌మాదిగ అన్నారు. అద్దంకి మండలంలోని కలవకూరులో యరజాని సాగర్ కుటుంబ సభ్యులకు పూర్వికుల నుంచి వచ్చిన పొలం, స్థలాలను అగ్రకులాలకు చెందిన ప్రశాంత్‌రెడ్డి, ఆదిరెడ్డి, నాగేశ్వరరెడ్డి ఆక్రమించి రానీయకుండా అడ్డుకుంటున్నారని తహసీల్దార్ సుబ్బారెడ్డికి వినతిపత్రం అందజేశారు. పొలంలోకి రానీయకుండా అడ్డుకుంటున్నారని, కులం పేరుతో దూషిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని కూడా బినామీ పేరుతో కబ్జా చేశారని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు వెంగళరావు, దుడ్డు వినోద్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రెండు గ్రామాల నేతలతో ఎమ్మెల్యే రవికుమార్ సమీక్ష

బల్లికురవ, జనవరి 6: మండలంలోని కూకట్లపల్లి, వైదన గ్రామాలకు చెందిన టీడీపీ నేతలతో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఆదివారం ఉదయం 11 గంటలకు సంతమాగులూరు అడ్డరోడ్డు వద్ద గల క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. సమావేశానికి రెండు గ్రామాలకు చెందిన నేతలు, బూత్ కమిటీ సభ్యులు, పార్టీ అనుబంధ కమిటీ సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం కోరింది.

పంగులూరు: పంగులూరు మండలం అలవలపాడు గ్రామ టీడీపీ నేతలతో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సమీక్ష నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 9 గంటలకు జొన్నతాళిలోని క్యాంప్ కార్యాలయంలో ఈ సమీక్ష నిర్వహిస్తారని కార్యాలయ ప్రతినిధి తెలిపారు. సమావేశానికి నాయకులు, కార్యకర్తలు, బూత్ ఇన్‌చార్జ్‌లు, బూత్ ఏజంట్లు, పేజీ నేస్తం సభ్యులు హాజరుకావాలని కోరారు.

నేడు సినీ నటుడు తనికెళ్లకు జీవిత సాఫల్య పురస్కారం

అద్దంకిటౌన్, జనవరి 6: పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు నాగులపాడు రోడ్డులోని కామేపల్లి కల్యాణ మండపంలో సినీనటుడు తనికెళ్ల భరణికి పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ జీవిత సాఫల్య పురస్కారం అందజేయనున్నట్లు నిర్వాహకులు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. శనివారం రోటరీ కార్యాలయంలో పురస్కారానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వారణాసి రఘురామశర్మ, డాక్టర్ యు.దేవపాలన, డీవీఎం సత్యనారాయణ, మలాది శ్రీనివాసరావు, చప్పిడి వీ రయ్య, తదితరులు పాల్గొన్నారు.

'బత్తుల' ఆశయ సాధనకు కృషిచేయాలి

పంగులూరు, జనవరి 6: సమసమాజం కోరుతూ దశాబ్దాలపాటు ఉద్యమించిన పీడీఎం నేత బత్తుల మోహనరావు ఆశయసాధన కోసం పోరాటం కొనసాగించాలని విరసం నేత కల్యాణరావు అన్నారు. శనివారం మండలంలోని బైటమంజులూరు గ్రామంలో పీడీఎం ఉమ్మడి ప్రకాశం జిల్లా గౌరవాధ్యక్షుడు బత్తుల మోహనరావు సంస్మరణ సభకు రాష్ట్ర కార్యదర్శి కె.వెంకటేష్ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ అనేక కుట్ర కేసులు ఎదుర్కొని జీవితాంతం ప్రజా ఉద్యమాలతో ప్రయాణం సాగించిన మోహనరావు స్ఫూర్తిని కొనసాగిద్దామన్నారు. కార్యక్రమంలో జె.కోటి, మాచర్ల మోహనరావు, సుధాకర్, బొప్పూడి అంజమ్మ, బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

'కొమ్మమూరు'కు సాగునీరు విడుదల

» బెట్టకొచ్చిన వరి
» తడులకు అవకాశం
» ఊపిరి పీల్చుకుంటున్న రైతులు


కొమ్మమూరు కాలువలో నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న రైతులు

చీరాల, జనవరి 6: కొమ్మమూరు కాలువకు సాగునీరు విడుదల చేశారు. ఆయకట్టు పరిధిలో ఈఏడాది ఖరీఫ్‌లో మాగాణి భూముల్లో నాట్లు వేశారు. ఆతరువాత నెలకొన్న వర్షాభావ పరిస్థితులతో ఆయకట్టు పరిధిలో మాగాణి సాగుచేయవద్దని అధికారులు చెప్పారు. కొద్ది రోజులు వారబందీ ప్రకారం సాగునీరు అందిస్తామని, ఆతరువాత సాగునీరు ఏమాత్రం ఇవ్వలేమని తెలిపారు. మాగాణికి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. అయితే, అప్పటికే కారంచేడు, చీరాల, వేటపాలెం, నాగులుప్పలపాడు మండలాల్లో ఖరీఫ్ చివర, రబీ తొలినాళ్లలో నాట్లు వేశారు. చీరాల, వేటపాలెం మండలాల పరిధిలో ఎత్తిపోతల పథకాల కింద మాగాణి చేశారు. ఆ తరువాత వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి.

ఇటీవల తుఫాన్ నేపథ్యంలో కురిసిన వర్షాలు తప్ప మాగాణి పైరుకు తడి అనేది లేకుండా పోయింది. ప్రస్తుతం సాగులో ఉన్న వరి చేలు పొట్ట దశలో ఉన్నాయి. కొన్నిచోట్ల కంకులు ఈనుతున్నాయి. ఈదశలో పైరుకు సాగునీరు అత్యంత అవసరం. కొమ్మమూరు కాలువలో సాగునీరు సక్రమంగా లేకపోవటంతో తడి ఇవ్వలేకపోయారు. దీంతో మాగాణి చేలు బీటలు వారాయి. ఈక్రమంలో పలు గ్రామాల రైతులు మాగాణికి ప్రస్తుతం తడి ఇచ్చేందుకు అవసరమైన సాగునీరు విడుదలచేయించి తమను ఆదుకోవాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తికి విజ్ఞప్తి చేశారు.

ఈనేపథ్యంలో ఎమ్మెల్యే బలరాం సాగునీటి పారుదలశాఖ ఈఎన్‌సీ నారాయణరెడ్డితో నాలుగు రోజుల క్రితం ఫోన్‌లో మాట్లాడారు. ప్రస్తుతం పైరు పొట్ట దశలో ఉండటంతో, నీటి తడి ఆవశ్యకతను ఈఎన్‌సీకి వివరించారు. సాగునీరు అందించలేమని చెప్పినప్పటికీ ప్రస్తుత పరిస్థితుల్లో సాగులో ఉన్న మాగాణి పైరును కాపాడుకునేందుకు తడి ఇవ్వకుంటే జరిగే భారీ నష్టాన్ని, తద్వారా రైతులకు ఎదురయ్యే ప్రతికూల పరిస్థితులను చెప్పటంతో ఈ ఎన్‌సీ సానుకూలంగా స్పందించారు. బలరాం సూచనమేరకు తిమ్మసముద్రం సర్పంచ్ కరణం రమేష్‌బాబు, మరికొన్ని గ్రామాల రైతులు ఈఎన్‌సీని కలసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. వినతిపత్రం అందజేశారు. దీంతో అధికారులు కొమ్మమూరు కాలువకు సాగునీటిని విడుదల చేశారు. శనివారం సాయంత్రానికి నర్సాయపాలెం లాకుల ప్రాంతానికి కొమ్మమూరు కాలువలో నీరు చేరింది. అక్కడనుంచి ఆది, సోమవారాల్లో కారంచేడు, చీరాల, వేటపాలెం, నాగులు ప్పలపాడు మండలాల పరిధిలోకి సాగునీరు చేరనుంది. దీంతో తమ పైరును కాపాడుకునేందుకు ఆస్కారం లభించిందని సాగుదారులు పేర్కొంటున్నారు.

వాగులో నీటి ప్రవాహానికి అడ్డుకట్ట

» దిగువ భూములకు నీరందని పరిస్థితి
» పట్టించుకోని డ్రైనేజీ అధికారులు
» రైతుల ఆగ్రహం


పర్చూరు - కారంచేడు మధ్య వాగులో నీరు ముందుకెళ్లకుండా వేసిన అడ్డుకట్ట

పర్చూరు, జనవరి 6: నీటి కష్టాలు రోజురోజుకు రైతులను వెంటాడుతున్నాయి. నిన్నా మొన్నటి వరకు వరదలు, ఎల్లవలతో నీట మునిగిన పంట పొలాలు నేడు నీరులేక బీటలు వాలుతున్నాయి. ఈతరుణంలో సాగునీటి కోసం రైతులు నానా అవస్థలు పడుతున్నారు. అసలే అరకొరగా ప్రవహిస్తున్న పర్చూరు వాగులో కొందరు నీటి ప్రవాహానికి అడ్డుగా కట్టలు వేయటంలో దిగువ రైతులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వరదలు ముంచెత్తటంతో సర్వంకోల్పోయామని, ప్రస్తుతం మొక్కలు నాటుకుందామన్నా నీరు అందుబాటులోలేని దుస్థితిలో ఉన్నామని రైతులు వాపోతున్నారు. పర్చూరు - కారంచేడు మధ్యలో నీరు దిగువకు వెళ్లకుండా అడ్డుకట్ట వేశారు. దీంతో తాము పంటలను ఎలా సాగుచేసుకోవాలంటూ వాపోతున్నారు. వాగులో యథేచ్ఛగా కట్టఏర్పాటు చేసినా సంబంధిత డ్రైనేజీ అధికారులు పట్టించుకోకపోవటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. కారంచేడు - పర్చూరు వాగు సమీప భూముల్లో వేల ఎకరాల్లో నీరులేక భూములు సాగుకు నోచుకోలేదు. ప్రస్తుతం సాగుకోసం భూములను సిద్ధం చేసుకున్న తరుణంలో ఉన్న నీటికి సాగుకోసం వినియోగించుకుందామన్న రైతులకు ఆడిఆశగా మారింది. వాగు మధ్యలో కట్ట ఏర్పాటుతో నీరు ముందుకు కదలని దుస్థితి ఏర్పడింది. దీంతో వేల ఎకరాల్లో సాగు ప్రశ్నార్థకంగా మారింది. వాగులో నీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేస్తే దిగువ రైతుల పరిస్థితి ఏమిటంటూ కారంచేడు వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు ప్రశ్నిస్తున్నారు. ఒకపక్క కొమ్మమూరు కాలవలో నీరులేక వరి పంటలు ఎండిపోతున్నాయి. కనీసం మెట్ట భూముల్లో సాగుచేసుకుందామన్నా ఇలా వాగులో ఉన్న అరకొర నీటిని అందకుండా అడ్డకట్ట వేయటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. వాగులో అడ్డుకట్ట వేసిన అధికారులు కన్నెత్తి కూడా చూడకపోవటం దారుణమన్నారు. ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకుపోతానని వైస్ ఎంపీపీ స్పష్టంచేశారు.

సంక్షేమం, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

» ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్


మహిళకు టీడీపీ మినీ మేనిఫెస్టో పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

అద్దంకి, జనవరి 6: సంక్షేమం, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని చక్రాయపాలెం, శాంతినగర్‌లో శనివారం రాత్రి బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి టీడీపీ మినీమేనిఫెస్టో గురించి వివరించారు. ఈసందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ టీడీపీ మినీ మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాల ద్వారా అన్నివర్గాల ప్రజల భవిష్యత్‌కు గ్యారెంటీ లభిస్తుందన్నారు. సీఎం జగన్‌రెడ్డి పాదయాత్రలో 730 హామీలు ఇచ్చారని ఎమ్మెల్యే రవికుమార్ పేర్కొన్నారు. వీటిల్లో 109 హామీలు మాత్రమే అమలు చేసి 85 శాతం హామీలు ఎగ్గొట్టారన్నారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత రూ.10 లక్షల కోట్లు అప్పు చేశారన్నారు. నాలుగేళ్లలో పేదల రక్తం పీల్చి దాదాపు రూ.2 లక్షల కోట్లు వివిధ రూపాలలో వసూలు చేశారన్నారు. ఒక్క సాగునీటి ప్రాజెక్టు నిర్మించి ఒక్క ఎకరాకు కూడా నీరు ఇవ్వలేదన్నారు. పింఛన్ రూ.3వేలు చేస్తానని చెప్పి, చివరి మూడు నెలల్లో రూ.3 వేలు ఇవ్వటం మోసం చేయటం కాదా అని ఎమ్మెల్యే రవికుమార్ ప్రశ్నించారు. జగన్‌రెడ్డిని నమ్మి నష్టపోయిన పింఛన్‌దారులకు నష్టపోయిన సొమ్ము మొత్తం తిరిగి ఇవ్వాలన్నారు. వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా టీడీపీ, జనసేన కూటమి గెలుపు ఖాయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు నాగినేని రామకృష్ణ, కరి పరమేష్, మానం మురళీమోహన్‌దాస్, పెంట్యాల రామాంజనేయులు, బందారు రాఘవ, పూనాటి విక్రమ్, గాలం వెంకటేశ్వర్లు, రాయుడు నరేంద్ర, గోగులమూడి రాజశేఖర్, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం ఎంతో ప్రాచీన చరిత్ర కలిగిన గ్రామం

అద్దంకిటౌన్, జనవరి 6: ధర్మవరం ఎంతో ప్రాచీన చరిత్ర కలిగిన గ్రామమని రిటైర్డ్ ఆర్‌జేడీ డాక్టర్ యు.దేవపాలన అన్నారు. జైనమత తీర్థంకరులు కూడా ఇక్కడ నుంచే మత ప్రచారం చేశారని చెప్పారు. శనివారం మండలంలోని ధర్మవరం జడ్పీహెచ్‌ఎస్‌లో విద్వాన్ జ్యోతి చంద్రమౌళి రచించిన ధర్మవరం చారిత్రక వైభవం పుస్తక పరిచయ కార్యక్రమానికి హెచ్‌ఎం శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ఆదిమానవుల కాలం నుంచి నేటివరకు జరిగిన ధర్మవరం చరిత్ర, అద్దంకి శాసనం, కందుకూరు శాసనం వేయించిన పాండురంగని గురించి రచయిత జ్యోతి చంద్రమౌళి వివరించారు. విద్యార్థులు నాటి చరిత్రను కచ్చితంగా తెలుసుకోవాలని ఎంఈవో బూదాటి సుధాకరరావు అన్నారు. కార్యక్రమంలో ధర్మవరపు చారిటీస్ అధ్యక్షుడు హరిబాబు, శ్రీనివాసరావు, శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

36 మద్యం బాటిళ్లు స్వాధీనం

బల్లికురవ, జనవరి 6: మండలంలోని వేమవరంలో బెల్టు షాపు నిర్వహిస్తున్న ఓవ్యక్తి ఇంటిలో తనిఖీలు చేయగా 36 మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయని ఎస్‌ఐ వి.వేమన తెలిపారు. గ్రామాలలో బెల్టు దుకాణాలను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న దృష్ట్యా గ్రామాలలో పోలీసు నిఘా ఉందని ఎస్‌ఐ తెలిపారు. మద్యం అమ్ముతూ పట్టుబడిన వ్యక్తిపై కేసు నమోదు చేస్తున్నట్లు చెప్పారు.

వృద్ధులకు వైద్య పరీక్షలు

చినగంజాం, జనవరి 6: చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని వాల్మీకి సేవా సంఘంలోని వృద్ధులకు పెదగంజాం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వారు శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఎదగంజాం ఆయుర్వేద వైద్యశాల డాక్టర్ భవాని వైద్య పరీక్షలు చేసి ఆయుర్వేద మందులు అందజేశారు. కార్యక్రమంలో వాల్మీకి సేవా సంఘం కార్యదర్శి లక్ష్మి, సూపర్‌వైజర్ గాజుల సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి బంగారు అభరణాలు బహూకరణ

చినగంజాం, జనవరి 6: స్థానిక భూ సమేత భావనారాయణస్వామి దేవస్థానంలోని రాజ్యలక్ష్మి అమ్మవారికి బంగారు అభరణాలను శనివారం బహూకరించారు. చినగంజాం గ్రామానికి చెందిన తేలప్రోలు బాలకోటేశ్వర మనోజ్‌కుమార్, సుమతి దంపతులు రూ.1,50,100 విలువచేసే బంగారు మంగళసూత్రం తాడును మనోజ్‌కుమార్ తల్లిదండ్రులు శివరామకృష్ణ, నాగసుధారాణి చేతుల మీదగా ఆలయ పూజారి ఎ.లక్ష్మినరసింహా చార్యులకు అందజేశారు.

ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సమ్మెకు యూటీఎఫ్ సంఘీభావం

పంగులూరు, జనవరి 6: తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు చేపట్టిన సమ్మెకు యూటీఎఫ్ మండల శాఖ ప్రతినిధులు సంఘీభావం తెలిపారు. శనివారం పంగులూరులోని ఎమ్మార్సీ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగ ప్రతినిధులు ప్రసన్న, హరిబాబులకు రూ.ఐదు వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు టీవీ నరసింహారావు, బి.సుబ్బారావు, ఎస్‌వీడీ ప్రసాద్, సాయిసత్యనారాయణ, రవీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), జనవరి 6 : స్టేషన్ పరిధిలో చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఈపూరుపాలెం ఎస్సై జనార్దన్ పేర్కొన్నారు. శనివారం చీరాల మండల పరిధిలోని పిట్టువారిపాలెం పంచాయతి కొత్తపాలెంలో అక్రమంగా నాటుసారా విక్రయిస్తున్న దోనె బాలాజీని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 6 లీటర్లు నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దాతల సహకారం మరువలేనిది

చిరగంజాం, జనవరి 6: కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయానికి దాతలు అందిస్తున్న సహాయ సహకారాలు మరువలేనివని ప్రిన్సిపాల్ ఎం.సుమాంజలి అన్నారు. స్థానిక విద్యాలయానికి తహసీల్దార్ పాలపర్తి పార్వతి సొంత నిధులతో రెండు లైట్లు, ఐదు ఫ్యానులను శనివారం అందజేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ షేక్ కరీమా, భూసర్వే డిప్యూటీ తహసీల్దార్ డి.శ్రీకాంత్, వీఆర్వోలు ఆమంచి సత్యనారాయణ, ఖాదర్ మొహిద్దీన్‌బాషా, వీఆర్‌ఏ వెంకటరావు, విజయ్‌కుయార్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ఉద్యమంపై 'ఎస్మా' పిరికిపంద చర్య

» సీఐటీయూ నేత కొండయ్య ధ్వజం
» కొనసాగుతున్న సమ్మె


బల్లికురవలో వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పర్చూరు, జనవరి 6: అంగన్‌వాడీల ఉద్యమంపై ఎస్మా ప్రయోగిం చటం ప్రభుత్వ పిరికి పంద చర్యని సీఐటీయూ జిల్లా నాయకుడు పి.కొండయ్య ధ్వజమెత్తారు. నిర్బంధం, బెదిరింపు చర్యల ద్వారా చట్ట బద్ధ హక్కులను కాలరాయాలనుకోవటం దుర్మార్గమన్నారు. శనివారం కారంచేడు తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెలో సీఐటీయూ నాయకులు పాల్గొని మద్దతుగా నిలిచారు. అంగన్‌వాడీలు తమ న్యాయపరమైన సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ బాటపడితే కనీసం ప్రభుత్వం స్పందించక పోవటంతో పాటు, వివక్షకు గురిచేయటం ఏమిటని ప్రశ్నించారు. అంగన్‌వాడీ సంఘ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ తమ సమస్యలను పరిష్కరించే వరకు ఉద్యమం ఆగదన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా సమ్మె ఆగదు!

అద్దంకి టౌన్, జనవరి 6: ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకుండా ఎలాంటి కుట్రలు చేసినా, బెదిరించినా సమ్మెను విరమించేది లేదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.తిరుపతిరెడ్డి అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక సమ్మె శనివారానికి 26వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని తెలిపారు. ఈసందర్భంగా మున్సిపల్ కార్మికులు ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని అంగన్ వాడీలు చేస్తున్న సమ్మెకు మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో తంగిరాల వెంకటేశ్వర్లు, మనోలత, పెనుబాక ఆదాము, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల వినూత్న నిరసన

బల్లికురవ, జనవరి 6: ప్రభుత్వం తమను ఎన్ని రకాలుగా బెదిరించినా తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మెను విరమించేది లే దని అంగన్‌వాడీ కార్యకర్తలు స్పష్టం చేశారు. శనివారం బల్లికురవ తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండలంలోని 64 మంది అంగన్ వాడీ కార్యకర్తలు, హెల్పర్లు 26వ రోజు సమ్మెలో పాల్గొన్నారు. వినూత్న రీతిలో 26 సంఖ్య నమూనాతో కుర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయన్నారు. తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని న్యాయబద్ధంగా సమ్మె చేస్తుంటే ఎస్మా ప్రయోగించటం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో సంఘ నేతలు నాగమణి, సునంద, భారతి, శ్రీదేవి, శ్రీ లలిత, సరస్వతి. అనురాధ, వెంకటరమణ, జ్యోతి, సత్యవతి, అను పమ, శివపావని, నిర్మల, రాజకుమారి, తదితరులు పాల్గొన్నారు.

పంగులూరు: వేతనం పెంచాలని కోరుతూ సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించడం దారుణమని సీపీఎం నేత రాయిణి వినోద్‌బాబు అన్నారు. శనివారం పంగులూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలకు ఆయన సంఘీభావం తెలిపారు. ఎస్మా పేరుతో తమను బెదిరించడంపై అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీలు పాల్గొన్నారు.


చీరాల గడియార స్తంభం సెంటర్‌లో అంగన్‌వాడీల మానవహారం

ఇంకొల్లు: తమ న్యాయబద్ధమైన సమస్యల పరిష్కారానికి సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ఎస్మాను ప్రయోగిస్తూ జీవోను విడుదల చేసి భయభ్రాంతులకు గురిచేయడం దారుణమని సీఐటీయూ మండల కార్యదర్శి నాగండ్ల వెంకట్రావు అన్నారు. సమస్య పరిష్కరించే వరకు సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. శనివారం మండలంలోని గంగవరం గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ప్రాజెక్టు లీడర్లు సరళ, శ్రీలత, అనంతలక్ష్మి, లావణ్య, దేవమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మార్టూరు: అంగన్‌వాడీల సమ్మె మొదలై శనివారానికి 26వ రోజు కావడంతో మార్టూరులో 26వ సంఖ్య ఆకారంలో కూర్చుని నిరసన తెలిపారు. మండల కాంప్లెక్స్ వద్ద సీఐటీయూ నాయకుల మద్దతుతో అంగన్‌వాడీలు తమ సమ్మెను కొనసాగించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బత్తుల హనుమంతరావు, యూనియన్ నాయకులు శ్యామల, రాణి, విజయ, అంజలి, రాజేశ్వరి, సుహాసిని, రాజ్యం, లలిత తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా యద్దనపూడి మండలంలో అంగన్‌వాడీలు సమ్మెను కొనసాగించారు.


చీరాలటౌన్: అంగన్‌వాడీలు శనివారం ఉదయం తహసీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. మధ్యాహ్నం తరువాత గడియార స్తంభం వరకు ర్యాలీగా వెళ్లి మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వసంతరావు, ప్రమీల, సుజీవన, శిరీష, బ్యూలా, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా ఇవ్వకుండా మోసగించిన బీజేపీ



మాట్లాడుతున్న ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలచంద్రుడునాయక్

అద్దంకిటౌన్, జనవరి 6: రాష్ట్రానికి సంజీవిని వంటి ప్రత్యేక హోదా ఇస్తానని బీజేపీ మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చి తొమ్మిదిన్నరేళ్లు అవుతున్న హోదా ఇవ్వకుండా 5 కోట్లమంది ప్రజలను మోసం చేసిందని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.బాలచంద్రుడు నాయక్ అన్నారు. శనివారం ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా బాలచంద్రుడు నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పేద విద్యార్థులను చదువులకు దూరం చేసే విధంగా జీవో నెం.77ను తీసుకువచ్చి స్కాలర్‌షిప్‌ను తీసివేశారని అన్నారు. ఆ జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అప్పుడు అధికారంలో ఉన్న టీడీపీ, ఇప్పుడు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన వైసీపీ ఐదు కోట్ల ప్రజల ఆత్మగౌరవాన్ని మోదీ కాళ్ల కింద వదిలేశారన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా రావాలన్నా, అందరికి న్యాయం జరగాలన్న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని, రాహుల్‌గాంధి ప్రధాన మంత్రి కావాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు బాబీ, ఏసుబాబు, యోబు, వినయ్, ప్రవీణ్, రాజా, వంశీ తదితరులు పాల్గొన్నారు.



సోమశిలలో 32.587 టీఎంసీల నిల్వ



అనంతసాగరం : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 25 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలకుగాను 32.587 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 2,650 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 250, దక్షిణ కాలువకు 20 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

ఆ కాంట్రాక్టర్‌పై ఎంత ప్రేమో!


- ఎప్పటి బిల్లులు అప్పుడే చెల్లింపు
- కాంట్రాక్టర్లకే కాకుండా వైసీపీ నేతలకూ చుక్కలు చూపిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

"మంగళగిరి అభివృద్ధికి సీఎం రూ.1,200 కోట్లు కేటాయిస్తామన్నారు. కానీ రూ.125 కోట్లకు కుదిస్తూ జీవో ఇచ్చారు. నిధులు మాత్రం విడుదల కాలేదు. ధనుంజయరెడ్డితో చాలా సార్లు మాట్లాడినా డబ్బులు విడుదల కాలేదు. కాంట్రాక్టర్ల నుంచి తీవ్ర ఒత్తిడి వచ్చింది. స్వయంగా నేనే అప్పులు తీసుకొచ్చి ఇచ్చాను. ఇలాంటి పరిస్థితుల్లో నేను ఏం చేయాలి?"

- మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆవేదన

'రోడ్లు వేశాం. రోడ్డున పడ్డాం. వర్కులు చేసేందుకు ఆస్తులు అమ్ముకొని, అప్పులు తెచ్చాం. కానీ దీర్ఘకాలంగా బిల్లులు చెల్లించడం లేదు. ఇది చాలా దుర్మార్గం. మా కుటుంబాలు విలవిల్లాడుతున్నాయి. కొందరికే బిల్లులు చెల్లిస్తూ మిగిలిన వారిపై వివక్ష చూపుతున్నారు. ఇలాంటి పరిస్థితులు ఎప్పుడూ చూడలేదు"

- ఇటీవల విజయవాడలో చేసిన ఆందోళనలో కాంట్రాక్టర్ల ఆక్రోశం



- కానీ, ఆయనకు జాప్యం లేకుండా అప్‌లోడ్
- తేడా జరిగితే ఉన్నతాధికారులు లైన్‌లోకి..
- టెండర్లు కట్టబెట్టడంలోనూ అదే దూకుడు
- కేంద్ర దర్యాప్తు సంస్థ అధికారిగా కాంట్రాక్టర్ బంధువు?
- ముఖ్యనేతకు అవసరం కాబట్టే పెద్దపీట

నెల్లూరు (ఆంధ్రజ్యోతి) : చేసిన పనులకు బిల్లులు తెచ్చుకోవడమంటే ఒక పెద్ద విజయమే సాధించినట్లుగా తయారయ్యాయి రాష్ట్రంలో పరిస్థితులు. సాధారణ కాంట్రాక్టర్లకే కాకుండా వైసీపీ నేతలకు కూడా చుక్కలు కనిపిస్తున్నాయి. ఆఖరుకు ఎంపీ, ఎమ్మెల్యే వంటి ప్రజాప్రతినిధులు కూడా తాము చేసిన పనులకు బిల్లులు విడుదల చేయించుకునేందుకు నానా అగచాట్లు పడుతున్నారు. మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల దుస్థితే దీనికి నిదర్శనం. అయితే ఒక కాంట్రాక్టర్‌కు మాత్రం ఇటు బిల్లు అప్‌లోడ్ చేయడం.. అటు విడుదల చేయడం జరిగిపోతోంది. ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో సుమారు రూ.300 కోట్ల వర్కులు చేస్తున్న ఈ కాంట్రాక్టర్‌కు చెల్లిస్తున్న బిల్లులను చూసి... మిగిలిన కాంట్రాక్టర్లు, అధికారులు ఆశ్చర్యపోతున్నారు. ఈయన కన్నా ముందు చేసిన వర్కులకు మాత్రం రూపాయి కూడా బిల్లు విడుదల కాలేదు. ఆఖరుకు సోమశిల అప్రాన్ పనులు అత్యవసరంగా చేపట్టాలని హైపవర్ కమిటీ సూచించినా, ఆ పనులకు పెండింగ్ బిల్లులు చెల్లించడం లేదు. రాష్ట్రంలో ఉన్న పెద్ద కాంట్రాక్టర్లకు కూడా సాధ్యం కాని పని హైదరాబాద్‌కు చెందిన ఆ కాంట్రాక్టర్‌కు ఎలా సాధ్యమవుతోందని మిగిలిన కాంట్రాక్టర్లు ఆరా తీయగా అసలు గుట్టు బయటపడింది. సదరు కాంట్రాక్టర్ బంధువు ఓ కేంద్ర దర్యాప్తు సంస్థలో పనిచేస్తున్నారని సమాచారం. దీంతో ఆ కాంట్రాక్టర్ అవసరం ముఖ్య నేతకు ఎంతో ఉంది. ముఖ్య నేతకు సంబంధించిన కొన్ని కేసులను దర్యాప్తు చేస్తున్న ఆ కేంద్ర దర్యాప్తు సంస్థలో సదరు కాంట్రాక్టర్ బంధువు అధికారిగా ఉండడంతోనే హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్టర్‌కు పెద్దపీట దక్కుతోందని చెప్పుకొంటున్నారు. కేంద్ర అధికారి ప్రాపకం కోసం ఈ కాంట్రాక్టర్‌ను మచ్చిక చేసుకొని ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నట్లు కాంట్రాక్టర్ల వర్గాలు చర్చించుకుంటున్నాయి. నెల్లూరులో రూ.42 కోట్లతో ఓ కాలువ ఆధునికీకరణ పనులు జరగ్గా ఇప్పటికి రూ.37 కోట్ల బిల్లులు సదరు కాంట్రాక్టరుకు చెల్లించారు. చివరి రెండు బిల్లులకుగాను మరో రూ.5 కోట్లు మాత్రమే పెండింగ్ ఉన్నాయి. అయితే ఇదే కాలువకు కొనసాగింపుగా ఉన్న మరో కాలువ పనులు రూ.5 కోట్లతో ఎప్పుడో పూర్తి చేసినా ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు. అలానే ఈ కాంట్రాక్టర్ చేస్తున్న వర్కుల్లో ఇంకో కాలువ పనులు రూ.7 కోట్లు జరగ్గా అందులో రూ.4 కోట్లు ఇప్పటికే ఇచ్చేశారు. చివరగా పెట్టిన మరో బిల్లు రావాల్సి ఉంది. అయితే ఇదే కాలువ రెండో ఫేజ్ వర్కులను వేరే కాంట్రాక్టర్ ముందే చేసి బిల్లు పెట్టినా అది విడుదల కాలేదు. ముఖ్య నేతకు కావాల్సిన కాంట్రాక్టర్‌కు సంబంధించిన బిల్లులను కూడా ఆలస్యం లేకుండా అప్‌లోడ్ చేసేస్తున్నారు. ఏమాత్రం ఆలస్యమైనా రాష్ట్ర ఉన్నతాధికారులు లైన్లోకి వస్తారని బహిరంగంగానే చెప్పుకొంటున్నారు.

బంధం బలమైనదే!

కాలువ ఆధునికీకరణ కోసం తొలుత రూ.89 కోట్లతో 2019 డిసెంబరులో టెండర్లు పిలిచారు. మొత్తం ఐదుగురు కాంట్రాక్టర్లు బిడ్‌లు దాఖలు చేశారు. అందులో సదరు కాంట్రాక్టర్‌కే వర్కు దక్కేలా మిగిలిన నలుగురు కాంట్రాక్టర్లపై ప్రభుత్వ స్థాయిలో తీవ్ర ఒత్తిళ్లు వచ్చాయి. దీంతో ఆ నలుగురిలో ఒక్క కాంట్రాక్టర్ కూడా రివర్స్ టెండరింగ్‌లో పోటీపడలేదు. ముఖ్య నేతకు కావాల్సిన కాంట్రాక్టర్‌కు టెండరు దక్కింది. ఆ తర్వాత ఈ వర్కును రూ.89 కోట్ల నుంచి 110 కోట్లకు అంచనాలు పెంచినట్లు తెలిసింది. కానీ ఈ విషయాలను బయటపెట్టేందుకు అధికారులు భయపడిపోతున్నారు. కాగా వరద ముంపు రక్షణకై మట్టి కట్ట నిర్మాణానికి సుమారు రూ.100 కోట్లతో రెండేళ్ల క్రితం టెండర్లు పిలిచారు. కానీ ముఖ్య నేతకు కావాల్సిన కాంట్రాక్టర్‌కు కాకుండా మరో కాంట్రాక్టర్‌కు ఈ వర్కు దక్కింది. దీంతో ఏకంగా ఈ టెండర్‌నే రద్దు చేశారు. ఈ దఫా మట్టి కట్ట కాదు కాంక్రీట్ వాల్ అంటూ మళ్లీ టెండర్ పిలిచారు. ఈసారి ఎలాగైనా ఆ కాంట్రాక్టర్‌కే టెండర్ దక్కేలా ఉన్నతస్థాయిలో ప్రయత్నాలు జరిగాయి. మొదట దఫా టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ ఈ దఫా పోటీలో లేకుండా ఏకంగా ఓ ప్రజాప్రతినిధి బెదిరింపులకు దిగారు. దీంతో కాంట్రాక్టర్ ఆ ప్రజాప్రతినిధిపై కేసు కూడా పెట్టారు. ఎన్ని జరిగినా చివరకు అనుకున్న విధంగా ముఖ్య నేతకు కావాల్సిన కాంట్రాక్టర్‌కు పనులు దక్కేలా చేశారు. అయితే ఇప్పుడు ఆ వర్కును మళ్లీ డిజైన్ మార్చారు. దీంతో అంచనాలు అమాంతం పెరిగిపోయాయి. ఇదే విధంగా మరో కాలువ ఆధునికీకరణకై సుమారు రూ.40 కోట్లతో రెండేళ్ల క్రితం టెండర్లు పిలిచారు. ఇక్కడ కూడా మరో కాంట్రాక్టర్ పోటీకి రాకుండా ముఖ్య నేతకు కావాల్సిన కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. సదరు కాంట్రాక్టర్‌కు ముఖ్యనేతతో ఉన్న బంధం బలాన్ని తెలిపే ఇలాంటి ఉదంతాలెన్నో నెల్లూరు జిల్లాలో వినిపిస్తున్నాయి.



నిరవధిక ధర్నాలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

అంగన్‌వాడీల నిరవధిక ధర్నా

- కలెక్టరేట్ ఎదుట 24 గంటలు కొనసాగింపు

నెల్లూరు (వైద్యం) జనవరి 6 : డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీలు తమ ఆందోళనను ఉధృతం చేస్తున్నారు. సమ్మె ఆరంభించి 26 రోజులు గడిచినా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో శనివారం నెల్లూరులోని కలెక్టరేట్ ఎదుట 24 గంటల నిరవధిక ధర్నా చేపట్టారు. జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తలు తరలివచ్చి ఈ ధర్నాలో కూర్చొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెహనాబేగం మాట్లాడారు. నా అక్కా చెల్లెళ్లు అంటూ సంబోధిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అంగన్‌వాడీల సమ్మెపై ఉక్కుపాదం మోపేలా నోటీసులు జారీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎన్ని విధాలుగా ఒత్తిడికి గురిచేసినా సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ కంటే ఎక్కువ వేతనాలు అంగన్‌వాడీలకు ఇస్తానన్న జగన్ హామీ ఇప్పుడు ఏమైందని ప్రశ్నించారు. ప్రభుత్వం వైఖరి ఇలాగే కొనసాగితే అన్ని సంఘాలను కలుపుకుని ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. ఈ ధర్నాలో సీఐటీయూ నగర కార్యదర్శి నాగేశ్వరరావు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుజాత, నేతలు కామాక్షమ్మ, రజనీ, మల్లెమ్మ, రమాదేవి, సుమతి, ఉషా, కల్పన, నాగభూషణమ్మ, రత్నమ్మ, హారతి, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్మా' ఎత్తివేయాలి!

నెల్లూరు (సాంస్కృతికం) : అంగన్‌వాడీలపై ఎస్మా చట్టం తక్షణం రద్దు చేయాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎల్లంకి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. చట్టపరంగా తమకు రావాల్సిన హక్కులు, ఉద్యోగ భద్రత గురించి శాంతియుతంగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ఉక్కుపాదం మోపడం హేయమైన చర్యగా పేర్కొన్నారు.

ఎస్మా ప్రయోగం దురదృష్టకరం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగం దురదృష్టకరమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. కలెక్టరేట్ వద్ద ధర్నాకు ఆయన సంఘీభావం తెలిపి, అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, వారి సమస్యలపై ప్రత్యేక కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ నేతలు చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి తదితర నేతలు ఆయన వెంట ఉన్నారు.

అదనపు ఎస్పీగా సౌజన్య



నెల్లూరు (క్రైం), జనవరి 6: జిల్లా అదనపు ఎస్పీగా సీహెచ్ సౌజన్య శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాజమహేంద్రవరం నుంచి నెల్లూరు ఏఎస్పీగా ఆమె బదిలీపై వచ్చారు. 2012 బ్యాచ్ డీఎస్పీగా ఎంపికైన సౌజన్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చేవెళ్ల, వికారాబాద్, తెనాలి, గుంటూరు క్రైమ్స్, ఇంటలిజెన్స్ డీఎస్పీగా పని చేశారు. రాజమహేంద్రవరంలో ఏసీబీ డీఎస్పీగా ఉన్న ఆమె 2021లో ఏఎస్పీగా పదోన్నతి లభించింది. గత నెల 15వ తేదీన సాధారణ బదిలీల్లో భాగంగా నెల్లూరు ఏఎస్పీగా ఇక్కడకు బదిలీ అయ్యారు. శనివారం బాధ్యతలు స్వీకరించిన ఏఎస్పీ సౌజన్యను ఎస్‌బీ, డీపీవో, డీసీఆర్బీ, ఏఆర్, హోంగార్డ్స్, సీసీసీ, సైబర్ టీమ్, ఐటీ కోర్‌టీం తదితర విభాగాల అధికారులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

11న జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు

నెల్లూరు (విద్య): నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 11వ తేదీన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్-సాంఘిక న్యాయం అనే అంశంపై జిల్లాస్థాయి వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ గంగాభవాని ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ స్వరాజ్ మైదానంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం ఏర్పాటు సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 12 నుంచి 15 ఏళ్ల లోపు విద్యార్థులకు ఉదయం 10 గంటలకు, 16 నుంచి 18 ఏళ్ల విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటలకు పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ.లక్ష, ద్వితీయ స్థానంకు రూ.75వేలు, తృతీయ స్థానంకు రూ.50 వేలు అందచేస్తామని తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన విద్యార్థులు ముందుగానే రిజిస్ట్రేషన్ చేసుకుని ఆధార్‌కార్డుతో పోటీలకు హాజరు కావాలని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ కోసం డీఈఓ వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు డాట్ డీఈఓ నెల్లూరు50వెబ్స్ డాట్ కామ్ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9381112743, 9494754535 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ఇదిగో.. అక్కడ రెండో వీధిలో పెద్ద బిల్డింగ్ కట్టారు... అది మనోళ్లదే.. పన్ను నామమాత్రంగా వేయ్..! మిగతాది నేను చూసుకుంటా. నువ్వు అక్కడికి వెళ్లి కొలతలేసుకుని వచ్చేయ్.. వాళ్లతో ఏమీ మాట్లాడొద్దు. ఎక్కడైనా తేడా చేశావో బాగోదు. ఫైల్ పంపేటప్పుడు ఫోన్ చేయ్.. పన్ను ఎంతన్నది నేను చెప్తా..!

- ఇది ఓ సచివాలయ అడ్మిన్‌పై స్థానిక కార్పొరేటర్ హుకుం.

చూడు... వాడెవడో నన్ను కలవకుండానే షాపింగ్ కాంప్లెక్స్ కట్టేస్తున్నాడు. కార్పొరేషన్‌లో వాడు తీసుకున్న ప్లానింగ్ అనుమతులేంటి.. చూడు. ఎలాగైనా డివియేషన్ గుర్తించి నాకు చెప్పు. ఏం చేయాలో ఆ తరువాత చెప్తా. నిర్మాణంపై నువ్వు నోటీసులు ఇవ్వు. నన్ను కలవమని వాడితో చెప్పు. మిగతాది నేను చూసుకుంటా.

- మాట వినని బిల్డర్‌ను దారిలోకి తెచ్చుకునేందుకు మరో కార్పొరేటర్ తీరిది.

మా ఆఫీసులో మీ.. పెత్తనం ఏమిటి..?

- సచివాలయాల్లో పెచ్చుమీరుతున్న కార్పొరేటర్ల జోక్యం
- అడ్మిన్, ప్లానింగ్, శానిటేషన్ కార్యదర్శులకు వేధింపులు
- కొళాయిలు వేయాలంటూ అమినిటీస్ అధికారులకు ఆదేశం
- అనర్హతలున్నా పథకాల్లో చేర్చాలంటూ ఎడ్యుకేషన్ సెక్రటరీలపై ఒత్తిడి
- ట్రేడ్ లైసెన్సుల పేరిట దుకాణాలకు నోటీసులు.. ఆపై దండకాలు!

నెల్లూరు(సిటీ), జనవరి 6

ఇలా.. నెల్లూరులో కొందరు కార్పొరేటర్లు సచివాలయాల్లో కార్యదర్శులపై మితిమీరిన పెత్తనం చెలాయిస్తున్నారు. తమ డివిజన్లలో జరుగుతున్న కట్టడాల నుంచి మామూళ్ల వసూళ్లకు సిటీ ప్లానింగ్ సెక్రటరీలను వాడేస్తున్నారు. వారితో ఉల్లంఘనలను గుర్తించి తొలుత నోటీసులు జారీ చేయించి ఆపై వారిని కలిసిన బిల్డర్లతో దండకాలు మొదలుపెడుతున్నారు. ఈ తంతు అటు సిటీ, ఇటు రూరల్ నియోజకవర్గాల్లోని డివిజన్లలో అత్యధికంగా జరుగుతోంది. ఇకపోతే నిర్మాణాలు పూర్తయిన భవనాలకు పన్ను ఎంత వేయాలన్నది కూడా స్థానికంగా ఉండే కార్పొరేటర్లే నిర్ణయిస్తున్నారు. ఈ బాధ్యతలను సచివాలయాల్లో పర్యవేక్షించే అడ్మిన్లపై పెత్తనం చెలాయిస్తూ తమ సూచనలు మేరకే పన్నులు వేయాలని స్పష్టం చేస్తున్నారు. ఈ తంతుకు ముందు భవన యజమానులతో కుమ్మక్కై పన్ను విధింపుల్లో ముడుపులు వసూళ్లు చేస్తున్నారు. డివిజన్లలో కొత్తగా ఎవరైన తాగునీటి కుళాయి వేయాలన్నా కార్పొరేటర్లే తుది నిర్ణయం గా మారింది. కార్పొరేషన్‌లో చలానాలు కట్టే పద్ధతికి పూర్తిగా విరామం ఇచ్చేసిన కార్పొరేటర్లు వీళ్లే ఆ మొత్తాన్ని దండుకుని అమినిటీస్ సెక్రటరీలతో కుళాయి కనెక్షన్లను వేయించేస్తున్నారు.



సెక్రటరీలపై కార్పొరేటర్ల వేధింపులు

నెల్లూరు నుంచి జొన్నవాడ వెళ్లే మార్గంలో శివారున ఉన్న ఓ డివిజన్‌లో కార్పొరేటర్ భర్త పోలీసు కానిస్టేబుల్ కావడంతో ఇక సచివాలయ ఉద్యోగులపై వేధింపుల పర్వానికి తెరలేపాడంటూ ఆ ప్రాంత ఉద్యోగులు వాపోతున్నారు. సచివాలయం నుంచి జరిగే ప్రతి సేవ తన అనుమతితో జరగాలంటూ హుకుం జారీ చేశాడంటూ ఆరోపణలున్నాయి. మాగుంట లేఅవుట్ ప్రాంతంలోని మరో కార్పొరేటర్ ఏకంగా సచివాలయంలోనే తిష్ట వేసి ఏ ఉద్యోగి ఏం చేయాలన్నది తాను నిర్ణయిస్తానంటూ ఆదేశాలు జారీ చేస్తూ, తనకు తెలియకుండా ఏం జరగకూడదంటూ పెత్తనం చెలాయిస్తున్నట్లు విమర్శలు గుప్పుమంటున్నాయి. నెల్లూరు- ముత్తుకూరు రహదారిలో రూరల్ ప్రాంతంలోని మరొక సచివాలయంలో కార్పొరేటర్ వేధింపులు తట్టుకోలేక ఉమెన్ ప్రొడక్షన్, ఎడ్యుకేషన్, అమినిటీస్ సెక్రటరీలు సుదీర్ఘ సెలవుల్లోకి వెళ్లగా అడ్మిన్ బదిలీకి ప్రయత్నాలు చేసుకుంటున్నారు. కాగా తన మాట వినలేదన్న కారణంతో ఓ మహిళా వలంటీరును తీసేసి మరో మహిళా వలంటీరుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. నగర నడిబొడ్డున మరో కార్పొరేటర్ భర్త తనకు వ్యతిరేకుల నివాసాల వద్ద చెత్తను కూడా తీయ్యనివ్వకుండా పారిశుధ్య సిబ్బందిపై పెత్తనం చెలాయించడం చర్చనీయాంశంగా మారింది. ఇలా కార్పొరేటర్లు, మహిళా కార్పొరేటర్ల భర్తల వేధింపులతో సచివాలయాల సిబ్బంది తీవ్ర మనో వేదనకు గురవుతున్నారు.

ట్రేడ్ లైసెన్సుల పేరిట దండకాలు

డివిజన్లలో రహదారులు, వీధులు, కూడళ్లు, విద్యాసంస్థలు, షాపింగ్ కంప్లెక్స్‌ల వద్ద దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వారి నుంచి స్థానిక కార్పొరేటర్లు ఆర్థిక దందాలకు పాల్పడుతున్నారు. దేవాలయాల వద్ద ఉన్న బొంకుల నుంచి మొక్కుల విక్రయదారులు, దేవుడు విగ్రహాల తయారీదారులు, రోడ్డు మార్జిన్ వ్యాపారులు వరకు డబ్బులు దండుకునే పనిపెట్టుకున్నారు. ఈ క్రతువుకు ముందు శానిటేషన్ సెక్రటరీలను రంగంలోకి దింపి ట్రేడ్ లైసెన్సులు కట్టాలంటూ వత్తిడి తీసుకువచ్చి ఆపై రంగంలోకి దిగి ఆర్థిక దండకాలకు తెర లేపుతున్నారు. కాగా తమకు అనుకూలస్తులు, ఓటు బ్యాంకు ఉన్న వారు అనర్హులైనప్పటికీ ప్రభుత్వ పథకాల్లో అర్హత కల్పించాలంటూ సచివాలయాల్లోని ఎడ్యుకేషన్ సెక్రటరీలపై ఒత్తిడి ఎక్కువగా పెడుతున్నట్లు తెలుస్తోంది. కొన్ని సచివాలయాల్లో ఈ తరహా ఒత్తిడిని తట్టుకోలేక ఎడ్యుకేషన్ సెక్రటరీలు బదిలీలపై వెళ్లగా మరికొందరు సుదీర్ఘ సెలవుల్లోకి వెళ్లారు.

సంక్రాంతి పండుగకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

- సాధారణ చార్జీలే వసూలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), జనవరి 6: సంక్రాంతి పండుగ సందర్భంగా ఆర్టీసీ నెల్లూరు రీజియన్ పరిధిలోని వివిధ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని జిల్లా ప్రజా రవాణా అధికారి పీవీ శేషయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి పండుగ రోజుల్లో జిల్లాకు వచ్చే ప్రయాణికుల కోసం ఈ నెల 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి నెల్లూరుకు 102, బెంగళూరు నుంచి జిల్లాలోని ముఖ్య కేంద్రాలకు 30, చెన్నై నుంచి నెల్లూరుకు 12, కర్నూలు నుంచి నెల్లూరుకు 6 ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని పేర్కొన్నారు. ప్రయాణికుల రద్దీని బట్టి తగినన్ని బస్సులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రత్యేక బస్సుల్లో సాధారణ చార్జీ మాత్రమే వసూలు చేస్తామని, ముందస్తు రిజర్వేషన్ సదుపాయము ఉందని తెలిపారు. రాను పోను కలిపి రిజర్వేషన్ చేసుకొన్న వారికి 10 శాతం రాయితీ ఇస్తున్నామని పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

జగన్‌కా దిల్ బదలావో... యా అల్లా!

- బారాషహీద్ దర్గాలో మున్సిపల్ కార్మికులు ప్రార్థనలు
- కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా

నెల్లూరు (సిటీ), జనవరి 6 : తమ సమస్యల పరిష్కారం కోసం నెల్లూరులోని బారాషహీద్ దర్గాలో పారిశుధ్య కార్మికులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా లోపల సమాధుల వద్ద 'జగన్‌కా దిల్ బదలావో యా అల్లా (జగన్ మనసు మార్చు దేవుడా)' అంటూ వేడుకున్నారు. అనంతరం అక్కడ నుంచి ర్యాలీగా బయలుదేరి నగరపాలక సంస్థ కార్యాలయం ముఖద్వారం వద్ద ధర్నా నిర్వహించారు. వీరి ఆందోళనకు కార్పొరేషన్‌లోని కంప్యూటర్ ఆపరేటర్లు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తమ ఉద్యమాన్ని ప్రభుత్వం అణచివేయాలని చూస్తే అందుకు పదింతలు ఎగసి పోరాడుతామని స్పష్టం చేశారు. తమ సమ్మె 12వ రోజుకు చేరినా ఉద్యమకారుల్లో ఏమాత్రం ఉత్సాహం తగ్గలేదని, ప్రభుత్వ దిగివచ్చే వరకు ఈ పోరాటం కొనసాగుతుందన్నారు. ప్రతిపక్షంలో ఇచ్చిన మాటను నిలపెట్టుకోవడానికి కూడా సీఎం జగన్ సిద్ధంగా లేకపోతే ఎలా...? అంటూ ప్రశ్నించారు. ఈ ఆందోళనలో నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, కత్తి శ్రీనివాసులు, బత్తల కృష్ణయ్య, కన్నెర కుమార్, అల్లాడిగోపాల్, నరసింహులు పాల్గొన్నారు. కాగా, కందుకూరులో పారిశుధ్య కార్మికులు భిక్షాటన చేయగా, ఆత్మకూరు మున్సిపాల్ కార్యాలయం ఎదుట ధర్నా, కావలిలో సీఐటీయూ, ఏఐటీయూసీ కార్మికులు వేర్వేరుగా ఆందోళన చేశారు.



నెల్లూరు : బారాషహీద్ దర్గాలో ప్రార్థనలు చేస్తున్న కార్మికులు



కందుకూరులో భిక్షాటన చేస్తున్న కార్మికులు

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

నిర్బంధాలతో ఉద్యమాలు అణచలేరు : సీఐటీయూ

కావలి, జనవరి 6: నిర్బంధాలతో ఉద్యమాలను అణగ దొక్కలేరని సీఐటీయూ నాయకుడు పసుపులేటి పెంచలయ్య తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం శనివారం 26వ రోజు అంగన్‌వాడీలు సమ్మె చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయానికి ఎదురుగా టెంట్‌లో కూర్చున్న అంగన్‌వాడీలు ఒంటి కాలిపై నిలబడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐ టీయూ పట్టణ కార్యదర్శి వై. కృష్ణ మోహన్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు టీ. రఘురావమ్మ, సుభాషిణి, విజయలత, పెంచలమ్మ, తదితరులు పాల్గొన్నారు.



కావలి: ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



ఆత్మకూరు : నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఆత్మకూరు: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. శనివారం వారు విధులను బహిష్కరించి ఆత్మకూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో బైఠాయించి సమ్మెను కొనసాగించారు. సీఐటీయు నాయకులు శిబిరానికి విచ్చేసి సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కమిటీ ప్రధాన కార్యదర్శి పి రాధ, పలువురు సెక్టార్ లీడర్లు కె రమణమ్మ, కామేశ్వరి, జమీల, విజయలక్ష్మీ, రూతమ్మ, విజయలక్ష్మీ, శ్రీదేవి, ఏ మస్తానమ్మ, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

ఉదయగిరి: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోతే న్యాయ పోరాటం ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె అజయ్ కుమార్ హెచ్చరించారు. శనివారం స్థానిక సీడీపీవో కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేపట్టిన 26వ రోజు సమ్మెలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమలో సీఐటీయూ నాయకులు కాకు వెంకటయ్య, కోడె రమణయ్య, మల్లికార్జున, రజియా, ప్రమీలా, రమాదేవి, వెంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

జీవో ఉపసంహరించుకోవాలి

కందుకూరు: అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగిస్తూ జారీచేసిన జీవోను తక్షణం ఉప సంహరించుకోవాలని టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి జి మోషే డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలను ఉద్యోగాల్లోంచి గెంటేయటం అమ్మను గెంటేసినంత ఈజీకాదన్న విషయాన్ని జగన్మోహన్‌రెడ్డి గుర్తించాలన్నారు. జీవోను ఉపసంహరించి న్యాయం చేయాలని మోషే డిమాండ్ చేశారు.

ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు : ఎమ్మెల్యే

వలేటివారిపాలెం, జనవరి 6: అర్హత కలిగిన ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించినట్లు కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీదర్‌రెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం పింఛన్ల పంపిణీ జరిగింది.ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పీ మౌనిక, జడ్పీటీసీ ఈ భారతి, డీఎల్‌డీవో పద్మజ, ఎంపీడీవో రఫీక్‌అహ్మద్, తహసీల్దార్ సుదరమ్మ, ఎంపీటీసీ చింతలపూడి రవీంద్ర, సర్పంచి డేగా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

● భక్తులకు వసతుల కల్పనే ధ్యేయం

లక్ష్మీనరసింహుడి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతుల కల్పనే తమ ధ్యేయమని అని ఎమ్మెల్యే మానుగుంట మహీదర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామిని శనివారం ఎమ్మెల్యే దర్శించుకున్నారు. ఆయనకు ఆయనకు అధికారులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఆయన వెంట ఆలయ ఏసీ కే.బీ శ్రీనివాసరావు, ఎస్ఐ బాలమహేంద్రనాయక్ తదితరులు ఉన్నారు.

● వైభవంగా శ్రీరామచంద్రుడి ఉత్సవాలు

వలేటివారిపాలెం మండలంలోని కొండసముద్రం శ్రీరామచంద్రస్వామి ఆలయంలో శనివారం ఉత్సవాలు వైభవంగా జరిగాయి. నూతన విగ్రహాల ప్రతిష్ఠ జరిగి 46 రోజులు పూర్తయిన సందర్భంగా గ్రామస్థులు ఈ ఉత్సవాలు నిర్వహించారు. అర్చకులు శ్రీరామచంద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచి మన్నం వెంగమ్మలు, వెంకటరమేష్ పాల్గొన్నారు.

కందుకూరులో మున్సిపల్ కార్మికుల భిక్షాటన

కావలి, జనవరి 6 : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు శనివారం మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె కొనసాగించారు. సీఐటీయూ అనుబంధ కార్మికులు మున్సిపల్ కార్యాలయ ప్రధాన గేటు వద్ద ధర్నా చేపట్టారు. ఏఐటీయూసీ అనుబంధ కార్మికులు శిబిరంలో కూర్చుని ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు దామా అంకయ్య, కొప్పర్తి నాగరాజు, ఏఐటీయూసీ నాయకులు ఆదినారాయణ, తన్నీరు వెంకటేష్, సీఐటీయూ నాయకులు పీ. పెంచలయ్య, వై. కృష్ణమోహన్, కార్మిక యూనియన్ నాయకులు టీ శీనయ్య, బీ మహేష్ పాల్గొన్నారు.

కందుకూరు : జీతాలు పెంచాలని, ఎన్నికల సమయంలో జగన్ ఇచ్చిన హామీలు అమలుచేయాలని కోరుతూ సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులు శనివారం పట్టణంలో భిక్షాటన చేశారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం సెంటర్‌లో జరిగిన రిలే దీక్షలో పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని వాణిజ్య దుకాణాలకు వెళ్లి కార్మికులు భిక్షాటన చేసి నిరసనను తెలియజేశారు. కార్యక్రమంలో సీపీఐ నేత బూసి సురేష్‌బాబు, ఏఐటీయూసీ నేత వై. ఆనంద్‌మోహన్, సీఐటీయూ నాయకుడే ఎస్ఏ గౌస్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కాకుమాని రవణమ్మ, పులి నాగేశ్వరరావు, మెండా మహేంద్ర, శేషమ్మ, కొండమ్మ పాల్గొన్నారు.



కావలి : సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఆత్మకూరు : సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం కొనసాగింది. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయు, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. వీరికి మద్దతుగా టీడీపీ, సీపీఎం, సీఐటీయు నాయకులు నిరసనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తుమ్మల చంద్రారెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, మున్సిపల్ కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి, సీపీఎం, సీఐటీయు నాయకులు కె డేవిడ్‌రాజు, జి లక్ష్మీపతి, ఆత్మకూరు నాగయ్య, కొండమూరి హజరత్తయ్య, పలువురు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

సంగంలో జేసీ పర్యటన



రేషన్ సరుకుల పంపిణీని పరిశీలిస్తున్న జేసీ

సంగం, జనవరి 6: సంగంలో శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ రోనంకి కూర్మనాథ్ పర్యటించారు. ముందుగా సంగంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. సాయినగర్‌లోని రేషన్ ఎండియు వాహనాన్ని తనిఖీ చేసి రేషన్ పంపిణీ తీరుపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జంగాలకండ్రికలో రీసర్వే గ్రామసభలో పాల్గొన్నారు.

ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలి

వింజమూరు, జనవరి 6: పట్టణంలోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో శనివారం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గొంగటి రఘునాథరెడ్డి అధ్యక్షతన తెలుగుదేశం పార్టీ క్లస్టర్ యూనిట్ ఇన్‌చార్జ్‌ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యకర్తలందరూ రాబోవు ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు నర్సారెడ్డి, చల్ల వెంకటేశ్వర్లు, ఖాజావలి, కొండపల్లి వెంకటేశ్వరనాయుడు, ఎరుకులనాయుడు, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

ఉపాధి హామీ నిర్వహణలో మేట్లదే కీలకపాత్ర

ఉదయగిరి, జనవరి 6: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిర్వహణలో మేట్లదే కీలకపాత్ర అని ఎంపీడీవో ఈశ్వరమ్మ అన్నారు. శనివారం స్థానిక స్త్రీశక్తి భవనంలో మేట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతిఒక్కరికీ పని కల్పించాలని కోరారు. కనీస వేతనం గిట్టుబాటయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

అయోధ్య కరసేవలకు సన్మానం



సన్మాన సభలో మాట్లాడుతున్న నాయకులు

వింజమూరు, జనవరి 6: పట్టణంలోని శివాలయంలో శనివారం అయోధ్య కరసేవలకు బీజేపీ ఆధ్వర్యంలో సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షుడు డేగ మధుయాదవ్ అధ్యక్షత వహించగా పార్టీ జిల్లా నాయకులు కాలం బుజ్జిరెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొని కరసేవలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కదిరి రంగారావు, జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణరెడ్డి, సీనియర్ నాయకుడు రఘురామిరెడ్డి, విశ్వహిందూ పరిషత్ నాయకులు ఎ రమణయ్య, ఆర్ఎస్ఎస్ నాయకులు బ్రహ్మయ్య, మాధవ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

సంగం, జనవరి 6 : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఏపీ ఫుడ్ కమిషన్ మెంబర్ జి దేవి సూచించారు. శనివారం ఆమె సంగంలోని బాలికల గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. వంటగది, సరుకుల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థుల వద్దకు వెళ్లి భోజనం నాణ్య తను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తినకుండా విద్యార్థులు ఇళ్ల నుంచి క్యారేజీలు తెచ్చుకుంటున్న విషయం గమనించామన్నారు. ప్రతి విద్యార్థి పాఠశాలలోనే భోజనం తినేలా చూడాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు.



విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న ఏపీ ఫుడ్ కమిషన్ మెంబర్ దేవి

చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులు

కందుకూరు, జనవరి 6: కందుకూరు నియోజకవర్గానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో శనివారం పార్టీలో చేరారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కనిగిరి వెళ్లిన వీరంతా వైసీపీని వీడి తెలుగుదేశంలో చేరేందుకు సంసిద్ధత వ్యక్తం చేయగా వారందరికీ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఉలవపాడు మండలం కృష్ణాపురం సర్పంచి మండాడి సుశీలమ్మ, వైసీపీ నాయకులు మండాడి హనుమంతరావు, మండాడి వెంకటేష్, మహేష్, వినోద్‌కుమార్, దేవండ్ల వెంకయ్య, వెంకటేశ్వర్లు, బండారు లక్ష్మయ్య, తిరుపతి వెంకయ్య, బొజ్జ చంద్ర, యనమల బాలయ్య, చల్లా వెంకటయ్య, కొల్లి గంగరాజు, ఉలవపాడుకు చెందిన దాసరి వెంకటరావు, పాలకీర్తి శ్రీనివాసులు, మద్దసాని నవీన్‌కృష్ణ యాదవ్, రావినూతల రాజా, గొత్తుల శ్రీనివాసులు, జి. ఏడుకొండలు, గుడ్లూరు మండలం చేవూరుకి చెందిన ఉప్పు వెంకటేష్, నక్కల వినోద్, దారకానిపాడుకు చెందిన చల్లా రత్తయ్య, కందుకూరు మండలం కోవూరుకి చెందిన కోవూరు శ్రీరాములు తదితరులు పార్టీలో చేరారు.



చంద్రబాబు, ఇంటూరి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

ప్రజలకు మెరుగైన సేవలు అందించండి

లింగసముద్రం, జనవరి 6: ప్రజలకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందించేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని కందుకూరు సబ్ కలెక్టర్ జీ విద్యాధరి ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె శనివారం మధ్యాహ్నం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేశారు. ఎన్నికల క్లెయిమ్స్ పెండింగ్‌లో ఉన్నాయా అని అడగ్గా, పెండింగ్‌లో లేవని తహసీల్దార్ చెప్పారు.రీ సర్వే గురించి కూడా ప్రశ్నించారు. కార్యాలయం ఆవరణలో నిర్మాణం పూర్తయిన డిజిటల్ లైబ్రరీని పరిశీలించారు.అంతకుముందు ఆమె వెంగళాపురంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు.కేంద్రంలోని పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నారా, లేదా, కేంద్రాలను ఎవరు నిర్వహిస్తున్నారని అడగారు.

నృత్యాలతో కరోనాపై అవగాహన

కావలి, జనవరి 6: కరోనా ప్రభావంపై ప్రజలకు స్థానిక శ్రీలక్ష్మీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు చెందిన ఫిజియోథెరపీ, నర్సింగ్ విద్యార్థులు శనివారం మెరుపు నృత్యాల(ఫ్లాష్ మోబ్)తో అవగాహన కల్పించారు. ఆర్టీసీ బస్టాండ్ సెంటర్, ఉదయగిరి బ్రిడ్జి కూడలిలో మానవహారంగా ఏర్పడి, చైతన్య గీతాలకు నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాధవరెడ్డి, రెడ్‌క్రాస్ కావలి చైర్మన్ రవిప్రకాష్, ఆర్టీసీ డీఎం ఆర్ శ్రీనివాసులు మాట్లాడుతూ పొంచి ఉన్న కరోనా ముప్పు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అనంతరం రెడ్‌క్రాస్ వలంటీర్లు మాస్కులు పంపిణీ చేశారు.

మిస్టరీగా వృద్ధురాలి హత్య

● అనుమానితులను విచారిస్తున్న పోలీసులు

కందుకూరు, జనవరి 6: చుట్టుగుంటలో దారుణహత్యకు గురైన మండలపు శేషమ్మ కేసు మిస్టరీగా మారింది. మూడురోజులుగా పోలీసులు అనుమానితులను విచారిస్తున్నా కీలక ఆధారం లభ్యం కాలేదని సమాచారం. అనుమానితులు తమకు ఎలాంటి సంబంధం లేదని సాక్ష్యాలతో నిరూపిస్తుండటంతో ఇప్పటికే పోలీసులు విచారించి పంపించేశారు. మరికొందరు అనుమానితులు పోలీసుల అదుపులో ఉన్నప్పటికీ వారినుంచి కూడా హత్యకు సంబంధించిన ఎలాంటి సమాచారాన్ని కూడా రాబట్టలేదని తెలిసింది. కనీసం ఈ హత్య జరిగేందుకు ఏవైనా కారణాలు ఉండి ఉంటాయా అన్న కోణంలో కూడా సమాచారం రాకపోతుండటం, కుటుంబసభ్యులు కూడా ఎలాంటి క్లూ ఇవ్వలేని పరిస్థితిలో శేషమ్మ హత్యకేసు మిస్టరీగా మారింది.

గిరిజనులు అభివృద్ధి పథంలో నడవాలి : బీఎమ్మార్

అల్లూరు, జనవరి 6 : సమాజంలో గిరిజనులు అభివృద్ధి పథంలో నడవాలని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు అన్నారు. మండలంలోని ఇస్కుపల్లి బీఎంఆర్ గిరిజన కాలనీలో శనివారం జగనన్న గృహ నిర్మాణాలకు శంకుస్థాపన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గిరిజనుల కోసం ప్రత్యేక పథకాలు ఉన్నాయని, వారి అభివృద్ధికి పలు మార్గాలను ప్రభుత్వాలు రూపొందిస్తున్నాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ డీ శశిరేఖ, స్థానిక నాయకులు బీద రమేష్‌బాబు, సర్పంచి రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గృహాల శంకుస్థాపనలో బీద మస్తాన్‌రావు

నేడు కరసేవకులకు సత్కారం

కందుకూరు : రామమందిరం కోసం అయోధ్య వెళ్లిన కరసేవకులకు బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం సత్కారం నిర్వహించనున్నట్లు ఆపార్టీ నాయకుడు మన్నేపల్లి వరప్రసాదరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు పెద్దబజారులోని కోదండరామాలయంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఈవీఎంలపై అవగాహన



ఈవీఎంల పనితీరును వివరిస్తున్న తహసీల్దారు

సీతారామపురం, జనవరి 6: ఎన్నికల సమీపిస్తుండడంతో ఈవీఎం మిషన్, ఓటు నమోదు ప్రింటింగ్ యంత్రాలపై శనివారం స్థానిక శ్రీశక్తి భవన్ కార్యాలయంలో బీఎల్‌వోలకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం సీతారామపురం, బసినేనిపల్లి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ పరిధిలోని ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సుధాకర్‌రావు, ఇన్చార్జ్ ఎంపీడీవో భార్గవి తదితరులు పాల్గొన్నారు.

51 మద్యం సీసాల స్వాధీనం

ఉదయగిరి రూరల్, జనవరి 6: పట్టణంలోని గండిపాళెం మార్గంలో గల పెట్రోల్‌బంకు ఎదురుగా ఉన్న కూల్‌డ్రింక్స్ దుకాణాలపై శనివారం ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఉన్నతాధికారుల సమాచారం మేరకు కూల్‌డ్రింక్స్ దుకాణాలపై దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో నాగిళ్ల మార్తమ్మ వద్ద 23, నాగిళ్ల బాలమ్మ వద్ద 23 మద్యం సీసాలు, 5 బీర్లతోపాటు మొత్తం 51 సీసాలను స్వాధీనం చేసుకొని వారిని అదుపులోకి తీసుకొన్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా ఎవరైనా అక్రమ మద్యం విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో ఎస్ఐ, సిబ్బంది

ఆలయాభివృద్ధికి విరాళం

కావలి : రూరల్ మండలం కొత్తసత్రంలోని ఇందిరానగర్ ఉన్న రామాలయం అభివృద్ధికి పీఎస్సార్ ట్రస్ట్ చైర్మన్ పసుపులేటి సుధా కర్ రూ.2 లక్షలు విరాళం అందించారు. శనివారం గ్రామంలో పర్య టిస్తున్న సుధాకర్‌ను గ్రామస్థులు కలిసి ఆలయ అభివృద్ధికి సహ క రించాలని కోరారు. దీంతో ఆయన రూ. 2 లక్షలను ఆలయ కమి టీ సభ్యులకు అందచేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు పసుపులేటిని అభినందించారు.



విరాళం అందిస్తున్న సుధాకర్

మాలకొండ ఆదాయం రూ. 6,73,860

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 6,73,860 ఆదాయం లభించినట్లు ఆలయ ఏసీ కే.బీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టికెట్ల ద్వారా రూ. 4,250, కుంకుమార్చన ద్వారా రూ. 19,880, వివాహాల ద్వారా రూ. 10 వేలు, తలనీలాల ద్వారా రూ. 20,525, వాహనపూజల ద్వారా రూ. 2,720, ప్రత్యేకదర్శనం ద్వారా రూ. 1,15,600, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 980, రూముఅద్దెల ద్వారా రూ. 32,460, కవర్ల ద్వారా రూ. 3,600, లడ్డూ ప్రసాదం ద్వారా రూ. 1,62,215, అన్నదానం ద్వారా రూ. 2,72,898, విరాళాల ద్వారా రూ. 28,732 ఆదాయం లభించినట్లు ఆయన వివరించారు.

మార్పు బాలకృష్ణమ్మకు ఘన నివాళి

కలువాయి, జనవరి 6 : ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా, ఉద్యమకర్తగా ఉపాధ్యాయులకు సేవలు అందించిన మార్పు బాలకృష్ణమ్మ వర్ధంతి శనివారం కలువాయి ఏపీటీఎఫ్-1938 కార్యాయలంలో నిర్వహించారు. బాలకృష్ణమ్మ చిత్రపటంకు పూలమాల వేసి నివాళు ర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి జీవీ మురళీకృష్ణ, అధ్యక్షుడు నాపా నాగరాజు, ఉపాధ్యాయులు షేక్ రఫీ, జీ నందకిషోర్, కె దిలీప్‌కుమార్, జీవీ రమణయ్య, టీపీ నరసింహులు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గ్రామాల్లో యథేచ్ఛగా బెల్టు షాపులు

లింగసముద్రం, జనవరి 6 : మండలంలోని అన్ని గ్రామాల్లో మద్యం బెల్టు షాపులు యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. గ్రామాల్లోని బంకులు, బడ్డీ కొట్లు, ఇంకా చిన్న చిన్న అంగళ్లు, కొన్ని ఇళ్లలో మద్యం సీసాలు నిల్వ ఉంచుకొని అమ్ముకుంటున్నారు. ఈ మద్యం సీసాలు ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచే సరఫరా అవుతున్నట్లు ఆరోపణలున్నాయి. మండలంలోని లింగసముద్రం, పెదపవని గ్రామాల్లో ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నాయి. వాస్తవానికి ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు బెల్టు షాపుల నిర్వాహకులు మద్యం సీసాలను ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో తీసుకెళుతుంటారు. అయితే వీరు మద్యం దుకాణాల వద్ద ఒక్కో సీసాపై రూ.10 నుంచి రూ.20 వరకు అధికంగా సొమ్ము చెల్లించి కొనుగోలు చేసి, తమ బెల్టు షాపుల వద్ద రూ.20 నుంచి రూ.50 అధిక ధరకు అమ్ముతుంటారు. మంచినీరు, కూల్‌డ్రింక్స్ ఇతర వస్తువులు విక్రయిస్తూ, వాటితోపాటు మద్యం కూడా అమ్ముతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా మండలంలో ప్రతి గ్రామంలో మద్యం సులభంగా దొరుకుతుండడంతో యువకులు మద్యానికి బానిసలై కుటుంబాలను గుల్ల చేసుకుంటున్నారు. సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోకపోవడంతో మద్యం ఏరులై పారుతోంది.ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నడివీధి పోలేరమ్మ జాతరకు అంకురార్పణ

కావలి, జనవరి6 : పట్టణంలోని పాతూరు నడివీధి పోలేరమ్మ జాతరకు శనివారం అంకురార్పణ జరిగింది. అమ్మవారి వద్ద ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆయన సతీమణి ఆది లక్ష్మీలు పూజలు నిర్వహించి, హారతులిచ్చి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో దొడ్ల వినయకుమార్‌రెడ్డి, కాటా వెంకారెడ్డి, ఈతముక్కల బాల మురళీధర్ రెడ్డి, దొడ్ల మనోహర్ రెడ్డి, జనిగర్ల మహేంద్ర యాదవ్, కాటా శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు. జాతర ఏర్పాట్లను డీఎస్పీ ఎం. వెంకటరమణ, సీఐ రాజేష్‌లు పరిశీలించారు.

బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు

కావలి : చిన్న వయసులోనే అమ్మాయిలకు వివాహాలు చేస్తే ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ తెలిపారు. ప్రియదర్శిని మహిళామండలి ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం విద్య ప్రాముఖ్యత, బాల్య వివాహాల ప్రభావంపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయిని ఏఎంవీ శేషమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో ఖాదర్‌బీ, షేక్ ఖాదర్‌బాష, మహ్మద్ అబ్దుల్ అలీమ్, ఎంవీ ప్రసాద్‌రావు, మొఘల్‌సిరాజ్‌బేగ్, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులను కాపాడాలని ధర్నా

కావలి : దళిత, గిరిజన హాస్టళ్లలో ఉన్న విద్యార్థులను కష్టాల నుంచి కాపాడాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్. మల్లి తెలిపారు. శనివారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేసి ఆర్డీవో శీనానాయక్‌కు వినతిపత్రం అందచేశారు. దళితగిరిజన హాస్టళ్ల శ్లాబ్ పెచ్చులు ఊడుతూ, తలుపులు లేక శిథిలావస్థకు చేరాయన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో దళిత నేతలు విజయరత్నం, జీ. అశోక్, ఎన్ రుషి, కే. చందు, శశికుమార్, చౌటూరి వెంకటరత్నం, గోళ్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

దగదర్తి(బిట్రగుంట): దగదర్తి మండలం చెన్నూరులో శనివారం ఎంపీపీ తాళ్ళూరి వెంకటకృష్ణ ప్రసాద్‌నాయుడు ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పీ అనిల్‌కుమార్‌రెడ్డి, మండల యువత అధ్యక్షుడు వీ మహేష్‌నాయుడు, ఎంపీటీసీ సీహెచ్ సుశీల, మాజీ ఎంపీటీసీ వీ ఆదిశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు, ఏఎస్ పేట

అభివృద్ధికి నిపుణుల బృందం ప్రణాళిక



ఏఎస్ పేట, జనవరి 6: ఆత్మకూరు, ఏఎస్ పేట ప్రాంతాలను ఏడీఎఫ్ సహకారంతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపకల్పనకు నిపుణుల బృందం శనివారం పర్యటించింది. ఏడీఎఫ్ సభ్యుల కోరిక మేరకు ఆత్మకూరు, ఏఎస్ పేట ప్రాంతాల్లో పర్యటించి, తొలుత ఏఎస్ పేట ఖాజా నాయబ్‌రసూల్ దర్గాను సందర్శించారు. అనంతరం దర్గా పరిసర ప్రాంతాల్లో పరిశీలించి, తక్కువ స్థలంలో ఎక్కువ మంది ఉన్నారని, ఆధునీకరణతో అభివృద్ధి చేస్తే దర్గాకు అధిక సంఖ్యలో భక్తులు పెరిగే అవకాశం వుందన్నారు. అనంతరం ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డితో కలిసి మున్సిపాలిటీ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై చర్చించారు. అందుకు ప్రణాళికను తయారు చేసి త్వరలో ఎమ్మెల్యేకి అందిస్తున్నట్లు బృందం తెలిపింది.

కుమార్తె పెళ్లి సంబంధాలకు వెళుతూ తండ్రి మృతి

లింగసముద్రం, జనవరి 6 : కుమార్తెకు పెళ్లి సంబంధం మాట్లాడా నికి వెళ్తూ కందుకూరుకు చెందిన షేక్ కాలేషా(67)మృతి చెందారు.ఈ సం ఘటన ఉలవపాడు మండలం కే రాజుపాలెం-చాగల్లు మధ్య జాతీయ రహ దారిపై శనివారం చోటుచేసుకుంది. కందుకూరుకి చెందిన కాలేషా కారులో తన బంధువులు నలుగురితో కలిసి కుమార్తె వివాహం గురించి మాట్లాడానికి నెల్లూరు వెళ్తూ ముందు వెళ్తున్న టిప్పర్‌ను వెనుక నుంచి ఢీ కొట్టాడు. ముందు వెళ్తున్న వాహనాన్ని క్రాస్ చేసే సమయంలో ఈ ప్రమాదం జరిగింది.ఈ సంఘటనలో కాలేషా మృతి చెందగా, మి గిలిన ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.విషయం తెలిసిన ఎస్సై బాజిరెడ్డి సంఘ టనా స్థలానికి వెళ్లి కాలేషా మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం వైద్యశాలకు తరలిం చారు.ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.



నుజ్జు నుజ్జయిన కారు

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ఆత్మకూరు, జనవరి 6 : పట్టణంలో ఇటీవల మృతిచెందిన నలుగురి కుటుంబ సభ్యులకు శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి శనివారం ఆర్థిక సాయం అందచేశారు. 22 వార్డులోని తోటి చినకొండయ్య, జేఆర్ పేటలోని షేక్ సత్తార్, క్రిస్టియన్‌పేటలోని కనుపూరు ప్రేమకుమార్, 9వ వార్డులోని సిద్దివాటం సీతారామయ్య కుటుంబాలను ఆయన పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.10 వేల వంతున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ కౌన్సిలర్లు షేక్ మహబూబ్‌బాష, సూరా భాస్కర్‌రెడ్డి మెప్మా రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు కేవి శేషారెడ్డి, యానాదిరెడ్డి, రాంపల్లి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

వేగంగా బైపాస్ పనులు

వలేటివారిపాలెం : ప్రకాశం జిల్లా సింగరాయికొండ నుంచి నెల్లూరు జిల్లా మాలకొండ వరకు బైపాస్ రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సుమారు రూ.233 కోట్లతో 45.7 కిలోమీటర్లు పొడవున నాలుగు వరుసలతో ఈ రోడ్డు నిర్మిస్తున్నారు. మండలంలోని అయ్యవారిపల్లె, చుండి, వలేటివారిపాలెం, పోలినేనిపాలెం, కూనిపాలెం, పో కూరు, తదితర గ్రామాల గుండా జరుగుతున్న బైపాస్‌లో వంతెనల పనులు చివరి దశలో ఉన్నాయి. పనులు పూర్తయి వాహనాలు రాకపోకలు సాగిస్తే ట్రాఫిక్ సమస్యలు తీరుతాయి.

వైభవంగా ఊంజల్‌సేవ

బిట్రగుంట : బోగోలు మండలం కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరుడికి శనివారం ప్రత్యేక పూజలు ,అభిషేకాలు,ఊంజలసేవ వైభవంగా జరిగాయి. నెల్లూరుకు చెందిన పాతపాటి మధుసూదన్‌రెడ్డి-సులోచన దంపతులు భక్తులకు అన్నసంతర్పణ చేశారు. ఊంజలసేవ ఉభయ కర్తలుగా నెల్లూరు జడ్పీ కాలనీకి చెందిన చాకవరపు కృష్ణయ్య-గిరిజమ్మ దంపతులు వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రాధాకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

